16-8-2025
శనివారం సంపుటి: 31
సంచిక: 196 పేజీలు:
12 వెల: 6.50

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

: fb.com/vaartha Digital
epaper.vaartha.com
WWW.VAARTHA.COM

విజయవాడ

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam






శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని ఎర్రకోటనుంచి ప్రసంగిస్తున్న ప్రధాని మోడీ

# 'సుదర్శనం' శత్రు దుర్భేద్యం

## బహుళ అంచెలతో దేశ రక్షణ కవచం

## ఇజ్రాయెల్ ఐరన్‌డోమ్, అమెరికా గోల్డెన్ డోమ్ కంటే ఇది అధునాతనం

## 100 గంటల పాటు పాక్‌ను వణికించిన 'సూపర్ చక్రం'

## స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ,ఆగస్టు 15:** ఇతర అభివృద్ధిచెందిన దేశాల తరహాలోనే దేశ రక్షణ కవచంగా సుదర్శన్‌చక్ర బహుళ అంచెల రక్షణ వ్యవస్థను ఏర్పాటుచేస్తున్నట్లు ప్రధాని నరేంద్రమోడీ ప్రకటించారు. 79వ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ఎర్రకోట బురుజునుంచి మాట్లాడిన మోడీ అత్యాధునిక సమీకృత నిఘా వ్యవస్థ, సైబర్ రక్షణ, భౌతిక దాడులనుంచి ఈ రక్షణ వ్యవస్థ పరిరక్షిస్తుందని పేర్కొన్నారు. మన పౌరుల భద్రతతోపాటు, మన మౌలికవనరుల పరిరక్షణ, శత్రుదాడులను చాకచక్యంగా ఎదుర్కొనడం వంటివి ఈ రక్షణ వ్యవస్థ మూలశక్తులని అన్నారు. ఉగ్రదాడులుసైతం ఎదుర్కొనే శత్రుదుర్భేధ్యంగా ఈసుదర్శన చక్ర వ్యవస్థ ఉంటుందన్నారు. ఇజ్రాయెల్ ఐరన్‌డోమ్, అమెరికా ప్రతిపాదించిన గోల్డెన్ >>2

## దేశ యువతకోసం లక్ష కోట్లతో ప్రణాళిక 2లో



శుక్రవారం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం అభివాదం చేస్తున్న సిఎం చంద్రబాబు

సూపర్‌సిక్స్‌ను సూపర్ హిట్ చేశాం
ప్రభుత్వంలో సంక్షేమానికి సాటి, అభివృద్ధికి అడ్డులేదు
2027 డిసెంబర్‌కు పోలవరం పూర్తి
స్వాతంత్ర్యదినోత్సవ ప్రసంగంలో సిఎం చంద్రబాబు

# బనకచర్లకు కట్టుబడి ఉన్నాం

**విజయవాడ,ఆగస్టు15,ప్రభాతవార్తప్రతినిధి:** కూటమిప్రభుత్వంలోసంక్షేమానికి సాటి లేకపోవటంతో పాటు, అభివృద్ధికి అడ్డు, సుపరిపాలనకు పోటీ కూడా లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇది ఆల్ టైం రికార్డ్ అని అభివర్ణించారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అంటూ స్వా తంత్ర్య దినోత్సవ వేదిక నుంచి చంద్రబాబు సగర్వంగా ప్రకటించారు. తన ఉద్వేగ >>2

## ప్రజాస్వామ్యంలో న్యాయ వ్యవస్థ ఓ పటిష్ట పునాది

### హైకోర్టు సిజె ధీరజ్ సింగ్ ఠాకూర్




జాతీయ జెండాను ఆవిష్కరించిన సిజె

**విజయవాడ, ఆగస్టు 15,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర రాజధాని అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. హైకోర్టు ప్రాంగణంలో శుక్రవారం ఉదయం జరిగిన ఈవేడుకలకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ముఖ్య అతిధిగా పాల్గొని మువ్వన్నెల జాతీయ జెండాను ఆవిష్కరించారు. జాతీయ పతాకానికి సెల్యూట్ చేసి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. దేశానికి స్వాతంత్ర్యాన్ని తీసుకొచ్చేందుకు ప్రాణాలను సైతం అర్పించిన మహానుభావులకు శిరస్సు వంచి పుష్పాంజలి ఘటించారు. ఈసందర్భంగా జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ స్వరాజ్యం, స్వపరిపాలన భారతీయుల జన్మహక్కు అంటూ నినాదాలు చేస్తూ స్వాతంత్ర్య సాధనకై ఎంతో మంది తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి వలస వాదుల పాన నుండి భారత దేశాన్నికి విముక్తి కలిగించారన్నారు. నేడు అటువంటి మహానుభావుల అందరినీ స్మరించుకుంటూ శిరస్సు వంచి ప్రణామాలు చేయాల్సిన శుభదినం అన్నారు. ఆ మహానుభావులు దేశానికి చెందిన సేవలను ప్రశంసిస్తూ వారి అడుగుజాడల్లో రాష్ట్ర ప్రజలు అందరూ నడుస్తూ రాష్ట్ర అభివృద్ధికి పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. వారి దేశభక్తి, జాతీయవాదం ప్రస్తుత మరియు రానున్న తరాలవారికి ఎంతో స్ఫూర్తిదాయకం అన్నారు. దేశ సమైఖ్యతను, సమగ్రతను కాపాడేందుకు సరిహద్దుల్లో నిరంతరం పాటుపడుతున్న సాయుధ ధళాల సేవలకు మనం అందరం ఎల్లవేళలా కృతజ్ఞులై ఉండాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో న్యాయ వ్యవస్థ ఒక పట్టిష్టమైన పిల్లరు అని, సమాజంలో ఉత్పన్నమయ్యే వివిధ సమస్యలు, పోటీలు, అంతర్రాష్ట్ర హక్కుల వివాదాలు వంటి సంక్లిష్ట అంశాలను న్యాయవ్యవస్థ ఎంతో సమర్ధవంతంగా పరిష్కరిస్తోందన్నారు. దీంతో న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం విపరీతంగా పెరిగిందన్నారు. భారత రాజ్యాంగంలో పొందుపర్చిన విధంగా దేశ ప్రజలందరికీ సమాన న్యాయం, సమానత్వం , స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను అందజేయాలనే లక్ష్యంలో భాగంగా న్యాయ వ్యవస్థ ఎంతగానో కృషి చేస్తున్నది అన్నారు. ఈ శుభ సందర్భంగా బలమైన, ఐక్యమైన, ప్రగతిశీల భారతదేశ నిర్మాణానికి మనమంతా అంకితమై ఉన్నామనే సంకల్పాన్ని పునరుద్ఘాటించు కోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. >>2

# అన్నగా ఇచ్చే వరం 'ఉచిత బస్సు'


## 'స్త్రీ శక్తి' పథకాన్ని ప్రారంభించిన సిఎం చంద్రబాబు, మహిళలకు ఐదు రకాల బస్సుల్లో ఉచిత ప్రయాణం

## 'సూపర్ సిక్స్' హామీల్లో భాగంగా కొత్త పథకం అమలు, పాల్గొన్న డి.సిఎం పవన్, మంత్రి లోకేష్ ప్రభృతులు

**విజయవాడ.ఆగస్టు15,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళలకు మహర్దశ కల్పించేందుకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా శుక్రవారం మరో పథకానికి అంకుర్పాణ చేసారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే స్త్రీ శక్తి పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఏపీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం 'స్త్రీ శక్తి పథకం' శ్రావణ శుక్రవారం అందుబాటులోకి వచ్చింది.దీంతో రాష్ట్రంలో మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.మానవవనరులశాఖా మంత్రి నారా లోకేష్ పాతి నిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గం ఉండవల్లి గుహల వద్ద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం స్త్రీ శక్తి పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లు పాల్గొన్నారు. మహిళల ఉచిత ప్రయాణానికి జీరో ఫేర్ టికెట్ జారీని సీఎం ప్రారంభించారు.ఈ బస్సులో సీఎం చంద్రబాబు,డీసీఎం పవన్ కల్యాణ్,మంత్రి నారా లోకేష్, బిజెపి రాష్ట్ర చీఫ్ మాధవ్‌లు టిక్కెట్లు కొనుక్కొని ప్రయాణించారు. మొదట టిక్కెట్లు పవన్ కల్యాణ్ కండెక్టరు డబ్బు చెల్లించారు.అయితే ఆ డబ్బు వెనక్కు ఇచ్చేయమని చెప్పి,లోకేష్ తాను ఫేయిర్ చెల్లించారు.అనంతరం మహిళలకు జీరో ఫేర్ టిక్కెట్‌లు కండెక్టర్ ఇచ్చారు.వారితో కలిసి విజయవాడ పండిట్ నెహ్రూ ఆర్టీసీ బస్‌స్టేషన్ సిటీ టెర్మినల్ వరకూ చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌లు బస్సులో ప్రయాణించారు. ఉచిత



శుక్రవారం ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించి ఓ మహిళకు తొలి టిక్కెట్ ఇస్తున్న సిఎం చంద్రబాబు




బస్సు ప్రయాణం కల్పించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపేందుకు మహిళలు భారీగా తరలివచ్చారు.

**ఉండవల్లి నుంచి విజయవాడ వరకు:** అడుగడుగునా మంగళ హారతులతో మహిళలు ఘనస్వాగతం పలికారు. డీజే, తీన్ మార్ నృత్యాలతో పెద్ద ఎత్తున బాణా సంచా కాల్చి సంబరాలు జరిపి కార్యకర్తలు పక్కా జాతర చేశారు. ఉండవల్లి గుహలు, ఉండవల్లి సెంటర్, తాడేపల్లి ప్యాలెస్, తాడేపల్లి సెంటర్, కనకదుర్గ వారధి మీదుగా సిటీ టెర్మినల్ వరకూ చంద్రబాబు, పవన్, లోకేశ్ బస్సు ప్రయాణం సాగింది. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ బస్సు ప్రయాణ మార్గంలో పోలీసులు భద్రత కట్టుదిట్టం చేశారు. బస్సు ప్రయాణించే ప్రయాణించే మార్గంలో మూడు పార్టీల జెండాలతో ఘనంగా స్వాగత ఏర్పాట్లు చేశారు. ప్రతీ >>2



## ట్రంప్-పుతిన్ చరిత్రాత్మక భేటీ

### ఉక్రయిన్‌పై రష్యా దండయాత్రకు స్వస్తి పలికేయత్నం

### శాంతి ఒప్పందం దిశగా చర్చలు

**అలాస్కా, ఆగస్టు 15:** మూడేళ్లుగా సాగుతున్న ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్రను నిలిపివేసి శాంతిని నెలకొల్పేందుకు అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ చేస్తున్న కసరత్తులు షురూ అయ్యాయి. అలాస్కాలోని మారుమూల యాంకరేజి పట్టణంలో ఈ చర్చలు జరుగుతున్నాయి. అటునుంచి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్‌పుతిన్ తన ప్రతినిధిబృందంతో చేరుకోగా ఇటునుంచి ట్రంప్‌తోపాటు పలువురు మంత్రులు సిఐఎ డైరెక్టర్ జనరల్ తదితరులు అలాస్కాకు చేరుకున్నారు.యుద్ధవిరమణ, శాంతినెలకొల్ప డం ఏకైక లక్ష్యంగా జరిగే ఈచర్చలపై ఇపుడు ప్రపంచదేశాలు ఎంతో ఆసక్తితో ఉన్నాయి. జాయింట్‌బేస్ ఆండ్రూస్‌నుంచి అలాస్కాకు బయలు దేరిన ట్రంప్ చర్చలపై తనకు >>2

## మోడీ, చంద్రబాబు బాటలో

# రాష్ట్రం ముమ్మందుకు..

### వచ్చే నాలుగేళ్లలో రాష్ట్రప్రగతిని మరింత పరుగులు పెట్టిస్తాం

### కాకినాడ వేడుకల్లో డి.సిఎం పవన్



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో,ఆగస్టు 15 ప్రభాతవార్త:** కాకినాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్లో నిర్వహించిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ముఖ్య అతిధి గా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించి, వందనం సమర్పించారు. జిల్లా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం పోలీస్ పరేడ్ ను తిలకించారు. వివిధశాఖల శకట ప్రదర్శన,చిన్నారుల నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, విన్యాసాలు చూశారు.సూపర్ సిక్స్ పథకాలు నిరాటంకంగా అమలుకావాలి. రాష్ట్రానికి పెట్టుబడులు రావాలి అంటే రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ బలంగా ఉండాలి.అందుకు సుస్థిరతతో కూడిన పాలన అవసరం. కూటమి ప్రభుత్వానికి శాంతి భద్రతల నిర్వహణ మీద,దేశ సుస్థిరత మీద సమగ్ర అవగాహన ఉంది. దేశం లోపల అంతర్గత సుస్థిరతను దెబ్బతీసేవారిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తుంది. ఈ విషయంలో ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, అర్.డబ్ల్యూ.ఎస్, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు.గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో ఉన్న చీకటి రోజులను స్వాతంత్ర సమరయోధుల స్ఫూర్తితో ఎదుర్కొన్నామన్నారు. విభజించు, పాలించు అన్న బ్రిటీష్‌రూల్‌ని వారు అమలు చేస్తే కూటమి ప్రభుత్వం స్వాతంత్ర సమరయోధుల స్ఫూర్తితో యునైటెడ్ రూల్ అమలు చేస్తోందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ మార్గదర్శకంలో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధి-సంక్షేమాలను రెండుకళ్లుగా ముందుకు తీసుకువెళ్తోందని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరైన ఆయన సతీమణి >>2

# రాజ్‌భవన్‌లో 'ఎట్ హోం'



## సిఎం, డి.సిఎం, ప్రజాప్రతినిధులు హాజరు

**విజయవాడ,ఆగస్టు15,ప్రభాతవార్తప్రతినిధి:** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాజ్ భవన్‌లో "ఎట్ హోం" కార్యక్రమం ఆహ్లాదక రంగా జరిగింది. రాజ్‌భవన్ ఆవరణలో ఏర్పాటు చేసిన వేదికగా సాయంత్రం ఈ కార్యక్రమం కొనసాగింది. ఆహ్వానితులకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ఆయన సతీమణి >>2

## మన దేశ పవర్ ఫుల్ మిస్సైల్ మోడీ

### గాంధీజీ మనకిచ్చిన ఆయుధం అహింస

### డబుల్ ఇంజన్ సర్కారుతో విజయవంతంగా తొలిఅడుగు



### స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి నారా లోకేష్

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, ఆగస్టు 15:** నేడు మహాత్మా గాంధీ చెప్పిన ఒక్క గొప్ప విషయం నాకు గుర్తుకు వస్తోందని, ప్రపంచంలో ఏ మార్పురావాలని కోరుకుంటున్నావో ఆ మార్పు నీ నుండే మొదలవ్వాలని గాంధీజీ చెప్పారని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఆ మహనీయుని స్ఫూర్తితో మార్పు మన నుండే మొదలు కావాలని లోకేష్ అన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గుంటూరు పోలీసు పెరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన కార్యక్రమానికి మంత్రి లోకేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రజలందరికీ నా శుభాకాంక్షలు. దేశమంతా కలిసి చేసుకునే ఒకే ఒక్క పండుగ జెండా పండుగ. జెండా పండుగ నాకు ఒక ఎమోషన్. ఇండిపెండెన్స్ డే అనగానే నాకు నా స్కూల్ డేస్ గుర్తొస్తాయి. ఫ్రెండ్స్ అంతా కలిసి స్కూల్ ను డెకరేట్ చేసే వాళ్ళం. స్కూల్ లో పెట్టే కాంపిటీషన్స్ కోసం స్వాతంత్ర్య సమరయోధుల చరిత్ర గురించి తెలుసుకునే వాళ్ళం. ఫైనల్‌గా ఎవరైనా గెస్ట్ వచ్చి జెండా ఎగరేసినప్పుడు గూస్ బమ్స్ వచ్చేవి. ఆ మూమెంట్ ఈ రోజు మళ్ళీ నాకు గుర్తొచ్చింది. ప్రపంచంలో ఒకే ఒక్క పవర్ ఫుల్ వెపన్ ఉంది. ఆ వెపన్ పేరే అహింస. ఆ వెపన్ మనకు ఇచ్చిన గొప్ప వ్యక్తి గాంధీ తాత. అహింస, సత్యం, సహాయ నిరాకరణ, సత్యా గ్రహం అనే సిద్ధాంతాలతో స్వాత్రంత్ర్యం సాధించారు.తెలుగునేలది ప్రత్యేక చరిత్ర >>2

16-8pg2exHMNWJQE 2nd_16-8pg2exHMNWJQE.qxd 8/16/2025 12:24 AM Page 1







శుక్రవారం విజయవాడలో స్త్రీశక్తి పథకం బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు,చిత్రంలో డిసిఎం పవన్ కల్యాణ్,మంత్రి నారా లోకేష్ తదితరులు

# అన్నగా ఇచ్చే వరం 'ఉచిత బస్సు'

>> సెంటర్‌లో థాంక్యూ సీఎం సర్ అంటూ మహిళల నినాదాలతో మంగళగిరి నియోజక వర్గం మార్మోగింది. మహిళలు తాడేపల్లి ప్యాలెస్ వద్దకు పెద్దఎ త్తున చేరుకుని చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌లు ప్రయా ణించే బస్సుకు ఘన స్వాగతంపలికారు. తాడేపల్లి జగన్ నివాసం సమీపంలో చంద్రబాబు, నారా లోకేశ్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు నేతలు, కార్యకర్తలు పాలాభిషేకం చేశారు.

ఇక విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'స్త్రీ శక్తి' పథకంలో భాగంగా మహిళలకు ఉచితంగా ప్రయాణించేందుకు నిర్దేశించిన నూతన బస్సులను డీసీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌తో కలిసి సీఎం ప్రారం భించారు. ఈ బస్సులకు ఆయన జెండా ఊపి ప్రయాణానికి ముందుకుపంపించారు. గతప్రభుత్వ హయాంలో ఇంటా, బయట ప్రజలకు ఆనందం లేకుండా పోయింద న్నారు. మీ సత్యాగ్రహంతో ఆ ప్రభుత్వం కొట్టుకుని పోయిందన్నారు. తమ ప్రభుత్వ ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్, సూపర్ హిట్ అయిం దన్నారు. తమ కీలక వాగ్దానాల్లో మహిళ ఉచిత బస్సు ప్రయాణాన్ని నేటి నుంచి అందుబాటులోకి తీసుకుని వచ్చామన్నారు.

**ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లను గౌరవించండి:** ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లను మనం గౌరవించాలని, ఏంచేసినా వెనక్కి లాగేందుకు చాలామంది చూస్తున్నారని విమర్శించారు. అమరావతిని ఎడారి అన్నారుని, శ్మశానం అన్నారని మండిపడ్డారు. అమరావతిని గొప్ప నగరంగా తీర్చిదిద్దుతున్నామన్న సీఎం చంద్రబాబు, త్వరలోనే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడేందుకు కేంద్రం రూ.12,500 కోట్లు ఇచ్చిందన్న సీఎం, ప్రభుత్వ కార్యక్రమాలకు పూర్తిగా సహకరించిన బాధ్యత మీదేనని అన్నారు. పులివెందులలో 30 ఏళ్ల తర్వాత ఓటేశానని ఒకరు కాగితం రాశారని, పులివెందుల ప్రజలకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ఆడబిడ్డలకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించామన్న తృప్తి ఉందన్న సీఎం, వాట్సప్ గవర్నెన్స్ ద్వారా అన్ని సేవలూ అందు బాటులోకి వచ్చాయని తెలిపారు.

**8,458 బస్సుల్లో ఈ పథకం అమలు: డీసీఎం పవన్ కల్యాణ్:** ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎంపవన్ కల్యాణ్ మాట్లాడుతూ తమది ఇచ్చిన మాట మీద నిలిచే ప్రభుత్వమన్నారు. 8,458 బస్సుల్లో ఈ పథకం అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఏటా రూ.2,000 కోట్లు ప్రభుత్వం భరించనుందన్నారు. ఎన్నికలహామీని నిలబెట్టుకున్నామని పవన్ కల్యాణ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం తమ కీలక ఎన్నికల హామీని నెరవేర్చే దిశగా కీలక ముందడుగు వేసిందన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే స్త్రీ శక్తి పథకాన్ని మహిలలకు మంచిచేయాలనే లక్ష్యంతో తీసుకుని వచ్చామన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని స్పష్టం చేశారు.

# మన దేశ పవర్ ఫుల్ మిస్సైల్ మోడీ

>>ఉంది. బ్రిటిష్ వాడి తుపాకీకి గుండె చూపిన యోధుడు ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు. జాతీయ జెండాను పింగళి వెంకయ్య రూపొందించారు. 'మాకొద్దీ తెల్లదొరతనం" అని నినదించారు గరిమెళ్ల సత్యనారాయణ అని అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు లాంటి ఎంతో మంది దేశభక్తులు, స్వాతంత్ర్యం సమరయోధులు మన తెలుగు నేలపైనే పుట్టారు. మన సమరయోధుల ఘనకీర్తి దేశానికి తెలిసేలా చేద్దాం. వారి త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమంకోసం పనిచేద్దాం. గుంటూరు జిల్లాలో జరుగుతున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనడం నా అదృష్టంగా భావిస్తున్నాను. మన జిల్లాలోని పెదనందిపాడులో సహాయ నిరాకరణ ఉద్యమం జరిగింది. సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా గుంటూరు, తెనాలిలో ఆందోళనలు జరిగాయి. క్విట్‌ఇండియా ఉద్యమంలో పాల్గొని తెనాలికి చెందిన ఏడు గురు ప్రాణ త్యాగం చేసారు. మంగళగిరిలో స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు, ఆనాటి ఘట్టాలను గుర్తు చేస్తూ ఒక మ్యూజియం ను ఏర్పాటు చేయబోతున్నాం. స్వాతంత్రోద్యమంలో చెరగని ముస్వతంత్ర పోరాటంలో గుంటూరు నేలది చెరగని ముద్ర. మన జిల్లాకు చెందిన దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, కన్నెగంటి హనుమంతు, పర్వతనేని వీరయ్య చౌదరి, తమనంపల్లి అమృతరావు వంటి ఎంతోమంది దేశభక్తులు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. వారందరి సేవలను మనం గుర్తు చేసుకోవాలి. కులం, మతం, ప్రాంతం కంటే దేశం గొప్పది. అందరిలోనూ దేశ భక్తి ఉండాలి. దేశం కోసం కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ఒక్కటి అవ్వాలి. ఈ సందర్భంగా పెహల్గామ్ ఉగ్రవాద దాడి గురించి మాట్లాడుకోవాలి. పాకిస్థాన్ ఉగ్రవాదులు పెహల్గామ్ లో దాడులు చేసి 26 మంది అమాయకుల్ని చంపేసారు. గత ప్రభుత్వాల మాదిరి మనం కన్నీరు పెట్టుకొని ఇతర దేశాల సహాయం కోసం వెళ్ళలేదు. మన దేశ పవర్‌ఫుల్ మిస్సైల్ మన ప్రధాని నరేంద్ర మోడీ పాకిస్థాన్‌కి సరైన శిక్ష వేసారు. ఆపరేషన్ సిందూర్ తో మన పవర్ ఏంటో ప్రపంచానికి తెలియజేసారు. ఆపరేషన్ సిందూర్ జరిగేప్పుడు కొంతమంది సైనికులను కూడా మనం కోల్పోయాం. అందులో మన రాష్ట్రానికి చెందిన మురళీ నాయక్‌ను కూడా కోల్పోయాం. మురళీ నాయక్ తల్లితండ్రిని నేను కలిసాను. వారికి ఒక్కడే కొడుకు. మురళి నాయక్ సైన్యంలోకి వెళ్లడం వారికి ఇష్టం లేదు. మురళి నాయక్‌ను ఆర్మీకి వెళ్లొద్దు, నీకు ఏమైనా అయితే మేము తట్టుకోలేం అన్నారు. అప్పుడు మురళి నాయక్ ఒక్కటే చెప్పాడు. నేను యుద్ధంలో చనిపోతే దేశం మొత్తం మీ కోసం నిలబడుతుంది అని మురళి నాయక్ లాంటి సైనికులు బోర్డర్ లో పోరాడుతున్నారు కాబట్టే మనం ఇక్కడ స్వేచ్ఛగా స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్నాం. 5ఏళ్ల అరాచకపాలనలో 30ఏళ్లు వెనక్కి2019 నుండి 2024 వరకూ ఆంధ్రప్రదేశ్ లో చీకటి రోజులు చూసాం. గత ప్రభుత్వం ఐదేళ్ల లో 10 లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని ముప్పై ఏళ్ళు వెనక్కి నెట్టారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి అడ్రెస్స్ లేకుండా పోయింది. 2024 లో ప్రజలు చరిత్ర సృష్టించారు. 94 శాతం స్ట్రైక్ రేట్, 164 సీట్ల లో ఎన్డీయే ను గెలిపించి రికార్డులు బద్దలు కొట్టారు.

ఈ కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి, డిఐజి సర్వశ్రేష్టి త్రిపాఠి, ఎస్పీ సతీష్ కుమార్, ఎమ్మెల్యేలు గల్లా మాధవి, నజీరుద్దీన్, తెనాలి శ్రావణ్ కుమార్, బూర్ల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# బనకచర్లకు కట్టుబడి ఉన్నాం

>> భరిత ప్రసంగంలో సీఎం చంద్రబాబు కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చినప్పుడు అమలు చేసిన సామాజిక భద్రత ఫించన్లు మొదలుకుని శుక్రవారం ప్రారంభించిన స్త్రీ శక్తి పేరుతో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం వరకు ప్రతి అంశాన్ని వివరించారు. ఫించన్లు, తల్లికి వందనం, దీపం2.0, అన్నదాత సుఖీభవ వంటి పథకాల గురించి చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. దీంతో పాటు తాను చేసిన తొలి సంతకాల అమలును ముఖ్యమంత్రి వివరించారు. అలాగే ఏపీ బ్రాండ్ గురించి పెట్టుబడుల సాధనకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వివ రించారు. దీంతో పాటు రాష్ట్రంలోని వివిధ వర్గాలకు అందించిన సేవ లను ఆయా రంగాల కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వివ రించారు. దేశంలో మరే రాష్ట్రంలో అమలు కాని స్థాయిలో రెట్టింపు సంక్షేమం ప్రజలకు అందుతోందని తెల్చిచెప్పారు. ప్రధాన ఎన్నికల హామీలుగా ఉన్న సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని పునర్నిర్మించాలనే ఏకైక లక్ష్యంతో పాలన ప్రారంభించామన్నారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జాతీయజెండాను ఆవిష్కరించిన అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడారు. 79వ స్వాతంత్ర్య దిన వేడుకలు జరుపుకుంటున్న శుభ సందర్భంగా భారతీయులకు, ప్రపంచంలోని తెలుగు వారికి, రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్యం పొందిన 8దశాబ్దాల కాలంలో దేశంలో అనేక మార్పులు జరిగాయన్నారు. ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్ కూడా అనేక ఎత్తుపల్లాలను చూసిందని గుర్తు చేశారు. సంక్షేమం అభివృద్ధి సుపరిపాలనతో సాగిన ఏడాది పాలన ఎంతో సంతృప్తిని ఇచ్చిందని సీఎం చంద్రబాబు చెప్పారు. 2014లో రాష్ట్ర విభజనతో రెండు తెలుగు రాష్ట్రాలు ఏర్పడటంతో కొత్త సవాళ్లతో రాష్ట్ర ప్రయాణం సాగిందని వివరించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు గెలవాలి రాష్ట్రం నిలవాలి అనే ఎన్డీఏ నినాదాన్ని ప్రజలు నమ్మి చారిత్రాత్మకమైన తీర్పునిచ్చి నిశబ్ద విప్లవాన్ని సృష్టించారని సీఎం తెలిపారు. పేదల సేవల్లో కార్యక్రమంలో 64 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఇంటి వద్దే పంపిణీ చేస్తూ సంక్షేమ రాజ్యానికి కొత్త అర్థాన్ని ఇచ్చామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. తన బిడ్డ చదువుకోవాలని కలలుకనే పేదింటి తల్లులకు ఆర్థిక భరోసా ఇచ్చేందుకు తల్లికి వందనం పథకాన్ని రూ. 10వేల కోట్లతో అమలు చేస్తున్నామని ప్రకటించారు. అన్నదాత సుఖీభవ పథకంలో మొదటి విడతగా రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు, కేంద్రం రూ.2 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు రైతుల ఖాతాల్లో వేశామని చెప్పారు. 47లక్షల మంది రైతులకు రూ.3,173 కోట్లు మేర ఈ పథకం ద్వారా అందించామన్నారు. దీపం పథకం కింద ఏడాదికి 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తూ, ఏటా రూ.2,684 కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. ఇప్పటి వరకూ 2 కోట్ల రాయితీ సిలిండర్లు ఇచ్చామని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో ఆడబిడ్డలకు 'స్త్రీ శక్తి పేరుతో ఉచిత ప్రయాణాన్ని కానుకగా ఇస్తున్నామన్నారు. 16,347 పోస్టులతో నిర్వహించిన మెగా డీఎస్సీ నియామకాలను ఈ నెలాఖరకు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు నాడు కునుకు లేకుండా చేసిన 'ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశామని చెప్పారు. పేద ప్రజల ఆకలి తీర్చేందుకు అన్నా క్యాంటీన్లు తిరిగి తీసుకువచ్చి, 204 అన్నా క్యాంటీన్లలో 5.16 కోట్ల మందికి రూ.5 లకే కడుపునింపుతున్నామన్నారు. దేవాలయాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణుల కనీస వేతనం రూ.25 వేలకు పెంచి ఆలయ ట్రస్ట్ బోర్డుల్లో చోటు కల్పించామని చెప్పారు. 40 వేల సెలూన్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని తెలిపారు. మేనిఫెస్టోలో చెప్పినట్లు కల్లు గీత కార్మికులకు 10శాతం మద్యం దుకాణాలు, బార్‌లు కేటాయించామని చంద్రబాబు వెల్లడించారు. మత్స్యకారులకు వేట విరామ సమయంలో రూ.20వేలు ఆర్థిక సాయాన్ని ఇస్తూ, మత్స్యకారుల సేవలో పథకం ద్వారా 1,29,178 మందికి రూ.259 కోట్లు అందించామన్నారు. చేనే తకు అండగా హ్యాండ్లూమ్స్‌కు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని వివరించారు. ఎస్సీ సామాజిక వర్గాల్లో అంతరాలు తగ్గించేలా ఏ వర్గాన్ని నొప్పించకుండా, ఏ ఒక్కరూ నష్టపోకుండా ఎస్సీ వర్గీకరణతో వారి దశాబ్దాల ఆకాంక్ష నెరవేర్చామని స్పష్టం చేశారు. అడవితల్లి బాటల్లో కార్యక్రమం ద్వారా రూ.1,000 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టిన మారుమూల గిరిజన ప్రాంతాలను ప్రధాన రహదారులతో అనుసంధానం చేస్తున్నామని వెల్లడించారు. ఇమామ్‌లకు 10,000, మోజన్లకు 5,000 చొప్పున గౌరవవేతనం ఇస్తున్నామన్నారు. భావ ప్రకటనా స్వేచ్ఛ పేరుతో సోషల్ మీడియాలో మహిళలపై అసభ్యకర పోస్టులు పెడితే కఠినంగా వ్యవహరిస్తూ మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడుతున్నామని చెప్పారు. ఏపీ బ్రాండ్‌ను పునరుద్ధరించటమే కూటమి ప్రభుత్వ ఆశయమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇప్పటి వరకు 9 స్టేట్ ఇన్వెస్టిమెంట్ ప్రమోషన్ బోర్డు సమావేశాలు నిర్వహించామన్నారు. 113 ప్రాజెక్టులకు సంబంధించి రూ.5.94 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపామని, వీటి ద్వారా 5.56 లక్షల ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. 6 వేలకు పైగా ఆలయాల్లో నిత్యం ధూపదీప నైవేద్యాలకు రూ.10 వేల చొప్పున నిధులు విడుదల చేస్తున్నామని తెలిపారు. నవ్యాంధ్రకు దిగ్గజ ఐటీ కంపెనీలైన గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయని వివరించారు. మన మిత్ర ద్వారా పరిపాలనలో కొత్తదనాన్ని తీసుకొచ్చి 700 పౌర సేవలు అందిస్తున్నామని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో త్వరలోనే 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తా మన్నారు. శత్రుదేశాలు తూటాలు పేల్చితే మిస్సైళ్లతో బదులిచ్చిన మన త్రివిధ దళాలకు జై కొడదామని పిలుపునిచ్చారు.

రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు గోదావరి వృథా జలాలను పోలవరం నుంచి బనకచర్లకు మళ్లిస్తూ, సముద్రంలోకి వృథాగాపోయే నీటినే వినియోగిస్తామని వివరించారు. 2027 డిసెంబర్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని ప్రకటించారు. బనకచర్ల విషయంలో ప్రభుత్వ విధానాన్ని మరోసారి చంద్రబాబు స్పష్టం చేశారు. వరద వచ్చినప్పుడు కిందకు వదిలేస్తున్న వాళ్లు. అదే వరద నీటిని వాడుకుంటే అభ్యంతరం చెప్పడం సమంజసమా అని చంద్రబాబు ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం, బీఆర్‌ఎస్ పార్టీ బనకచర్ల విషయంలో చేస్తున్న వాదనల నేపథ్యంలో ఏపీ వాదనను రాష్ట్ర ప్రభుత్వ అభిప్రా యాన్ని స్వాతంత్ర్య దినోత్సవ వేదికగా మరోసారి స్పష్టం చేయడం ఆసక్తి పరిణామంగా నిలిచింది. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం పూర్తిగా సహకరిస్తుందని చంద్రబాబు పంద్రాగస్టు ప్రసంగంలో వెల్లడించారు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను సీఎం సతీమణి నారా భువనేశ్వరి గ్యాలరీ ఉండి.వీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తాలు వేడుకల్లో సీఎం చంద్రబాబును అనుసరించి ఉన్నారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మొత్తం 25 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి అవార్డులు, ప్రశంసాపత్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందచేశారు.

## రాష్ట్రం ముందుకు..

>> అన్నా లెజినోవా కొణిదెల అతిథుల గ్యాలరీ నుంచి ఈ వేడుకలను ఆసక్తిగా తిలకిం చారు. అనంతరం వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులకు ఉత్తమ సేవా పతకాలు అందజేశారు. గడచిన ఏడాది కాలం లో నా పిఠాపురం నియోజకవర్గంలో రూ.308 కోట్లకుపైగా అభివృద్ధి పనులు చేయడం జరిగిందని అభివృద్ధి పనులు గురించి వివరించారు. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని వచ్చే నాలుగేళ్లలో మరింత ప్రగతి పదంలో ముందుకు తీసుకువెళ్లడం జరుగుతుందని తెలిపారు.

ఈ వేడుకల్లో కాకినాడ పార్లమెంటు సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు పంతం నానాజీ, వనమాడి వెంకటేశ్వరరావు, నిమ్మకా యల చినరాజప్ప, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, సివిల్ సప్లైస్ కార్పోరేషన్ ఛైర్మన్ తోట సుధీర్, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల బాబు, జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి, ఎస్పీ బిందు మాధవ్, ఇతర ఉన్నతాధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## ఓ పటిష్ట పునాది

>> భారతదేశం తన సాంస్కృతిక వారసత్వం, ఆదునిక ప్రపంచ దృక్కోణం, దృఢమైన ప్రజాస్వామ్య స్తంభాల బలం ఆధారంగా, ప్రపంచ శక్తిగా అవతరించి, తన అభివృద్ధి మార్గాన్ని స్వయంగా సృష్టించుకుం టూ ముందుకు సాగుతోంది అనడంలో ఏమాత్రం సందేహం లేదన్నారుఈ వేడుకల్లో భాగంగా అదనపు సొలిసిటర్ జనరల్ ధనంజయ, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, బార్ కౌన్సిల్ అధ్యక్షులు ద్వారకానాథ్ రెడ్డి మరియు హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షులు కె.చిదంబరం తదితరులు మాట్లా డుతూ స్వాతంత్ర సమరయోధులకు నివాళులు అర్పిస్తూ, రాజ్యాంగం ప్రకారం పౌరులందరి హక్కులను పరిరక్షించడంలో మరియు వారికి సమన్యాయాన్ని అందించడంలో న్యాయ వ్యవస్థ చేస్తున్న కృషిని వివరించారు. ఈ వేడుకల్లో పలువురు న్యాయమూర్తులు, వారి కుటుంబ సభ్యులు, ఏపీ అదనపు అడ్వకేట్ జనరల్ పి.సాంబశివ ప్రతాప్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.లక్ష్మీ నారాయణ, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ పార్థసారధి, పలువురు ఇతర రిజి స్ట్రార్లు, సీనియర్ న్యాయవాదులు, బార్ అసోసి యేషన్, బార్ కౌన్సిల్ సభ్యులు, ఏపి లీగల్ సర్వీసెస్ అథారిటీ, ఏపి జుడీషియల్ అకాడమీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### దేశ యువత కోసం

## లక్ష కోట్లతో ప్రణాళిక

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** దేశంలో యువతకోసం రూ.లక్ష కోట్లతో కొత్తప్రణాళిక రూపొందిం చామని ప్రధాని మోడీ వెల్లడించారు. వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజనకింద ఈ పథకం అమలుచేస్తామన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని ప్రైవేటు కంపెనీల్లో కొత్తగాచేరే ఉద్యోగులకు ప్రభుత్వం తరపున నెలకు రూ.15 వేలు ఇస్తామన్నారు. స్వయంసమృద్ధి అంటే డాలర్లు, పౌండ్లు కాదని, సమున్నతంగా నిలబడటం అన్నారు. ఎగుమతిదిగు మతులు, ఆదాయ వ్యయాలేకా దని, మేకిన్ ఇండియా ఏంటో ఆపరేషన్ సిందూర్ చెప్పిందన్నారు. భారత్ తయారీ నినాదం రక్షణరంగంలో మిషన్‌మోడ్‌లో ఉందని, టెక్నాలజీకోసమో, సాయంకోసమే భారత్ అర్థించడంలేదని, సెమికండక్టర్లుసహా అనేక విషయాల్లో సొంతకాళ్లపై నిలుస్తోం దన్నారు. 50-60 ఏళ్లక్రితమే వీటి తయారీ ఆలోచన ఉందని, త్వరలో మేడిన్ ఇండియా చిప్‌లు మార్కెట్‌ను ముంచెత్తుతాయని మోడీ వివ రించారు. అన్ని రంగాల్లోను సంస్కరణలు తెస్తున్నామని, జీఎస్టీపై రాష్ట్రాలతో చర్చించి సవరణచేసామని, దీపావళిలోపు కొత్త సంస్కరణలు వస్తాయన్నారు.

## నీట్ ర్యాంక్ సాధించిన దివ్యాంగ విద్యార్థికి లోకేష్ సాయం

**విజయవాడ,ఆగస్టు 15,ప్రభాతవార్తప్రతినిధి:** గతంలో ఐబీటీ, ఎన్ఐటీ ర్యాంకర్లకు ఇంటర్ మార్కుల మెమో విషయంలో తలెత్తిన ఇబ్బందులపై తక్షణమే స్పందించి 25 మంది దివ్యాంగ విద్యార్థుల భవిష్యత్ కాపాడిన విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ నేడు నీట్ ర్యాంకర్‌కు అండగా నిలిచారు. అయితే దివ్యాంగ విద్యార్థులకు ఇంటర్‌లో ఫస్ట్ లేదా సెకెండ్ లాంగ్వేజ్ కింద ఇంగ్లీష్ ఎంచుకో కుండా మినహాయింపు ఉంది. వైద్య విద్యాకో ర్సుల్లో ప్రవేశాల కోసం జాతీ యస్థాయిలో నిర్వహించిన నీట్ యూజీ పరీక్షా ఫలితాల్లో దివ్యాంగ కేటగిరీలో 1174వ ర్యాంక్ సాధించిన హరిహర బ్రహ్మారెడ్డికి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు లభించే అవకాశం ఉంది. ఈనెల 19న కౌన్సిలింగ్ కు హాజరుకా వాల్సి ఉంది. అయితే నీట్ నిబంధనల ప్రకా రం ఇంటర్‌లో తప్పనిసరిగా ఇంగ్లీష్‌ను ఫస్ట్ లేదా సెకెండ్ లాంగ్వేజ్‌గా ఎంచుకోవాలి. ఇంటర్ మార్కుల మెమోలో ఫస్ట్ లాంగ్వేజ్ అనే కాలమ్ వద్ద (ఎగ్జెంప్టెడ్) అని ఉండటంతో మెడికల్ సీటు కోల్పోతామని విద్యార్థితో పాటు తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. తమ సమస్యను పరిష్కరించాలంటూ మంత్రి లోకేష్ ను ఆశ్రయించారు. దీంతో తక్షణమే స్పం దించిన మంత్రి గతంలో ఐబీటీ, ఎన్ఐటీ విద్యార్థులకు ఇంగ్లీష్ సబ్జెక్టులో కనీస మార్కులు 35 కలుపుతూ జారీ చేసిన ప్రత్యేక జీవోద్వారానే బైపీసీ విద్యార్థికి కూడా మా ర్కుల మెమోలో కూడా కనీస మార్కులు కలిపి సమస్యను పరిష్కరించారు.



శుక్రవారం ఎట్‌హోం కార్యక్రమంలో పాల్గొని ముచ్చటించుకొంటున్న సిఎం, డిసిఎం సతీమణులు

# 'సుదర్శనం' శత్రు దుర్భేద్యం

>> డోమ్ వ్యవస్థలకంటే అధునాతన వ్యవస్థలతో సుదర్శన్‌చక్ర వ్యవస్థ ఉండగదలని ప్రధాని పేర్కొన్నారు. ఇప్పటికే సమీకృత ఎయిర్‌కమాండ్ అండ్ కంట్రోల్ సిస్టమ్ (ఐఎసిసిఎస్) పనిచేస్తోందని, అందువల్లనే 100 గంటలపాటు ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్తాన్ క్షిపణులు మనల్ని ఏమీచేయలేకపోయా యయన్నారు. అయితే సుదర్శన్‌చక్ర మిషన్ ఒక హిందూ సైద్ధాంతిక వ్యవస్థల ప్రకారం ఏర్పాటయింది. కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుడు జయద్రుడిని వధించేం దుకు వీలుగా సూర్యునిపైకి సుదర్శన చక్రాన్ని రక్షణ వలయంగా శ్రీకృష్ణుడు ప్రయోగించారని, ఇపుడు అదే తరహా రక్షణ వ్యవస్థలో మన రక్షణ వ్యవస్థకు సుదర్శన చక్ర నిలుస్తుందన్నారు. అందుకే ఈ మిషన్‌కు 'సుదర్శన్ చక్ర' అని పేరుపెట్టామన్నారు. 2035నాటికి మనం ఈ సుదర్శన చక్ర వ్యవస్థను మరింత విస్తరించి శక్తివంతంచేసి మరింత ఆధునీకకరణచేసే రక్షణ చట్రంగా మారుస్తామన్నారు. ఈ మొత్తం వ్యవస్థ భారత్‌లోనే తయారీ అనంతరం రూప కల్పన, ఏర్పాటు ఉంటుందని, ఆత్మనిర్భర్‌భారత్‌కు నిదర్శనంగా సుదర్శన్‌చక్ర నిలుస్తుందన్నారు. ఈ వ్యవస్థతో ప్రతిపౌరుడు కూడా పూర్తిభద్రతతో ఉంటాడన్న భరోసా ఇచ్చారు. ఒక రక్షణ కవచంగానే కాకుండా శతృదాడులను శక్తివంతంగా అడ్డుకుంటుందన్నారు. సైబర్ ముప్పునుకూడా అరికడుతుంది. హ్యాకింగ్; పిషింగ్ వంటివి ఇక ఎంతమాత్రం వీలుకాదు. రక్షణరంగ పరిశోధన ఏజెన్సీలు, మిలి టరీ, ప్రైవేటు రంగ సృజనాత్మక పరిశోధనలతో కూడుకుని ఈ వ్యవస్థ ఉందని మోడీ చెప్పారు. పహల్గాంవ్ ఉగ్రదాడి తర్వాత నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌లో సుమారు 100 గంటలపాటు పాకిస్తాన్ మన మిలిటరీబేస్‌లను ధ్వంసంచేయాలని చూసిందని, భారత్ యుద్ధవిమానాలను కూల్చాలని చూసిం దని, భారత పట్టణాలు, నగరాలను ధ్వంసంచేసే కుట్రలుచేస్తే భారత్ ప్రస్తుతం ఉన్న గగనతల రక్షణ వ్యవస్థతో నిర్వీర్యంచేసిందన్నారు. ఇపుడు వస్తున్న సుదర్శన చక్ర వ్యవస్థవల్ల మన విద్యుత్‌గ్రిడ్‌లు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్, ఆహార జలవనరుల సరఫరా, మెడికల్‌కేర్, రక్షణ వ్యవస్థలు వంటివాటికి పూర్తి రక్షణ లభిస్తుందన్నారు. ఆపరేషన్‌సిందూర్‌లో ఐఎసిసిఎస్ కీలకపాత్ర పోషించింది. పాకిస్థాన్ కుట్రలను నిర్వీర్యంచేసిందని ప్రధానిమోడీ చెప్పారు. ఆర్మీలోని గగనతల రక్షణ వ్యవస్థలను జోడించడం, ఎయిర్‌పోర్స్, నేవీని ఒకే వ్యవస్థగొడుగులోకి తీసుకువచ్చింది. ట్రాకింగ్, నిర్మూలించడం ఇపుడు తేలిక అయింది. రాడార్లు, నిఘా వ్యవస్థలైన అవాక్స్, యుద్ధవిమానాలను సైతం ట్రాక్‌చేసే సత్తా ఈ ఐఎసిసిఎస్‌కు ఉంది. ముప్పు తీవ్రతను బట్టి ఆర్మీ, ఇతర వ్యవస్థలన్నింటినీ అప్పటికిప్పుడు సిద్ధంచేయగల సత్తా ప్రస్తుత ఐఎసిసిఎస్‌కు ఉందన్నారు. మన సుదర్శనచక్ర తరహాలోనే అమెరికా గోల్డెన్‌డోమ్ ఏర్పాటు చేస్తోంది. గగనతల క్షిపణి రక్షణవ్యవస్థను రూపొందిస్తుంది. అమెరికాతోపాటు కెనడాకూడా ఇదే డోమ్‌లు ఏర్పాటు చేసుకుంటున్నది. అమెరికా 175 బిలియన్ డాలర్ల ఖర్చు అవుతుందని చెపుతున్నారు. ఇప్పటికే ఇలాంటి వ్యవస్థలు రష్యా, చైనాలకు ఉంది. హెచ్‌ఆర్9 దీర్ఘకాలిక ఊరితలంనుంచి గాలిలోనికి, యాంటి బాలిస్టిక్ క్యాపబల్ సిస్టమ్‌లు పాక్, మొరాకో, ఈజిప్టు, తుర్కమెనిస్తాన్; ఉజ్బెకి స్తాన్‌లకు విక్రయించింది. అయితే వీటన్నింటికంటే మరింత శక్తివంతంగా భారత్ సుదర్శన్ చక్ర వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటున్నట్లు ప్రధానిమోడీ అన్నారు.

# రాజ్‌భవన్‌లో 'ఎట్ హోం'

>> సమీరా నజీర్ తేనీటి విందు ఇచ్చారు. సీఎం చంద్రబాబు, ఆయన సతీమణి నారా భువనేశ్వరి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆయన సతీమణి అన్నా లెజినివాసహా పలువురు ప్రముఖులు హాజరయ్యారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ దంపతులు, హైకోర్టు న్యాయమూర్తులు, పలువురు పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, శాసనసభ్యులు గద్దె రామోహన్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఇతర సీనియర్ అధికారులు, పద్మ పురస్కార గ్రహీతలు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, జిల్లా కలెక్టర్ జీ. లక్ష్మీశ, ఇతర క్రీడాకారులు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులు, కళాకారులు, ఇతర ప్రముఖులు ఈ విందులో పాల్గొన్నారు. ఆహుతులందరిని గవర్నర్ స్వయంగా ఒక్కొక్కరి దగ్గరకు వెళ్ళి గవర్నర్ పలుకరించారు. ఈ కార్యక్రమం జాతీయగీతం నేపథ్య సంగీతంగా ఆరంభమైంది.

## ట్రంప్-పుతిన్ చరిత్రాత్మక భేటీ

>> ఎంతో నమ్మకం ఉందని ఇదే ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పేందుకు జరుపుతున్న కీలక చర్చలని పేర్కొన్నారు. చర్చలు సజావుగా సాగకుంటే ఒక్కనిమిషానికే వెనక్కి వచ్చేస్తామని, అలాకాని పక్షంలో 20 గంటలపాటు అయిన చర్చలు కొనసాగుతాయన్నారు. ఆయనతోపాటు ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్, విదేవాంగ మంత్రి మార్కో రుబియో, వాణిజ్యమంత్రి హోవర్డ్ లుత్నిక్, సిఐఎ డైరెక్టర్ జాన్ ర్యాట్‌క్లిఫ్ తదితరులున్నారు. నిపుణుల అంచనాలప్రకారం కనీసం ఆరేడు గంటలపాటు సాగుతాయని రష్యా క్రెమ్లిన్‌ప్రతినిధి తెలిపారు. సమావేశం సామరస్యంగానే కొనసాగుతుందని భావిస్తు న్నట్లు క్రెమ్లిన్‌ప్రతినిధి డిమిత్రి పెష్కోవ్ అన్నారు. పుతిన్; ట్రంప్ ముఖాముఖి చర్చలు ఏడేళ్లలో మొదటిసారి జరుగుతున్నాయి. అంతకుముందుఐదుగురు అమెరికా అధ్యక్షులతో భేటీ అయిన అనుభవం పుతిన్‌కు ఉంది. ట్రంప్ లక్ష్యం ముందు ఉక్రెయిన్‌పై దాడులు వెంటనే నిలిపివేయాలని భావిస్తున్నారు. అనంతరం రష్యా ప్రతిపాదనలు, డిమాండ్లు, ఉక్రెయిన్‌వైపు నుంచి వచ్చే డిమాండ్లు, ప్రతిపాదనలపై చర్చలుకొనసాగుతాయని చెపుతున్నారు. యుద్ధవిరమణకు ఇదే సరైన అదను అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ప్రకటనపైనే ఎంతో ఆసక్తిగా ఉన్నామని అధ్యక్షుడు వోలో దిమిర్‌జెలెన్‌స్కీ అన్నారు. ముఖాముఖి చర్చల్లో యుద్ధవిరమణపైనే కీలకంగా ఉంటుంది. అలా స్కాలోని మారుమూల యాంకరేజి పట్టణంలో జరుగుతున్నాయి. యుద్ధం ప్రారంభించిన తర్వాత మొదటిసారి పుతిన్ పాశ్చాత్యదేశ పర్య టనకు వస్తున్నారు. పుతిన్ అంగీకరించని పక్షంలో పరిస్థితులు వెనువెంటనే మారిపో తాయని మరిన్ని ఆంక్షలు ఉంటాయని ట్రంప్ ఇప్పటికే హెచ్చరించారు. అలాగే పుతిన్ అంగీక రించకపోతే భారత్‌పై మరిన్ని సుంకాలు వేస్తామని ఆర్థికమంత్రి బెస్సెంట్‌కూడా హెచ్చ రించిన సంగతి తెలిసిందే. అలాగే జెలెన్‌స్కీ కూడా రష్యా ఆక్రమించిన ప్రాదేశిక ప్రాంతాన్ని అప్పగించేందుకు జెలెన్‌స్కీ కూడా అంగీకరిం చడంలేదు. ఈతరుణంలో ఇపుడు ఫేస్‌టుఫేస్ జరిగే చర్చలపైనే ప్రపంచమంతా ఆసక్తితో ఎదురుచూస్తోంది.

## ప్రకాశం బ్యారేజ్ వద్దన తగ్గుతున్న వరద

**విజయవాడ.ఆగస్టు 15,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ ప్రకాశం బ్యారేజీకి వరద ప్రవా హం తగ్గుముఖం పట్టింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఆనకట్టకు 5,39,473 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది.

## వారం - వర్జ్యం

16-08-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
అష్టమి రా.9.35
భరణి ఉ.6.05, కృత్తిక తె.4.38
వర్జ్యం : మ.12.14-మ.3.14
దు.తె.5.52-7.31
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** దూరప్రాంతాల నుండి శుభ వార్తలు అందుకుంటారు. ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి.

**వృషభం :** శత్రువులు సైతం మిత్రులుగా మారి సాయం అందిస్తారు. ఆకస్మిక ధనలాభం.

**మిథునం:** వివాహ, ఉద్యోగ యత్నాలు ఫలిస్తాయి. పెద్దల సలహాలు తీసుకుంటారు.

**కర్కాటకం :** సెంటిమెంటు వస్తు భద్రత పట్ల జాగ్రత్తలు పాటించండి. వస్తు కొనుగోలు చేస్తారు.

**సింహం:** ఆర్థికపరిస్థితి మెరుగు పడుతుంది. కొత్త పెట్టుబడులకు అనుకూలంగా వుంటుంది.

**కన్య:** ఇంటా బయటా మీదే పైచేయిగా వుంటుంది. నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు.

**తుల :** సాంకేతిక విద్యావకాశాలు లభిస్తాయి. రెండు మూడు విధాలుగా ధనలాభం పొందుతారు.

**వృశ్చికం:** అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. భాగస్వామ్య వ్యాపారాలు అభివృద్ధిచెందుతాయి.

**ధనుస్సు:** ఉద్యోగాలలో పదోన్నతులు పొందుతారు. కీలక విషయాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకుంటారు.

**మకరం:** శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు.

**కుంభం:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. ఆరోగ్య విషయంలో మెలుకువ అవసరం.

**మీనం:** ఎన్ని సమస్యలు ఎదురైనా పట్టుదలతో ముందుకు సాగి అనుకున్న కార్యాన్ని విజయవంతంగా పూర్తిచేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

16-08Pg3exHMNWJQEL 3rd Page_16-08Pg3exHMNWJQEL.qxd 8/15/2025 11:30 PM Page 1



# నెల్లూరులో 492 ఆర్టీసి బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం



**బస్సుల్లో సిసి కెమెరాలు ఏర్పాటు**

**ఉచిత బస్సులు ప్రారంభించిన మంత్రి నారాయణ**

**నెల్లూరు, ఆగష్టు 15, ప్రభాతవార్త-విద్య :** మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే స్త్రీ శక్తి పథకం అమలు ద్వారా మహిళా స్వావలంబన దిశగా కూటమి ప్రభుత్వ ప్రయాణం కొనసాగుతుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. శుక్రవారం నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ లో స్త్రీ శక్తి పథకాన్ని పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆనంద్ తోడు రాగా మంత్రి నారాయణ లాంఛనంగా ప్రారంభించారు. పండుగ వాతావరణంలో ప్రత్యేకంగా అలంకరించిన బస్సులను జెండా ఊపి ప్రారంభించిన మంత్రి అదే బస్సులలో ర్యాలీగా నవాబ్ పేట వరకు ప్రయాణించారు. ఆర్టీసీ బస్టాండ్ నుండి మద్రాస్ బస్టాండ్, వి ఆర్ సి సెంటర్, గాంధీ బొమ్మ సెంటర్, బోసు బొమ్మ సెంటర్, ఆత్మకూరు బస్టాండు, స్టోన్ హౌస్ పేట తదితర ప్రాంతాల మీదుగా కొనసాగిన ర్యాలీలో దారిపొడుగున ప్రజలందరూ ముఖ్యంగా మహిళలు హర్షద్వానాలతో తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. జాయింట్ కలెక్టర్ కార్తీక్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, ఆర్ టి సి జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి, నాయకులు గిరిధర్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, ఆర్ టి సి ఈడీ నాగేంద్ర ప్రసాద్, జిల్లా ప్రజా రవాణా అధికారి షామీమ్ తదితరులు బస్ లో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ లో ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి నారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వం అందించిన 10 లక్షల కోట్ల అప్పుతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నప్పటికీ ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా స్త్రీ శక్తి పథకం అమలు ద్వారా 1900 కోట్ల వ్యయం అవుతుందని, అయినప్పటికీ ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీ మేరకు అమలు చేస్తున్నామన్నారు. నెల్లూరు జిల్లాలో సరాసరిన ప్రతిరోజు 61 వేలమంది మహిళలు ప్రయాణాలు చేస్తుంటారని, ఈ పథకం అమలు ద్వారా మహిళా ప్రయాణికుల సంఖ్య లక్షకు చేరుతుందన్నారు. అయినప్పటికీ ప్రజలకు సంక్షేమం అందించే ప్రక్రియలో వెనుకాడేది లేదన్నారు. సంక్షేమంతో పాటు రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువ మంత్రివర్యులు లోకేష్ నాయకత్వంలో నిరంతరం శ్రమిస్తున్నామన్నారు. పరిశ్రమల స్థాపనతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని, అందుకోసమే పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నామన్నారు. అదేవిధంగా నెల్లూరు జిల్లాకు సంబంధించి ఇచ్చిన ప్రతి హామీని తప్పనిసరిగా నెరవేరుస్తామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నామని, మహిళల సంతోషాన్ని బస్సు ప్రయాణంలో స్వయంగా చూసామన్నారు.

## ఉత్తమ అధ్యాపక అవార్డుల మార్గదర్శకాల్లో మార్పులు

**విజయవాడ,ఆగస్టు 15,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డుల మార్గదర్శకాలను ఉన్నత విద్యాశాఖ సవరించింది. కొత్తగా నామినేట్ చేసే విధానాన్ని తీసుకొచ్చింది. ముగ్గురు రెగ్యులర్ అధ్యాపకులు ఎవరి పేరునైనా ఈ అవార్డుకు ప్రతిపాదించేందుకు అవకాశం కల్పించింది. మొత్తం వెయ్యి మార్కులకు ప్రతిభను లెక్కించి ఈ అవార్డులకు ఎంపిక చేస్తారు. ఇందులో 800 మార్కులు భోధన,ఇతర కార్యక్రమాలకు, 200 మార్కులు ఇంటర్వ్యూలు ఉంటాయి. విశ్వవిద్యాలయాలకు సంబంధించి ఉన్నత విద్యామండలి చైర్మన్ ఈ అవార్డుల కమిఈకి అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. జెఎన్‌టీయూ(అనంతపురం),ఆదికవి నన్నయ వీసీలు సభ్యులుగా ఉంటారు. కళాశాల అధ్యాపకుల కమిటీలో కళాశాల విద్యాశాఖ డైరెక్టరేట్ జేడీ తదితరులు ఉంటారు.



## మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ప్రారంభం

### బస్సులో ప్రయాణించిన మంత్రి 'కొండపల్లి'

**గజపతినగరం (విజయనగరం జిల్లా), ఆగస్టు 1 ప్రభాతవార్త :** ౕూటమి ప్రభుత్వ తమ సూపర్ సిక్స్ హామీలలో భాగంగా శుక్రవారం 'స్త్రీ శక్తి' ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. విజయనగరం నుంచి ఉచిత బస్సులో మహిళ ప్రయాణికులతో పాటు ప్రయాణం చేసి సాయంత్రం గజపతినగరం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చేరుకున్నారు. మహిళలు కాంప్లెక్స్ ఆవరణంలో పెద్ద ఎత్తున ప్లే కార్డ్స్‌తో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను మహిళలు సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ, తమ ప్రభుత్వం ఒక్కొక్క హామీను అమలు చేసుకుంటూ ముందుకు సాగుతుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ప్రయాణ ఖర్చు తగ్గి, రోజువారీ జీవనంలో ఎంతో మేలు జరుగుతుందని ఆనందం వ్యక్తం చేశారు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలు నిర్భయంగా, ఉచితంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణం చేయవచ్చన్నారు. ఇది మహిళల ఆర్థిక భారం తగ్గించడమే కాక, వారి స్వావలంబనకు దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పివివి గోపాలరాజు, మాజీ మంత్రి, జనసేన పిఏసి సభ్యులు పడాల అరుణ, బిజెపి జాతీయ సభ్యుల రెడ్డి పావని,పిఏసిఎస్ అధ్యక్షులు లెంక బంగారు నాయుడు, మాజీ ఎంపీపీలు మక్కువ శ్రీధర్, గంట్యాడ శ్రీదేవి, జి.గోవింద, వైకుంఠం ప్రదీప్ కుమార్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఇఎపి సెట్ ఇంజినీరింగ్ రెండో విడత ప్రవేశాల కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపు

**విజయవాడ,ఆగస్టు 15,ప్రభాతవార్త ప్రతినిధి:** స్థానికత అంశంపై న్యాయస్థానం ఆదేశాలు ప్రభుత్వానికి అనుకూలంగా రావడంతో ఈఏపీ సెట్ ఇంజనీరింగ్ రెండో విడత ప్రవేశాల కౌన్సిలింగ్ సీట్ల కేటాయింపు పూర్తి చేశారు. ఇంజనీరింగ్‌లో మొత్తం 77.72% సీట్లు భర్తీ అయ్యాయి. ప్రభుత్వ,ప్రైవేటు విద్యాసంస్థల్లో కలిపి 1,53,964 సీట్లు ఉండగా 1,19,666 సీట్లు నిండాయి. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో 8,112 సీట్లకు గాను 6,751 సీట్లు భర్తీ కాగా ప్రైవేటు వర్సిటీల్లో,12,126 సీట్లలో 11 వేలు నిండాయి. ప్రైవేటు కళాశాలల్లో 1,33,726 సీట్లు ఉండగా 1,01,915 సీట్లు భర్తీ అయ్యాయి. అన్నింటిలో కలిపి 34,298 సీట్లు మిగిలాయి. క్రీడా కోటాకు సంబంధించి 677 సీట్లను కేటాయించలేదు.

శాప్ నుంచి సర్టిఫికెట్ల పరిశీలన పూర్తికానందున దీన్ని వాయిదా వేశారు. రెండో విడత కౌన్సిలింగ్‌లో కోర్సులు,కళాశాలలను మార్చుకునేందుకు 28,735 మంది స్లైడింగ్ తీసుకున్నారు. తుది విడత కౌన్సిలింగ్‌లో 14,409 మందికి సీట్లు కేటాయించారు.

## సూపర్‌సిక్స్ పథకాలు సూపర్ హిట్

### మహిళలకు వరం ఉచిత బస్సు ప్రయాణం: మంత్రి మండిపల్లి



**కడప, ఆగస్టు 15, ప్రభాతవార్త బ్యూరో** ఆర్టీసి బస్సుల్లో ఉచిత ప్రయాణం మహిళలకు వరం అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి స్పష్టం చేశారు. సూపర్ సిక్స్‌లో భాగంగా ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకాన్ని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శుక్రవారం రాయచోటిలో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం రోజు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం మహిళలకు తమ ప్రభుత్వం ఇచ్చే గౌరవమని అభిప్రాయపడ్డారు. మహిళ సాధికారత కోసమే సిఎం చంద్రబాబు డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేశారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఎక్కడ నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణం చేయవచ్చని తెలిపారు. పల్లెవెలుగు, అల్ట్రా వెలుగు, ఆర్టీనరి, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బస్సులో ఆధార్, రేషన్‌కార్డు, ఓటర్ ఐడిలలో ఏదో ఒకటి చూపించి కండెక్టర్ ఇచ్చే జీరో ఫేర్ టికెట్‌తో ప్రయాణం చేయవచ్చని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసిలోని మొత్తం 8,458 బస్సుల్లో మహిళలు, యువతులు రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణం చేయవచ్చని మంత్రి తెలిపారు. ప్రయాణాలకు అయ్యే ఖర్చును మహిళలు ఇతర అవసరాలకు వినియోగించుకోవచ్చని మంత్రి సూచించారు. అందుబాటులో ఉన్న బస్సులతో మొదలుపెట్టి అవసరం మేరకు భవిష్యత్తులో పల్లెవెలుగు కొత్త ఏసి బస్సుల్లో కూడా ప్రయాణించేందుకు వీలుగా సిఎం చంద్రబాబు ఆలోచిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల తల్లులకు తల్లికి వందనంతో పాటు దీపం2లో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి దేనని తెలిపారు. ప్రభుత్వం మహిళల పక్షపాతి అని మహిళలు రథసారదులుగా ఉండాలన్న ఉద్దేశంతో మహిళల అభివృద్ధి కోసమే అనేక పథకాలు ప్రవేశ పెట్టడం జరుగుతోందన్నారు.

## స్వాతంత్ర్యదినోత్సవాన ఆకట్టుకున్న అశ్వప్రదర్శన

**తిరుపతి,ఆగస్ట్ 15ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మిక సంస్థ టిటిడిలో 79వ స్వాతంత్ర్యదినోత్సవాన శుక్రవారం ఉదయం టిటిడి కళాశాలల ఎన్‌సిసి విద్యార్థులు అశ్వాలతో ప్రదర్శన ఆకట్టుకున్నాయి. లెప్టనంట్ కల్నల్ అనుఫ్ ఆధ్వర్యంలో గుడ్‌లక్, రోమన్‌ఫ్లేమ్, గగన్, ఫైటర్, రాణిరూన్సీ, బ్లోరి పేర్లున్న అశ్వాలతో ఎన్‌సిసి క్యాడెట్లు పలు విన్యాసాలు చేశారు. మొదటగా జాతీయజెండా, టిటిడిజెండాలను ప్రదర్శించారు. క్యాడెట్లు అశ్వాలపై పరేడ్‌మైదానం చుట్టూ తిరుగుతూ చేసిన విన్యాసాలు అలరించాయి. టిటిడి నిఘాభద్రత విభాగం ఆధ్వర్యంలో పోలీసు జాగిలాల ప్రదర్శన కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# తిరుమల సమాచారం

## సాంకేతిక ప్రపంచంలో ఆధ్యాత్మిక మానవీయ విలువలు పెంపొందించాలి

### - టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి



**తిరుమల,ఆగస్ట్ 15ప్రభాతవార్తప్రతినిధి:** నూతన సాంకేతిక ప్రపంచంలో ఆధ్యాత్మిక మానవీయ విలువను పెంపొందించాల్సిన బాధ్యత ధార్మిక సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంపై ఉందని టిటిడి అదనపు ఇఒ చిరు మామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. అందుకనుగుణంగా టిటిడి లో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి విలువలతో వ్యవస్థను ముందుకు తీసుకెళ్ళాలన్నారు. 79వ స్వాతంత్ర్యదినోత్సవం వేడుకల్లో శుక్రవారం ఉదయం గోకులం విశ్రాంతి భవనంలోని క్యాంపు కార్యాలయంలో జాతీయజెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ఎంతోమంది స్వాతంత్ర్య సమరయోధుల పోరాట ఫలితంగా మనకు స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. వారి స్ఫూర్తితో విలువలతో కూడిన వ్యవస్థలో భక్తులందరికీ నిస్వార్థంగా సేవలందించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇటీవల కాలంలో టిటిడి ఎన్నో నూతన కార్యక్రమాలు చేపట్టిందని, భక్తుల కోసం నిరంతరాయంగా కష్టపడి పనిచేస్తున్న ఉద్యోగులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఇలాగే పనిచేస్తూ భక్తుల నుండి మన్ననలు చూరగొనాలని ఆయన సూచించారు. అంతకుముందు అదనపు ఇఒ వెంకయ్యచౌదరి టిటిడి భద్రత సిబ్బంది నుండి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం ఆయన విద్యార్థులుకు, సిబ్బందికి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టిటిడి సిఇ సత్యనారాయణ, డిప్యూటీ ఇఒలు రాజేంద్ర, వెంకటయ్య, సోమన్నారాయణ, విఎస్ఒ రామ్‌కుమార్, పిఆర్ఒ నీలిమ, ఉద్యోగులు, భద్రత సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుమలలో భక్తులకు అందుబాటులోకి పద్మావతిసదనం వసతిగృహం

### - ప్రారంభించిన చైర్మన్ నాయుడు



**తిరుమల,ఆగస్ట్ 15ప్రభాతవార్తప్రతినిధి:** దాతల సహకారంలో విరాళాలతో నిర్మించిన పద్మావతి సదనం అతిధిగృహాన్ని శుక్రవారం ఉదయం టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు, రాష్ట్రప్రభుత్వ స్పెషల్ సిఎస్ ఎంటి కృష్ణబాబుతో కలసి ప్రారంభించారు. తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనం వెనుకవైపు 6 గదులతో నిర్మితమైన ఈ విశ్రాంతి భవనం భక్తులకు అందుబాటులోకి వచ్చింది. విశాఖపట్నంకు చెందిన దాత మైత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ మైనింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చైర్మన్ టి.శ్రీనివాసరావు ఈ అతిదిగృహాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా దాతను టిటిడి చైర్మన్ నాయుడు అబినందించారు.

## అంకితభావంతో భక్తులకు సంతృప్తికర సేవలు

### - టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు



**తిరుమల,ఆగస్ట్ 15ప్రభాతవార్తప్రతినిధి:** మహానుభావుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని భక్తులకు అత్యంత అంకితభావంతో ఉద్యోగులు సేవలందించాలని, తిరుమల యాత్ర భక్తులకు ఒక మధురానుభూతిని కలిగించాలని టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు వెల్లడించారు. సామాన్యభక్తులకు సాంకేతిక పరిజ్ఞానంతో మరింత తక్కువ సమయంలో శ్రీవారి దర్శనం చేయించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నా మన్నారు. 79వ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం తిరుమలలోని చైర్మన్ క్యాంపు కార్యాలయంలో జాతీయజెండాను చైర్మన్ బిఆర్‌నాయుడు ఆవిష్కరించారు. టిటిడి సమాచారాన్ని ప్రపంచవ్యాప్తంగా ఎప్పటికప్పుడు భక్తులకు చేరవేయడంలో మీడియాప్రతినిధుల పాత్ర కీలకంగా ఉందని అభినందనలు తెలిపారు.

## సర్వదర్శనానికి 24గంటలుపైనే



**తిరుమల,ఆగస్ట్ 15 ప్రభాతవార్తప్రతినిధి:** వారాంతం వరుససెలవుల రద్దీ నేపధ్యంలో తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వారాంతసెలవులతో ఏడుకొండలు భక్తజన సంద్రంగా మారాయి. శుక్రవారం ఉదయానికి తిరుమలలో అన్ని కంపార్టుమెంట్లు నిండిపోయి ఆలయం వెలుపల మూడు కిలోమీటర్లు భక్తుల క్యూలైన్లు శిలాతోరణం వరకు చేరాయి. స్వామివారి దర్శనం కోసం భక్తులు భారీగా చేరుకుంటున్నారు. టోకెన్ లేని భక్తులకు వెంకన్న దర్శనానికి 24గంటలపైగానే భక్తులు నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంది. వెలుపల క్యూలైన్లలో భక్తులకు భద్రతతోబాటు సౌకర్యాల కల్పనలో సెక్యూరిటీ సిబ్బంది, శ్రీవారిసేవకులు నిమగ్నమయ్యారు. సాయంత్రానికి 43వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. క్యూలైన్లలో ఉన్న భక్తులకు సంతృప్తికరంగా వీలైనంత త్వరగా ఆలయంలోపల దర్శనం చేయించడంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి స్వీయపర్యవేక్షణ, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, వింగ్ విఎస్ఒ ఎస్టీవిరామ్‌కుమార్ సహకారంతో ప్రశాంతంగా దర్శనం చేసుకుంటున్నారు.

## అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన లబ్దిదారులందరికీ అందాలి: సిఎస్ విజయానంద్



జాతీయ పతాకానికి అభివాదం చేస్తున్న సిఎస్ కె.విజయానంద్

**విజయవాడ,ఆగస్టు15,ప్రభాతవార్తప్రతినిధి:** సమాజంలోని పేదల అభివృద్ధికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను పెద్దఎత్తున అమలు చేయడం జరుగుతోందని ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్నారు.ఆయా పథకాల ప్రయోజనం గ్రామ స్థాయి వరకూ అర్హులైన వారందరికి అందాలన్నారు. భారతదేశ 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన వేడుకలకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ముఖ్య అతిధిగా పాల్గొని జాతిపిత మహాత్మాగాంధి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించిన తదుపరి మువన్నెల జాతీయ జెండాను ఆవిష్కరించారు.అనంతరం సిఎస్ మాట్లాడుతూ ముందుగా 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రజలందరికీ శుభా కాంక్షలు తెలిపారు. ఆనాడు దేశానికి స్వాతంత్ర్యాన్ని తీసుకువచ్చేందుకు అనేకమంది తమ ప్రాణ త్యాగాలు చేశారని ఆ మహనీయులందరి త్యాగాలను మనందరం ఒకసారి స్మరించు కోవాల్సిన శుభదినం నేడని పేర్కొన్నారు.జాతిపిత మహాత్మాగాంధి,రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్ అంబేద్కర్,త్రివర్ణ పతాక రూపకర్త పింగళి వెంకయ్య,అల్లూరి సీతారామ రాజు వంటి మహనీయులతో పాటు ఆనాడు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న స్వాతంత్ర్య సమరయోధులు వారి త్యాగాలను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పిద్దామని చెప్పారు. సమాజంలోని పేదల అభివృద్ధికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను పెద్దఎత్తున అమలు చేయడం జరుగుతోందని ఆయా పథకాల లబ్దిని గ్రామ స్థాయి వరకూ అర్హులైన ప్రతి లబ్దిదారునికు సక్రమంగా చేరేలా మనం అందరం చిత్తశుద్ధితో కృషి చేయాల్సిన ఆవశ్యకత ఉందని సిఎస్ విజయానంద్ పిలుపునిచ్చారు.పేదరికం నిర్మూలనే లక్ష్యంగా సమాజంలోని ఆర్థిక అసమానతలను తొలగించే ఉద్యేశ్యంతో ప్రభుత్వం స్వర్ణ ఆంధ్ర పి4 ఫౌండేషన్ ను ప్రారంభించడం జరిగిందని ఆకార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు అధికారులు,ఉద్యోగులు కృషి చేయాలని సిఎస్ సూచించారు.

పర్యావరణానికి మరీ ముఖ్యంగా మానవాళి మనుగడకు ముప్పుగా తయారౌతున్న ప్లాస్టిక్ వాడకాన్ని దశలవారీగా తగ్గించేందుకు 2026 జూన్ 5వ తేదీ ప్రపంచ పర్యావరణ దినోత్సవం నాటికి ఎపిని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వెల్లడించారు.

## ఆలయాలు, మసీదుల వద్ద రెప రెప లాడిన 'తిరంగా ఝుండా'

### సైకిల్ ర్యాలీ నిర్వహించిన ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి



**శ్రీకాళహస్తి,ఆగస్టు 15 ప్రభాతవార్త** తిరుపతిజిల్లా శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం శుక్రవారం ఆలయాలు, మసీదుల వద్ద తిరంగాఝుండా ఊంచా రహే హమారా' అన్నట్లు మువ్వన్నెల జెండా రెప రెప లాడింది. అలాగే పుణ్యక్షేత్రంలో శాసన సభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అధికారులు,కార్యకర్తలతో కలసి ఆనందోత్సాహాలతో నిర్వహించారు.గతంలో ఎన్నడూ లేని విధంగా మసీదుల వద్ద జమియతుల్ ఉలమ సారధ్యంలో స్వాతంత్ర్యదినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఉలమ నాయకుడు ముఫ్తీనయిం సాహెబ్ వారం రోజులుగా విద్యావంతులతో సమావేశాలు జరిపి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ఈ మేరకు పట్టణంలోని 15 మసీదుల వద్ద జాతీయ జెండా రెప రెప లాడింది.వారం రోజుల పాటు జమియతుల ఉలమ సేవా సమాజం తరఫున నిర్వాహకులు ముఫ్తీనయిం సాహెబ్ ప్రతి మసీదు వద్ద జాతీయ జెండాను ఎగుర వేయాలని సూచించారు. సమయం సూచించారు. తరువాత జామియా మస్‌జిద్ వద్ద కార్యక్రమాలు భారీ ఎత్తున నిర్వహిస్తామని అక్కడకు అన్ని మసీదుల ముస్లింలు హాజరు కావాలని సూచించారు. రామచంద్రాపురంలోని మదరసాలో నిర్వాహకులు హాఫీజే ఖుర్ ఆన్ నసీం అఖ్తర్ సారధ్యంలో జాతీయ జెండాను ఎగురు వేసి వందన స్వీకారం చేసారు.జామియా మస్‌జిద్ వద్ద జరిగిన కార్యక్రమాలు విన్నూత్నంగా ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాలకు జిల్లా సదర్ ముఫ్తీ నయిం సాహెబ్‌లు పర్యవేక్షణలో జెండా ఎగురవేసారు.ఈ ప్రాంతం మువ్వన్నెల జెండాలతో,బెలూన్‌లతో రెప రెప లాడించారు.ఈ కార్యక్రమాల్లో జామియా మస్‌జిద్ అధ్యక్షులు బిఎస్ అక్రమ్‌సాహెబ్,శ్రీకాళహస్తి ఖాజీ సాహెబ్ మొహిద్దీన్ షరీఫ్ మౌలానా రైహాన్‌సాహెబ్ మౌలాన మహబూబ్‌బాషాసాహెబ్ మౌలాన ముహమ్మద్ అలి,అంజద్‌సాహెబ్,అబ్దుల్ కలాం చాన్‌బాషా,ఎస్ ఆర్ రఫీల సారధ్యంలో కార్యక్రమాలను నిర్వహించారు.

## జల వివాదాల కమిటీకి పేర్లు ప్రతిపాదించండి

### - రాష్ట్రానికి కేంద్ర జలశక్తి శాఖ లేఖ

**విజయవాడ,ఆగస్టు 15,ప్రభాతవార్త ప్రతినిధి:** రెండు తెలుగు రాష్ట్రాల మధ్య జల వివాదాల పరిష్కారానికి ఏర్పాటు చేసే కమిటీ కోసం ఆంధ్రప్రదేశ్ నుంచి సభ్యుల పేర్లు తెలియచేయాలని కేంద్ర జలశక్తి శాఖ కోరింది. ఈ మేరకు ఏపీ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌కు కేంద్ర జలశక్తి శాఖ సంయుక్త కార్యదర్శి ప్రదీప్‌కుమార్ అగర్వాల్ గురువారం లేఖ రాశారు.'జులై 16న ఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ అధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొని తాజా జల వివాదాలపై చర్చించారు. పెండింగ్ అంశాలను పరిష్కరించేందుకు అధికారులు,నిపుణులతో కమిటీ ఏర్పాటు చేయాలని అంగీకరించారు. ఈ కమిటీలో ఇరు రాష్ట్రాలతో పాటు కేంద్రం నుంచి సభ్యులను నామినేట్ చేయాలని నిర్ణయించారు. కాని సభ్యులుగా ఎవరిని నియమించాలో ఇంకా ఎలాంటి ప్రతిపాదనలు రాలేదు. ఏపీ వెంటనే కమిటీ సభ్యుల పేర్లను తెలియచేయాలి' అని లేఖలో కోరారు.

## ఎఐ సాంకేతికతతో మరింత త్వరగా శ్రీవారి దర్శనం

### - ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఎస్వీమ్యూజియం అభివృద్ధి

#### - స్వాతంత్ర్యదినోత్సవాన టిటిడి చైర్మన్ నాయుడు, ఇఒ శ్యామలరావు



**తిరుపతి,ఆగస్ట్ 15ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి వస్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకూ రెట్టింపవుతున్న తరుణంలో,కృత్రిమమేధ(ఎఐ)సాంకేతిక సహాయంతో మరింత త్వరగా భక్తులకు గోవిందుని దర్శనం చేయించేలా కార్యాచరణ సిద్దంచేస్తున్నామని టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు తెలిపారు. అశేషసంఖ్యలో భక్తులకు సేవలందిస్తున్న టిటిడి అధికారులు, ఉద్యోగులు, భద్రత సిబ్బంది,అర్చక సిబ్బంది,శ్రీవారిసేవకులకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీవేంకటేశ్వరస్వామి యావత్ ప్రపంచానికి శాంతిసౌఖ్యాలు ప్రసాదించాలని ప్రార్థించానన్నారు. 79వ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా శుక్రవారం టిటిడి పరిపాలనభవనం ప్రాంగణంలో టిటిడి ఇఒ శ్యామలరావుతో కలసి చైర్మన్ బిఆర్‌నాయుడు త్రివర్ణపతాకాన్ని ఎగురవేశారు. ప్రజలందరి భాగస్వామ్యంతో మరింత విస్తృతంగా సనాతన ధర్మ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని నాయుడు తెలిపారు. దేశవిదేశాల నుండి తిరుమలకు వస్తున్న భక్తులకు సౌకర్యవంతంగా స్వామివారి దర్శనం కల్పించేందుకు చూస్తున్నామన్నారు. భారగతదేశం ప్రపంచంలోనే 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఏర్పడుతుందని తెలిపారు. ఈ శుభసమయంలో శ్రీనివాసుడు అందరికీ సకలశుభాలు కలగజేయాలని ప్రార్థిస్తున్నానన్నారు. తిరుమలలో అన్నప్రసాదాల నాణ్యత, లడ్డూల నాణ్యత పెంచి ఎక్కువమంది భక్తులకు అందిస్తున్నామన్నారు. వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌లో ప్రతి మూడుగంటలకు ఒకసారి అన్నప్రసాదాలు, చిన్నపిల్లలకు పాలు అందిస్తున్నామన్నారు. టిటిడి ఇఒ శ్యామలరావు మాట్లాడుతూ తిరుమలలోని ఎస్వీమ్యూజియాన్ని ప్రపంచస్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామన్నారు. భక్తుల విజ్ఞప్తి మేరకు శ్రీవాణి బ్రేక్ దర్శనాల టిక్కెట్లు ఉదయం జారీచేసి సాయంత్రం దర్శనం చేయిస్తున్నామని తెలిపారు. తిరుమలలో కల్యాణకట్టను అత్యాధునికంగా దశలవారీగా అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. యాంటీడ్రోన్ వ్యవస్థను ఏర్పాటుచేస్తామన్నారు. నాలుగుకేంద్ర పాలిత ప్రాంతాలు, 15 రాష్ట్ర ప్రభుత్వాల ఆమోదాల మేరకు ఆయారాష్ట్రాల రాజధానుల్లో ఆలయాల నిర్మాణం చేపడతామన్నారు. శ్రీవారిసేవ విభాగాన్ని మరింత బలోపేతం చేస్తామన్నారు .నిత్యకైంకర్యాలను జీయ్యంగార్ల, ఆగమశాస్త్రనిపుణుల సలహా మేరకు ఆగమోక్తంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

వార్త

మనం ఎలక్ట్రానిక్స్ సమాచారం, కంప్యూటర్ల యుగంలో జీవిస్తున్నాం. రాబోయే పది సంవత్సరాల్లో ప్రపంచంలో ప్రతి వస్తువు మారిపోతుంది. ఆ ప్రపంచం కోసం ఇప్పటి నుంచే సంసిద్ధం కావడం తప్పనిసరి.

-ఎ.బెర్గ్

# 'ఓటు' హక్కు పారదర్శకత ప్రధానం!

ఓట్లపై సర్వాధికారాలు స్వయంప్రతిపత్తి ఉన్న ఎన్నికల కమిషన్‌కు కొత్త చిక్కొచ్చిపడింది. బీహార్ ఎన్నికలకు ముందే బీహార్ బీమార్ పట్టుకున్నట్టుంది. బీహార్‌లో ఇటీవల చేపట్టిన ఓటర్ల సవరణ ప్రక్రియలో లోపాలు సుప్రీంకోర్టు ముందుకొచ్చాయి. పద్ధతి, పాడు లేకుండా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (సర్) నిర్వహించి తొలగించిన 65 లక్షల మంది పేర్లనూ వెల్లడించాలని,ఎందుకు తొలగించారో కారణాలు, వారి చిరునామాలు సైతం బహిరంగపరచాలని ఎన్నికల సంఘాన్ని సుప్రీం ఆదేశించింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం జిల్లాల వారీ ఎన్నికల అధికారులు తమతమ వెబ్‌సైట్లతోపాటు బీహార్ ఎన్నికల అధికారి వెబ్‌సైట్‌లో కూడా ఆగస్టు 19లోగా ఈ వివరాలు అందించాల్సిందేనని స్పష్టంగా చెప్పింది. నిన్నమొన్నటి వరకు ఈ వివరాలను తాము ఎవరికీ ఇవ్వక్కర్లేదని, తామే ఫైనల్ అంటూ ఎన్నికల సంఘం భీష్మించుకు కూర్చొంది. విపక్షాలు తాము పట్టిన పట్టు విడవకుండా తాడోపేడో తేల్చుకోవాలని చూడటం వల్లనే జరుగుతున్న విధానపర లోపాలను బయట పెట్టగలిగింది. పిటీషన్‌లలో 'ది అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్' వారి అభ్యర్థన మేరకు జాబితా నుంచి తొలగించిన వారిపేర్లను ప్రచురించేందుకు తొలుత ఎన్నికల సంఘం అంగీకరించలేదు. కాలానుగుణంగా ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు సవరణలు చేపట్టే బాధ్యత ఎన్నికల కమిషన్‌దే. కాగా గుర్తింపు కార్డుల విషయంలో తకరారు పెట్టిన కమిషన్ తరపున తాజాగా కొత్త వాదనలు తెరపైకొస్తున్నాయి. పారదర్శకంగా ఉండాల్సిన ఎన్నికల సంఘం నిర్బంధంగా విపక్షాల వాదనను అంగీకరించకపోవడమే అసలు చిక్కు. సుప్రీంకోర్టు కూడా అదే చెప్పింది. ఇ.సి. మీద నమ్మకం లేకపోవడం వల్లనే రకరకాల అనుమానాలు తలెత్తుతున్నాయని మరణించిన వారి ఓట్లను తొలగించినప్పుడు, వేర్వేరు ప్రాంతాల్లో ఒకే వ్యక్తికి ఓట్లున్నప్పుడు, వేరే అసెంబ్లీ నియోజకవర్గాల్లో శాశ్వత స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న వారి జాబితాలుంటే బహిర్గతం చేయవచ్చు కదా! అని ఎన్నికల కమిషన్‌ను సుప్రీం న్యాయమూర్తులు ప్రశ్నించారు. ఇవన్నీ బహిర్గతం చేసి ఆగస్టు 22న నివేదికను సమర్పించాల్సి ఉంటుందన్నది తేటతెల్లం. ఎలక్షన్ ఫొటో, ఐడెంటిటీ కార్డు (ఎపిక్) నంబరుతో ఆ జాబితాలో తమ పేరును వెతుక్కోగలిగేలా సెర్చ్ ఆప్షన్‌ను అందుబాటులో ఉంచాలని సూచించింది. ఇలా పారదర్శక విధానం ద్వారా ఓటర్లలో నమ్మకం కలిగించవచ్చునని ధర్మాసనం పేర్కొంది. ఈ జాబితాలను రాజకీయ పార్టీలకు ఇచ్చామన్న ఎన్నికల సంఘం వాదనను ధర్మాసనం అంగీకరించలేదు. రాజకీయ పార్టీలు, కార్యకర్తలపై ఓటరు తమ ఓటు హక్కును గుర్తించేందుకు ఆధారపడాల్సి రావడం సరైన విధానం కాదని ధర్మాసనం తేల్చింది. వెబ్‌సైట్‌లలో జాబితాలను పెట్టి పారదర్శకంగా వ్యవహరించమని ధర్మాసనం కోరింది. ఈ అనుమానాల నేపథ్యంలో ఓటు హక్కును ఏయే కారణాల చేత తొలగించారో విషయం తెలిస్తే ఆయా ఓటర్లు రెట్టిపై చేసుకునే అవకాశాన్ని తీసుకుంటారు. తొలగించిన జాబితా స్థానిక,ఇంగ్లీషు వార్తాపత్రికలు, రేడియో, టెలివిజన్, మీడియాలో ప్రచురణ చేయాలంటూ ఆదేశించింది. ఇవన్నీ పారదర్శకతకు మార్గాలే. నిజానికి ఈసారి ఎన్నికల కమిషన్ ఎందుకో విపక్షాల సందేహాలను తీర్చేందుకు పారదర్శకత విధానంలో జాబితాలను వెబ్‌సైట్‌లో ఉంచేందుకు కాస్త వెనుకబాటుతనాన్ని ప్రదర్శించింది. ఇందులో ప్రత్యేకించి అంతరార్థమేదీ లేకున్నా ఏదో దాయాలన్న ఆలోచనలో ఉందనే అభిప్రాయం మరింత బలపడే విధంగా వ్యవహరించింది. అందువల్లనే విషయం సుప్రీం కోర్టు వరకు చేరింది. తమ ఓట్లు గల్లంతైందని అనుకున్న వారు తగు ఆధారాలతో వెబ్‌సైట్‌లోకి వెళ్లి వెతుక్కొని కారణాలుంటే ఓటరు పోలింగ్ అధికాలందరికీ అందుబాటులో ఉండే అవకాశం లేని ధ్రువపత్రాలు ఎన్నుంటే ఏం,అసలు సిసలైన ఆధార్ ధ్రువీకరణ పత్రంలో ఆ జాబితాలో లేనప్పుడు అన్నది విపక్షాల మాట. కర్ణాటకలోని మహదేవ్‌పురం నియోజకవర్గంలో లక్ష నకిలీ ఓట్లను గుర్తించామని రాహుల్ గాంధీ మీడియా సమావేశంలో ప్రకటించిన మరునాడే 'సెర్చ్ ఆప్షన్'లు తీసేసారు. ఇదో కొత్త సందేహం.తమ ఓట్లు గల్లంతైందని అనుకున్న వారు తగు ఆధారాలతో వెబ్‌సైట్‌లోకి వెళ్లి వెతుక్కొని కారణాలుంటే ఓటరు పోలింగ్ అధికారుల వద్ద కెళ్లి తగు ధ్రువీకరణ పత్రంగా సమర్పించి ఓట్లను పునరుద్ధరించుకోవచ్చు. ఈ తీర్పును కాంగ్రెస్ పార్టీ స్వాగతించింది. ఓట్ల దొంగలకు సందేశంగా అభివర్ణించింది. ఒక పక్క ఓటు చౌర్యం జరిగిందంటూ రాహుల్ గాంధీ గొంతెత్తగానే 'ఓటు చౌర్యం' అని అనడానికి వీల్లేదని, ఇతరత్రా సందేహాలుంటే అడగాలని ఎన్నికల సంఘం కోరింది. ప్రజల ఓటు హక్కు కోల్పోనివ్వబోమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే స్పష్టం చేశారు.బీహారులో 'సర్' ఓటర్ల సవరణ జాబితా విషయంలో కాంగ్రెస్ పోరాటానికి సుప్రీం కోర్టు తీర్పుతో ఒక సంతృప్తికరమైన పరిష్కారం లభించినట్లైంది. పార్లమెంటులో, బీహార్‌లో ఓట్ల సవరణ ప్రక్రియలో అవకతవకల విషయమై రాహుల్ గాంధీ చర్చ పెట్టమంటే స్పీకర్ వాయిదాలతో కాలం గడుపుతున్నారని కాంగ్రెస్ ఎద్దేవా చేసింది. రాజ్యాంగ బద్ధంగా స్వతంత్రంగా పనిచేయాల్సిన ఎన్నికల సంఘం బీహార్ విషయంలో సృష్టించిన సమస్యకు తెరపడడం ప్రజాస్వామ్యవాదుల విజయంగా భావిస్తున్నారు.ఇకపై బీహార్ నుంచి రాహుల్ గాంధీ 'ఓటర్ అధికార్ యాత్ర'కు మార్గం సుగమం.

పరుగెత్తేవారు వెనక్కి చూడకుండా ఎలా పరుగెడతారో, విజయం వైపు పయనించేవారు కూడా ముందుకే కానీ వెనక్కి చూడకూడదు.



ఆస్కార్ వైల్డ్

చదవగలిగిన వాడికి, ధ్యానం చేయగలిగిన వాడికి సాయం కాలాలు సరదాగా గడుస్తాయి. జీవితం విసుగ్గా ఉండదు.



లోవెల్

# మాటల్లోనే వ్యవ'సాయం'

**పూర్వపరాల్లోకి వెళ్లితే 1967లో దేశంలో ఏర్పడిన ప్రత్యేక పరిస్థితుల ఆధారంగా 'ఝా' కమిటి సిఫారసు మేరకు వ్యవసాయోత్పత్తుల వ్యయాల ధరల కమిషన్‌ను ఏర్పాటు చేశారు. తర్వాత కాలంలో వ్యవసాయరంగంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా డాక్టర్ సేన్ కమిటీ సూచనల మేరకు 'వ్యవసాయోత్పత్తుల వ్యయాల ధరల కమిషన్'ను సంస్కరించారు. మద్దతు ధరను నిర్ణయించడంలో ఈ కమిషన్‌ది కీలకపాత్ర. ఏదిఏమైనా ఈ విధానం అమలులో ఉన్న లోపాల కారణంగా రైతులకు న్యాయమైన గిట్టుబాటు ధర లభించడం లేదనేది వాస్తవం. అన్నదాతలకు ఇంత అన్యాయం కళ్లముందే జరుగుతుంటే తమది రైతుల ప్రభుత్వమని, తాము అన్నదాతల పక్షపాతి అంటూ, రైతుల కోసం ఏమైనా చేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పుకుంటూ వాచావాత్సల్యంతో కాలం గడపడం న్యాయం కాదు.**

దామెర్ల సాయిబాబ

మాటలు కోటలు దాటుతుంటే చేతలు గడప దాటడం లేదంటారు. వ్యవసాయం విషయంలో పాలకులు వ్యవహరిస్తున్న తీరు ఇందుకు అద్దం పడుతున్నది. కోట్లాది రూపాయలతో ఎన్నో రాయితీలతో పాటు రైతుల సంక్షేమం కోసం మరెన్నో పథకాలు చేపడుతున్నా రైతుల జీవనంలో ఆశించిన మార్పు రావడం లేదు. ఎవరెన్ని మాట్లాడినా ఎంత చేశామని చెప్పుకుంటున్నా దేశంలో రైతుల పరిస్థితి నానాటికీ దిగజారిపోతున్నది. కారకులు ఎవరైనా, కారణాలు ఏమైనా రైతులు ఎంతోకాలంగా బలైపోతూనే ఉన్నారు. ఇప్పటికీ దేశవ్యాప్తంగా లక్షలాది మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. మరెందరో అటు వ్యవసాయాన్ని వదలలేక, మరో వృత్తి చేతకాక అందులోనే కృంగికృశించి పోతున్నారు. రైతుల ఈ దుస్థితికి ఎంతో మంది మరెన్నో విభాగాలతోపాటు ప్రకృతి చేస్తున్న విన్యాసాలు కూడా కారణమవుతున్నాయి. ప్రకృతి ఎందుకో ఏమోకానీ రైతుల పట్ల పగబట్టి, పంతం బూని, దెబ్బ మీద దెబ్బ కొడుతున్నదేమోననిపిస్తున్నది. అయితే అతివృష్టి, కుంభవృష్టి లేకుంటే అనావృష్టి అన్నట్లుగా ప్రకృతి వ్యవహరిస్తున్నది. దేశంలోని కొన్ని రాష్ట్రాలు వరదల బీభత్సంతో అల్లాడిపోతుంటే మరి కొన్ని ప్రాంతాలు చుక్కనీటి కోసం అర్రులు చాస్తున్నాయి. వేసిన పంటలు చేతికి వచ్చేవరకు నమ్మకంలేని దురదృష్టపు పరిస్థితులు దాపురించాయి. గతవారం రోజులుగా కురుస్తున్న వర్షాలు తెలుగు రాష్ట్రాలతో దేశంలోని అనేక ప్రాంతాల్లో జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. క్లౌడ్‌బరస్ట్‌లతో ప్రధానంగా హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్ముకాశ్మీర్ లాంటి రాష్ట్రాలకు జరుగుతున్న నష్టం అంతా ఇంతా కాదు. జమ్ముకాశ్మీర్ కొండల్లో నిన్న క్లౌడ్‌బరస్ట్ బీభత్సం సృష్టించింది. మచైల్ మాత ఆలయానికి వెళుతున్న యాత్రికులపై విరుచుకుపడింది. దాదాపు అరవై మందికిపైగా చనిపోగా, మరొక వంద మంది గల్లంతైనట్లు చెపుతున్నారు.మరెందరో క్షతగ్రాతులయ్యారు. అయితే ఐదువందల మందికిపైగా శిధిలాల కింద ఉన్నట్లు నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా అభిప్రాయపడడం ఆందోళన కలిగిస్తున్నది. ఇక దేశవ్యాప్తం వ్యవసాయరంగం కుదేలైపోతున్నది. ఈ వానలు వరదలకు వేలాది ఎకరాల్లోని పంటలు నీట మునిగాయి. ముఖ్యంగా మిర్చి,పత్తి లాంటి వాణిజ్య పంటల రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా వుంది. ఇవన్నీ ప్రకృతి చేస్తున్న విన్యాసాలకు రైతులకు వస్తున్న కష్టాలు. ఇక తోటి మానవుడు చేసున్నదగా, దోపిడీ, మోసాలను అన్నదాతలు అధిగమించలేకపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు కావాల్సింది మాటలు, వాగ్దానాలు కాదు. ఎవరి దయా దాక్షిణ్యాల మీదనో అన్నదాతలు బతకాలని కోరుకోవడం లేదు. కోరుకోరు కూడా. వారికి న్యాయబద్ధంగా రావాల్సింది, రాజ్యాంగబద్ధంగా కల్పించినవి వారికి సకాలంలో అందిస్తే చాలు. కానీ ఈ బాధ్యతను నిర్వహించ డంలో పాలకులు విఫలమవుతుండడం వల్లనే ఈ పరిస్థి తులు దాపురిస్తున్నాయి. ఈ విషయాలన్నీ విస్మరించి ఏదో చేస్తామన్నట్టు ప్రకటించడం ఎంతవరకు న్యాయమో ఆలోచించాలి. విత్తేదగ్గర నుండి విక్రయించే వరకు అన్నీ మోసాలే. మొత్తం వ్యవసాయరంగానికి మూలం విత్తనాలు, ఎరువులు, గిట్టుబాటు ధర. అలాగే మొలచిన మొక్కలకు చీడపీడలు ఆశించకుండా కాపాడే క్రిమిసంహారక మందులు. మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఈ అంశాలు వ్యవసాయరంగంలో అత్యంత ప్రధానమైనవి. నాణ్య మైన విత్తనాలు, సరసమైన ధరలకు సకాలంలో రైతులకు అందించాలి. ఈ విషయంపై ప్రయత్నం చేస్తున్నట్లు గత రెండు, మూడు దశాబ్దాలుగా పాలకులు చెబుతూనే

ఒక్క మాట

ఉన్నారు. కానీ వాస్తవ పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. నాసిరకం, నకిలీ విత్తనాలు దేశమంతా సరఫరా అవుతు న్నాయి. నాసిరకం విత్తనాల విషయంలో కఠిన చర్యలు తీసుకోకపోవడంపై రెండేళ్లక్రితం తెలంగాణ హైకోర్టు జోక్యంచేసుకొని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. విత్తనాలకోసం రైతులు ప్రైవేట్ వ్యాపారులపై ఆధారపడాల్సి వస్తుందని, వారిపై ప్రభుత్వ నియంత్రణ లేదంటూ అందిన ఒక లేఖను హైకోర్టు ప్రజాప్రయోజన వాజ్యంగా పరిగణనలోకి తీసుకుంది. రాష్ట్రంలో రైతులు మంచి దిగుబడులు వస్తాయనే ఆశతో ప్రైవేట్ వ్యాపారుల మాట విని విత్తనాలు కొని నష్టపోతున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. ఆ ఉత్తరంలోని అంశాలను పరిశీలించిన ధర్మాసనం ప్రభుత్వ కార్యదర్శి, వ్యవసాయరంగ ముఖ్య కార్యదర్శి రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్‌తోపాటు మరికొందరు ఉన్నత అధికారులకు నోటీసులు ఇచ్చింది. వాస్తవానికి నకిలీ, నాసిరకం విత్తనాల సమస్య రానురాను తీవ్రరూపం దాల్చుతున్నది. తలతాకట్టు పెట్టి అప్పోసొప్పో చేసి మొత్తం పెట్టుబడి పెట్టి శ్రమంతా చేసిన తర్వాత చివరి దశకు వచ్చే సమయంలో అవి నాసిరకానివో లేక నకిలీవనో తేలితే అన్నదాత కుప్పకూలి పోతున్నాడు. మళ్లీ పెట్టుబడికి అప్పు తెచ్చే మార్గం లేక, మరో తోవకానరాక అప్పులవాళ్ల ముందు తలవంచుకోలేక ఎందరో అన్నదాతలు బలవన్మరణాలకు గురవుతున్నారు. ఇదేదో ఇప్పటి ప్రభుత్వాలు వచ్చిన తర్వాత మొదలు కాలేదు. గత, రెండు, మూడు దశాబ్దాలుగా జరుగుతూ వస్తోంది.రానురాను పెరుగుతున్నదే తప్ప తగ్గడం లేదు. వ్యవసాయాన్ని ఇంతగా సంక్షోభంలోకి నెడుతున్న ప్రధాన కారణాల్లో ఒకటైన ఈ నకిలీ విత్తనాలను నిర్మూలించేందుకు గత రెండు, మూడు దశాబ్దాలుగా ప్రయత్నాలు జరుగుతున్నా, కేసులు పెడుతున్నా, చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా అవి ఆగడం లేదు. అసలు విత్తన చట్టంలోనే లోపం ఉంది. ఆ చట్టం అన్నదాతల కంటే దళారులకే ప్రయోజనకరంగా ఉందనే ఆరోపణను కొట్టివేయలేం. వాస్తవంగా ఆయా రాష్ట్రాల వ్యవసాయ శాఖా ధికారులు దుకాణాల నుంచి నమూనాలు సేకరించి పరీక్షిస్తే తప్ప విత్తనాల అక్రమ వ్యాపారం బయటపడే అవకాశం లేదు. అవసరం మేరకు ప్రయోగశాలలు లేకపోవడం, అవి నీతి చోటు చేసుకోవడంతో క్షేత్రస్థాయిలో సమస్యలు రైతు లను పీడిస్తున్నాయి. విత్తన నాణ్యత నిర్ధారణ పరీక్షలు మొక్కుబడిగా మారాయి. ఇక క్రిమిసంహారక మందుల గురించి ఎంత తక్కువ చర్చిస్తే అంత మంచిదేమో. నకిలీ ఏదో నాసిరకం ఏదో తెలియని పరిస్థితి. మొన్న మామిడి పంటకు వచ్చిన బంకతెగులు ఎన్ని మందులు, ఎన్నిసార్లు పిచ్చికార్లు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. విత్తన చట్టాన్ని మరింత పటిష్టంచేసి రూపొందించిన ప్రతిపాదనలు దశాబ్దకాలంగా పెండింగ్‌లో పెట్టారు. దాదాపు అటకెక్కించారనే చెప్పొచ్చు. ఇవన్నీ ఒక ఎత్తైతే అన్నిటికంటే ముఖ్యమైనది, మూలమైనది గిట్టుబాటు ధర. వ్యవసాయరంగంలో పెట్టుబడికి అవసరమైన ఎరువులు, క్రిమిసంహారక మందుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి.కేంద్ర పెద్దలు పెంచిన డీజిల్ ధర వ్యవసాయరంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. ఇక కూలీల రేట్లువిపరీతంగా పెరిగిపోయాయి. గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏమేరకు ఎవరికి ఉపయోగపడిందో ఏమో కానీ, వ్యవసాయరంగాన్ని కోలుకోలేకుండా చేస్తున్నది. దీంతో ఎంతో కష్టపడి మరెన్నో వ్యయప్రయాసలకు లోనై సాగు చేసినా ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు అమ్మినా ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదు. సాగు చేస్తే నష్టం వస్తుందనే ఆలోచనతో వ్యవసాయానికే మంగళం పాడిన రైతులు ఎందరోఉన్నారు.కాడి కింద పెడుతున్నారు. రానురాను ఈసంఖ్య పెరిగిపోతుండడం ఆందోళన కలిగించే అంశం. ఈ కనీస మద్దతు ధర ఏప్రాతిపదికపై నిర్ణయిస్తారో, ఖర్చులు ఎలా అంచనా వేస్తారో అన్నదాతలకే కాదు మరెవరికి అర్థంకాని నిగూఢ రహస్యంగా మారిపోయింది. కనీస మద్దతు ధర నిర్ణయించడానికి ఎలాంటి స్థిరమైన గణిత నమూనా లేదని, వ్యవసాయోత్పత్తుల వ్యయాల ధరల కమిషన్‌కు 1998లో భాను ప్రతాప్ సింగ్ కమిటీ అధికారికంగా ప్రకటించింది. పూర్వపరాల్లోకి వెళ్లితే 1967లో దేశంలో ఏర్పడిన ప్రత్యేక పరిస్థితుల ఆధారంగా 'ఝా' కమిటీ సిఫారసు మేరకు వ్యవసాయోత్పత్తుల వ్యయాల ధరల కమిషన్‌ను ఏర్పాటు చేశారు. తర్వాత కాలంలో వ్యవసాయరంగంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా డాక్టర్ సేన్ కమిటీ సూచనల మేరకు 'వ్యవసాయోత్పత్తుల వ్యయాల ధరల కమిషన్'ను సంస్కరించారు. మద్దతు ధరను నిర్ణయించడంలో ఈ కమిషన్‌ది కీలకపాత్ర. ఏది ఏమైనా ఈ విధానం అమలులో ఉన్న లోపాల కారణంగా రైతులకు న్యాయమైన గిట్టుబాటు ధర లభించడం లేదనేది వాస్తవం. అన్నదాతలకు ఇంత అన్యాయం కళ్లముందే జరుగుతుంటే తమది రైతుల ప్రభుత్వమని, తాము అన్నదాతల పక్షపాతం అంటూ, రైతుల కోసం ఏమైనా చేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పుకుంటూ వాచా వాత్సల్యంతో కాలం గడపడం న్యాయం కాదు. •

# ప్రభుత్వ పాఠశాలల భద్రతపై నీలినీడలు

సి.హెచ్. ప్రతాప్

రాజస్థాన్‌లోని ఝులావార్ జిల్లాలో ఇటీవల జరిగిన విషాద ఘటనలో ప్రభుత్వ పాఠశాల భవనం పైకప్పు కూలిపోవడంతో ఏడుగురు అమాయక చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇది ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితమైన సమస్య కాదు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల భద్రతాప్రమాణాల లోపం, నిర్లక్ష్యం,అవినీతి, పర్యవేక్షణలో తలెత్తిన లోపాలు ఈ ప్రమాదం వెనుక ఉన్న అసలు కారణాలు. ప్రభుత్వ పాఠశాలలు దేశంలో లక్షలాది చిన్నారులకు విద్యఅందిస్తున్నాయి. అయితే, భవనాల వయసు, పాడుబడిన నిర్మాణాలు, తగిన మరమ్మత్తుల లేమి, భద్రతా ప్రమాణాలను పాటించకపోవడం వల్ల ప్రతిరోజూ విద్యార్థులు ముప్పులో ఉంటున్నారు. కొన్ని రాష్ట్రాలలో ఆయా విద్యాశాఖలు సుమారుగా మూడు వేలకు పైగా పాఠశాలల దుస్థితిని గుర్తించి వాటి మరమ్మత్తుల కోసం నిధులు కేటాయించినప్పటికీ, ప్రభుత్వ పరంగా వాటి విడుదలలో నెలల తరబడి ఆలస్యం జరుగుతోంది. ఇది పరిపాలనా వైఫల్యం మాత్రమే కాకుండా భవిష్యత్తు తరాల ప్రాణ భద్రత పట్ల ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనం. భద్రత కేవలం భవనాలకే పరిమితం కాదు.కొన్ని పాఠశాలలలో నైట్ వాచ్‌మెన్ లేకపోవడం వల్ల పాఠశాలలు రాత్రివేళల్లో దోపిడీ, ధ్వంసం, అసాంఘిక కార్యకలాపాలకు వేదికవుతున్నాయి. ఇటీవల అమరచింత పట్టణ ప్రభుత్వ పాఠశాలలో తలుపులు, బెంచీలు ధ్వంసం చేయడం, కిటికీలు పగలగొట్టడం, పాఠశాల ఆవరణలో మద్యం తాగి సీసాలు పగలగొట్టడం వంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. కంప్యూటర్లు, టీవీలు, రికార్డులు, ఇతర విలువైన సామాగ్రి ఉన్నందున, పాఠశాలల్లో రాత్రిపూట వాచ్‌మెన్ నియామకం అత్యవసరం. గ్రామీణ,పట్టణ అంచు ప్రాంతాలలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. విద్యుత్, తాగు నీరు, మరుగుదొడ్లు, వికలాంగుల సౌకర్యాలు లేని పాఠశాలలు ఇప్పటికీ ఉన్నాయి. డిజిటల్ యుగంలో కూడా అనేక పాఠశాలల్లో కంప్యూటర్, ఇంటర్నెట్ సదుపాయాలు లేవు. ఇది విద్యా అసమానతను పెంచుతోంది. భవనాల పటిష్టతపై పర్యవేక్షణ వ్యవస్థ సక్రమంగా పనిచేయడం లేదు. వర్షాకాలం ముందు భద్రతా పరీక్షలు తప్పనిసరిగా జరగాలని నిబంధన ఉన్నా, అనేక చోట్ల అవి పత్రాలపైనే పూర్తవుతున్నాయి. టెండర్లలో అవినీతి, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, నిధుల దుర్వినియోగం వంటి అంశాలు సమస్యను మరింత పెంచుతున్నాయి. ఝులావార్ ఘటన అనంతరం మంత్రి మదన్ దిలావర్ చేసిన వ్యాఖ్యలు పాలక వర్గం బాధ్యతారాహిత్యానికి ఉదాహరణగా నిలిచాయి. ఇటువంటి వ్యాఖ్యలు బాధిత కుటుంబాల వేదనను పెంచడమే తప్ప, సమస్య పరిష్కారానికి దోహదం చేయవు. విద్యా భద్రతలో బాధ్యత స్పష్టంగా నిర్ణయించబడాలి. ప్రైవేట్/అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థుల రక్షణ బాధ్యత యాజమాన్యం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులపై ఉంటుంది.ప్రభుత్వ/ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుడు, ఇన్‌ఛార్జి, ఉపాధ్యాయులు, విద్యా సిబ్బంది బాధ్యత వహించాలి. పరిష్కారం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి. నూతనవిద్యా విధానం, సమగ్ర శిక్షా, పీఎంశ్రీ స్కూళ్ల వంటి పథకాలను కేవలం ప్రచారపూరితంగా కాకుండా, కఠిన పర్యవేక్షణతో అమలు చేయాలి. నిధుల విడుదల వేగవంతం చేయాలి. ప్రజా పర్యవేక్షణను తప్పనిసరి చేయాలి. ప్రతి సంవత్సరం పాఠశాల భవనాల భద్రతా సర్టిఫికెట్‌ను పునరుద్ధరించాలి. ఝులావార్ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన చిన్నారులకు నిజమైన నివాళి భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవడమే అవుతుంది. భద్రత, నాణ్యమైన విద్య అందించడం పిల్లల ప్రాథమిక హక్కు. •

# మానవ హక్కులపై అగ్రరాజ్యం ద్వంద్వనీతి

మహమ్మద్ ఆరిఫ్

తనను తాను అగ్రరాజ్యంగా చెప్పుకుంటూ.. ప్రపంచ దేశాలకు పెద్దన్నలా వ్యవహరిస్తున్నానని భావిస్తున్న అమెరికా రష్యా,ఉక్రెయిన్, ఇజ్రాయెల్, గాజా యుద్ధాల పట్ల ద్వందనీతిని ప్రదర్శిస్తున్నది. ఉక్రెయిన్ పై రష్యా దాడికి పరోక్ష సహకారం అందిస్తున్నారనే ఆరోపిస్తూ ట్రంప్ ఇప్పటికే భారత్‌పై 25శాతం సుంకాలు విధించారు. అయినా ఇండియా వెనకడుగు వేయకపోవడంతో తాజాగా మరో 25 శాతం సుంకాలను పెంచుతున్నట్లు ప్రకటించారు.అంటే భారత దిగుమతులపై అమెరికాలో 50 శాతం సుంకాలు అమలవుతాయన్న మాట. అంతేకాకుండా రష్యాకు సహకరించే చైనాతోపాటు ఇతర దేశాలపైనా చర్యలుంటాయని ట్రంప్ పేర్కొన్నారు. అయితే రష్యా, ఉక్రెయిన్ యుద్ధంలో సామాన్య పౌరుల మరణాల గురించి ప్రస్తావిస్తున్న అమెరికన్ ప్రెసిడెంట్‌కు ఇజ్రాయెల్, గాజా యుద్ధంలో మరణిస్తున్న చిన్నారులు, మహిళలు, వృద్ధుల మృత్యుఘోష వినిపించడం లేదా? ఆకలితో అలమటిస్తూ పోషకాల లోపంతో మరణిస్తున్న చిన్నారుల ఆర్తనాదాలు చెవికెక్కడం లేదా? స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాస్వామ్యం, మానవ హక్కులు అంటూ ప్రపంచానికి ప్రవచనాలు బోధించే అమెరికా రెండు ప్రధాన యుద్ధాల పట్ల ద్వందనీతిని ప్రదర్శిస్తున్నది. అగ్రరాజ్యం మాటలు, చేతల మధ్య స్పష్టమైన వైరుధ్యం కనిపిస్తున్నది. దీంతో అగ్రరాజ్యం నైతికతలో రాజకీయ ప్రయోజనాలే ప్రధానమని స్పష్టంగా అర్థమవుతున్నది. నాటోలో సభ్యత్వం కోసం ఉక్రెయిన్ పావులు కదుపుతున్నదని తెలియగానే 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్ పై రష్యా దాడులు ప్రారంభించింది. అయినా 2022లో ఉక్రెయిన్ నాటోలో సభ్యత్వం కోసం దరఖాస్తు చేయగా దాడులను మరింత ముమ్మరం చేసింది. ఉక్రెయిన్‌కు నాటోలో సభ్యత్వమిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని అగ్రరాజ్యాన్ని సైతం హెచ్చరించింది. అయితే సభ్యత్వం ఇవ్వాలా? వద్దా? అనేదానిపై నాటో దేశాలు ఇప్పటికీ తమ నిర్ణయాన్ని ప్రకటించకపోయినా రష్యా దాడులను అవి ఖండించాయి. రష్యా చర్యలను అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనగా, ఐరోపా భద్రతకు ముప్పుగా అభివర్ణించాయి. రష్యా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేలా చమురు, గ్యాస్, వాణిజ్యం, ఆర్థిక లావాదేవీలపై ఆంక్షలు విధించాయి. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకోవద్దని ఇతర దేశాలపై ఒత్తిడి తెస్తున్నాయి. అంతేకాకుండా అమెరికాతోపాటు జర్మనీ, బ్రిటన్, నార్వే, డెన్మార్క్, స్వీడన్, నెదర్లాండ్స్, పోలాండ్,లిథువేనియా వంటి యూరోపియన్ దేశాలు ఉక్రెయిన్‌కు యుద్ధ ట్యాంకులు, యాంటీ ట్యాంక్ క్షిపణులు డ్రోన్లు, ఇతర ఆయుధాలు సరఫరా



చేయడమే కాకుండా ఆర్థిక సహకారమందిస్తున్నాయి. మరోవైపు రష్యా ఆస్పత్రులు, పాఠశాలలపైనా దాడులు చేస్తున్నదని గగ్గోలు పెడుతున్నాయి. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన ఏడాదిన్నర తర్వాత అంటే 2023 అక్టోబర్‌లో ఇజ్రాయెల్ గాజా యుద్ధం ప్రారంభమైంది. అయితే ఇక్కడ ఇజ్రాయెల్ అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నది. పాఠశాలలు, ఆస్పత్రులు, సామాన్య పౌరులు నివసించే ఇండ్లు అనే తేడా లేకుండా బాంబుల వర్షం కురిపిస్తున్నది. చిన్నారులు, మహిళలు, వృద్ధులను సైతం బలితీసుకుంటున్నది. మానవతా సహాయం అందకుండా అడ్డుగోడగా నిలిచి ఆకలి మరణాలకు కారణమవుతున్నది. కానీ ఇవేమీ అగ్రరాజ్యం అమెరికాకు కనిపించడం లేదు. అయితే గాజాపై దాడులను కనీసం ఖండించని అమెరికా మరోవైపు ఇజ్రాయెల్‌కు బిలియన్ డాలర్ల ఆయుధాలను సరఫరా చేస్తున్నది. యుద్ధ నేరాల విషయంలో రష్యా పట్ల కఠినంగా వ్యవహరించిన అమెరికా ఇజ్రాయెల్ విషయంలో మాత్రం ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో వచ్చిన తీర్మానాలను వీటో చేసింది. ఇజ్రాయెల్ యథేచ్ఛగా అనేక ఉల్లంఘనలకు పాల్పడుతున్నా ఎటువంటి ఆంక్షలు విధించలేదు. కనీసం విమర్శించలేదు. గాజాతో పోల్చుకుంటే ఉక్రెయిన్‌లో మరణాల శాతం చాలా తక్కువ. 2023 అక్టోబర్ నుంచి గాజాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల్లో సుమారు 6080 వేల మంది వరకు మరణించారని గాజా ఆరోగ్యమంత్రిత్వ శాఖ, నేచర్ నివేదికల ద్వారా స్పష్టమవుతున్నది. ఇందులో సుమారు 18వేల మంది చిన్నారులు ఉండగా, 15వేల కంటే ఎక్కువ మంది మహిళలు ఉన్నారు. రెండు వేల మంది వరకు వృద్ధులు ఉన్నట్టు అంచనా. 19 లక్షల మంది నిర్వాసితులయ్యారు. గాజాలో మరణించిన వారిలో 59.1 శాతం మహిళలు, చిన్నారులు, వృద్ధులు ఉన్నారని లాన్సెట్ ఒక నివేదికలో స్పష్టంచేసింది. ఇప్పటికే వందలాది మంది ఆకలితో మరణించినట్టు పలు రిపోర్టుల ద్వారా తెలుస్తున్నది. ఇందులోనూ 80 శాతం మంది చిన్నారులుండడం మనసులను కలచివేస్తున్నది. అదే ఉక్రెయిన్‌లో పౌరమరణాలు 11 వేలవరకు మాత్రమే ఉంటాయని ఒక అంచనా. అంటే గాజాతో పోల్చుకుంటే ఉక్రెయిన్‌లో మరణాల శాతం చాలా తక్కువ. ఇలాంటి నీతి ప్రపంచానికి ఎప్పటికైనా ముప్పే. మానవ హక్కుల విషయంలో రష్యాను పదేపదే విమర్శిస్తున్న అమెరికా.. ఇదే ఇజ్రాయెల్ విషయంలో మాత్రం మౌనంగా ఉండడం అగ్రరాజ్యం ద్వందనీతికి నిదర్శనంగా నిలుస్తున్నది. అంటే మానవ హక్కులు అనేది రాజకీయ ప్రయోజనాలు సాధించేందుకు ఒక ఆయుధంలా మాత్రమే పని కొస్తున్నాయనేది స్పష్టమవుతున్నది. ఇప్పటికే బ్రెజిల్‌తో పాటు మరికొన్ని దేశాలు అమెరికా ద్వంద్వ వైఖరిని విమర్శించాయి. అగ్రరాజ్యం వహిస్తున్న ఈ ద్వంద వైఖరి అంతర్జాతీయ న్యాయ వ్యవస్థ, నైతికతపై తీవ్ర సందేహాలను రేకెత్తిస్తున్నది. ఇది ప్రపంచ శాంతి,స్థిరత్వానికి ఎప్పటికైనా ముప్పే. అంతర్జాతీయ చట్టాలు, మానవ హక్కులపట్ల అందరికీ సమానమైన విధానం అవలంభించడంద్వారా మాత్రమే అమెరికా అంతర్జాతీయంగా తన విశ్వసనీయతను నిరూపించుకోగలదు. •

# ప్రజావాక్కు



### శునకాలపై సుప్రీం తీర్పు సమంజసమే

**పట్టణాలు,** పల్లెల్లో గ్రామ సింహాలు హల్చల్ చేస్తూ చిన్నాపెద్దా అనకుండా అందరినీ వెంబడిస్తూ మూగజీవుల్నే కాక చిన్నపిల్లలను కూడా కుక్కలు చింపిన విస్తర్లలా చీరేస్తూ చంపుకు తింటూ,భయభ్రాంతులకు గురి చేస్తున్న విషయం ప్రతిదినం మాధ్యమికాలద్వారా, ప్రత్యక్షంగాను మనం గమనిస్తూనే ఉన్నాం.భారతఉన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు శునకాల గురించి ఇచ్చిన తీర్పు అందరికీ ఆమోదయోగ్యమే.కాని జంతు ప్రేమికుల పేరుతో రోడ్డుల మీదకు వచ్చి ర్యాలీలు చేస్తున్న వారికిమాత్రం వీధుల్లో అనుభవిస్తున్న ప్రత్యక్షనరకం కనబడలేదా? వారికే కాదు తీర్పునిచ్చిన ఉన్నత న్యాయాధిపతులకు కూడా పెంపుడు జాగిలాలు ఉంటాయి.వారెలా? దేశంలో ప్రతిచోటా శునక సంరక్షణా కేంద్రాలనేర్పాటు చేసుకొని గ్రామసింహాల గోల నుంచి ప్రజలకు ఇతర ప్రాణులకు రక్షణ కల్పించాలి.

- డా.దన్నాన అప్పలనాయుడు, చీపురుపల్లి

### తెలుగు, హిందీపై వివక్షత

**తెలంగాణ** రాష్ట్రంలో ఉన్న ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనారిటీ గురుకులాలలో 5వ తరగతి నుండి10 వ తరగతి వరకు హిందీ తెలుగు భాషలపై విద్యార్థులకు చాలా అన్యాయం జరుగుతుంది. తెలుగు, హిందీ టీచర్స్ బోధించడం లేదు. వారు సమయపాలన పాటించడం లేదు. గ్రామర్ ఒత్తులు దీర్ఘాలు వంటి భాష నైపుణ్యాలను నేర్పించడం లేదు. ఆలస్యంగా గురుకులాలకు రావడం సంతకాలుపెట్టుకునివెంటనే ఇంటికి పోవడం జరుగుతుంది. ఈ విధానం వలన విద్యార్థులకు హిందీ, తెలుగు నాణ్యమైన బోధన అందడం లేదు.

- రాపాక. రవీందర్, జనగాం

### కల్తీలకు అడ్డుకట్ట వేయాలి

ప్రస్తుతం మార్కెట్‌లో దొరుకుతున్న నిత్యావసర వస్తువుల ఆహార పదార్థాల కల్తీ, నకిలీ సరుకులకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలి. ముఖ్యంగా ఆహారపదార్థాలు కృత్రిమంగా తయారు చేయడం జరుగుతుండడంవిచారకరం. ప్లాస్టిక్ బియ్యం, ప్లాస్టిక్ గుడ్లు ,కృత్రిమ మాంసం, నల్ల బియ్యం తదితర కృత్రిమ నిత్యావసర ఆహార పదార్థాల కల్తీలకు అడ్డుకట్ట వేయాలి. లేదంటే ప్రజల ఆరోగ్యంపై వీటి ప్రభావం పడుతుంది. కల్తీతో కూడిన పదార్థాలు ప్రజల ఆరోగ్యం పై దుష్ప్రభావం చూపుతుంది.

- డి. చాంద్ బాషా, కర్నూలు

### ఎన్నికలపై నమ్మకమే ప్రజాస్వామ్యానికి ప్రాణం

బీహారులో ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా సవరణలు స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూలో ఓటుచోరీ జరుగుతోందని,దాన్ని సరిదిద్దాలని కోరుతూ మూడు వందల మంది ప్రతిపక్ష ఎంపీలు ఢిల్లీలో నిరసన ర్యాలీ చెయ్యడం ప్రాముఖ్యత కలిగిన వార్త.వారిని ఎన్నికల కమిషన్ తమను కలిసేందుకు అనుమతినిస్తే సరిపోయేది..సబబుగా ఉండేది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గత కొంత కాలంగా, బీహారు అంశమే కాకుండా,గత సార్వత్రికఎన్నికల్లో అక్రమాలు జరిగినట్లు కొన్ని ఆధారాలతో బలంగా చెప్తున్నారు. కర్ణాటకలో ఒక పార్లమెంటు నియోజక వర్గంలో లక్ష ఓట్లకు పైగా మతలబు జరిగినట్లు, అలాంటి ఉదంతాలు దేశ వ్యాప్తంగా ఉన్నట్లు, తద్వారా అధికార పక్షానికి మేలు జరిగినట్లు తీవ్ర ఆరోపణలు చేశారు. ఆరోపణల తీవ్రత దృష్ట్యా ఎన్నికల కమిషన్ సందేహ నివృత్తి చేయాల్సింది.సరైన రుజువులతో ఆయన వాదన నిపూర్వపక్షం చేసి ఉంటే అది దేశ ప్రజలకు మంచి సందేశం ఇచ్చినట్లు ఉండేది.పైగా అలా చెయ్యడం దాని బాధ్యత కూడా.

-డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### ఆలోచించి వేతనాలివ్వండి

**అనేక** పరీక్షలు వ్రాసి కఠినమైన అలజడిని వత్తిడిని తట్టుకొని పిల్లలతోట్రాన్స్‌ఫర్లు ఎదుర్కొని దీర్ఘకాల సర్వీస్‌చేసి రిటైర్ అయ్యేటువంటి వారికి వారు జీవితాంతం చేసిన సేవల గుర్తింపుకు పెన్షన్‌లు ఇవ్వడం ఒక మహాసహాయం.అంతేగాని పార్టీ నుంచి పార్టీలు మారి 5 సంవత్సరాలు కూడాసొంత ప్రయోజనాలకే సమయం కేటాయించి కోట్ల ఆస్తులు పెంచుకోనే ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు జీతాలు వరకూ బానేవుంది.ఎంత సర్వీస్ చేశారని అంతపెద్ద పెన్షన్లు సార్. ప్రభుత్వం కొంచెం ఆలోచించాలి.

-గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

### ఉపాధి హామీ కల్పించాలి

**తెలంగాణలో** పెరిగిన నీటి వసతులు భూమి అభివృద్ధి కార్యక్రమాలను ఉపాధి హామీ కింద చేసేందుకు హామీ ఇస్తున్నాయి. ఒకప్పుడు మురికి తుమ్మలు మొలిచిన నెలలు నేడు సాగు యోగ్యంగా మారడానికి ఉపాధి హామీ హామీ పడుతుంది. చిన్నచిన్న గూడెంలలో కూడా ఎక్కువలో ఎక్కువగా 10 నుండి 15ఎకరాలలో మాత్రమే పాడుబడ్డ భూములున్నాయి. అంటే మెరుగు పడిన పరిస్థితికి నిదర్శనం.

-భారత అవినాష్, జనగామ

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# విజయవాడ వార్త

## విద్యార్థులకు స్వాతంత్ర సమరయోధుల త్యాగాల గురించి అవగాహన కల్పించాలి : కమీషనర్ ధ్యానచంద్ర

విజయవాడ కార్పొరేషన్, ఆగస్టు 15,ప్రభాతవార్త: స్వాతంత్ర్య సమరయోధుల త్యాగఫలమే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలని, విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాల గురించి అవగాహన కల్పించడం ఎంతో అవసరమని మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి,కమిషనర్ ధ్యానచంద్రలు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మేయర్ భాగ్యలక్ష్మి జాతీయ జెండాను ఆవిష్కరించి జెండా వందనం గావించారు. కమిషనర్ ధ్యానచంద్ర నగరపాలక సంస్థ జెండాను



ఆవిష్కరించారు. ఎన్సీసి,ఆర్.ఎస్.ఎస్ వింగ్ విద్యార్థులు నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి,కమిషనర్ ధ్యానచంద్రలకు గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ జాతీయ స్థాయిలో కేవలం నాలుగు నగరాలకే స్వచ్ఛ్ అవార్డు దక్కిందని అందులో విజయవాడ కూడా ఉండటం గొప్ప విషయమని,అందుకు కారకులైన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కేవలం,ప్రజలు,కార్పొరేషన్ సిబ్బంది సహకారంతోనే నగరాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. దానికి నిదర్శనం స్వచ్ఛ సర్వేక్షన్‌లో వస్తున్న ర్యాంకులని, కేంద్రంలో జాతీయ స్థాయిలో రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకోవడం ఇది రెండవసారని,ప్రధాని నరేంద్ర మోడీ,సిఎం చంద్రబాబునాయుడు,మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ సహాయ సహకారాలతో నగరపాలక సంస్థ అభివృద్ధి పథంలో నడుస్తోందని,నగరానికి వచ్చిన సూపర్ స్వచ్ఛ్ లీగ్ అవార్డు ఎంతో గర్వించదగ్గ విషయమని,విజయవాడ నగరం దినదినాభివృద్ధి జరుగుతున్నారు. అనంతరం విభిన్న శాఖల్లో ప్రతిభ కనబర్చిన ప్రభుత్వాధికారులకు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమీషనర్ (ప్రాజెక్ట్స్)డాక్టర్ డి.చంద్రశేఖర్,చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు,చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్‌రత్నకుమార్,చీఫ్ ఇంజనీర్ శ్రీనాథ్‌రెడ్డి,డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్,జాయింట్ డైరెక్టర్ అమృత్ డాక్టర్ లత,ఎకౌంట్స్ ఆఫీసర్ బి.సత్యన్నారాయణమూర్తి,వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖర్‌రెడ్డి,బయాలజీ కామేశ్వరరావు,ఎగ్జిక్యూటివ్ ఇం.జనీర్లు చంద్రశేఖర్,సురేఖ,మేనేజర్ ప్రభావతి,కార్పొరేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య సమరయోధులను స్ఫూర్తిగా తీసుకుని దేశ సేవకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి : సిపి రాజశేఖరబాబు

విజయవాడ క్రైం,ఆగస్టు 15,ప్రభాతవార్త: ఎందరో త్యాగమూర్తుల త్యాగ ఫలితమే ఈ స్వాతంత్ర్యమని,వారి త్యాగాలను మన భారతీయులందరం ప్రస్తుతం అనుభవిస్తున్నామని, ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులను గుర్తు చేసుకుంటూ,వారిని స్ఫూర్తిగా తీసుకుని ఎల్లవేళలా దేశ సేవకు,ప్రజా సేవకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సిపి రాజశేఖరబాబు పేర్కొన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సిపి రాజశేఖరబాబు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా అధికారులకు,సిబ్బందికి ఆయన మిఠాయిలను పంపిణీ చేశారు.



కమీషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు,సిబ్బందికి 79వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిసిపిలు కెజివి సరిత,కె.తిరుమలేశ్వర్‌రెడ్డి,ఏడిసిపి ఎస్ ఉదయరాణి,ఎవిఎడి ప్రసాద్,ఎడిసిపిలు, ఏసిపిలు,పోలీసు అధికారులు,సిఐలు,ఎస్ఐలు,సిబ్బంది,పోలీసు కమిషనరేట్ కార్యాలయ పరిపాలనా విభాగంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పైలెట్ సర్వీస్ స్టేషన్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

విజయవాడ,ఆగస్టు 15,ప్రభాతవార్త: బందరు రోడ్డు లోని,ఇండియన్ ఆయిల్ వారి పైలెట్ సర్వీస్ స్టేషన్,పెట్రోల్ బంకులో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు మేనేజర్ వెంకటప్పయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ ఆయిల్ చీఫ్ డివిజనల్ రిటైల్ హెడ్ ఎవి అనిల్‌కుమార్ జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వినియోగదారులకు,సిబ్బందికి ఉద్దేశించి,నాటి త్యాగమూర్తుల ఫలితమే ఈ రోజున మనం జెండా వందనం నిర్వహించుకోవడమన్నారు.సీనియర్ మేనేజర్ ఎయస్ఆర్ శేఖర్,ఎన్‌టిఆర్ జిల్లా సేల్స్ అధికారులు



డి.నరేష్‌కుమార్ ఇండియన్ ఆయిల్ తరపున శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పెట్రోల్ బంకు యజమాని యంవివి సత్యనారాయణ,నందకిషోర్,మేనేజర్ వెంకటప్పయ్యలు వినియోగదారులకు జాతీయ పతాక చిహ్నలు,మిఠాయిలను పంపిణీ చేసారు.ఫొటో రైటప్ – అమరావతి–1 : జాతీయ జెండా ఎగురవేస్తున్న దృశ్యం, రాష్ట్రమంత్రి నాదెండ్ల మనోహర్ బాబా స్ఫూర్తి

## జంపని ఎఎంటికె దర్బార్‌లో ఘనంగా స్వాతంత్ర వేడుకలు

అమరావతి, ఆగస్టు 15, ప్రభాతవార్త : గుంటూరు జిల్లా వేమూరు నియోజకవర్గం జంపని ఎఎంటికె దర్బార్ పీఠాధిపతి అతా ముహమ్మద్ నిజాముద్దీన్ నిజామీ షాతాజ్ ఖాదరీ (అతా నిజాంబాబా) ఆధ్వర్యంలో భారత స్వాతంత్ర దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా



అతా నిజాంబాబా కులమత వర్గ విచక్షణ లేకుండా దర్బార్‌కు వచ్చే భక్తులకు ప్రతిరోజు లంగర్ షరీఫ్ (అన్నదానం) నిర్వహించడం మహా పుణ్యకార్యమని అన్ని దానాల్లో కంటే అన్నదానం మిన్న అనే నానుడిని ఈ సందర్భంగా మంత్రి మనోహర్ ప్రస్తావించారు. అలాగే ఇంకా ఇతర ఆధ్యాత్మిక ధార్మిక సేవా కార్యక్రమాల పట్ల మంత్రి మనోహర్ అతా నిజాంబాబాను అభినందించారు. అన్నదానం సామాజిక ధార్మి సేవా కార్యక్రమాలు నిర్వహించడం వెనుక పీరోముర్షిద్, చీమలపాడు బాబా హజరత్ ముహమ్మద్ అతావుల్లా షరీఫ్ షాతాజ్ ఖాదరీ బాబా వారి దివ్య ఆశీస్సులు వారి పాదపద్మాల దయతో అలుపెరుగని అన్నదాత నఖీబుల్ ఔలియా బొగ్దాది బాబా వారి ఆజ్ఞ మేరకు ఈ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని ఈ సేవా కార్యక్రమాలు తనకు అతావుల్లా బాబా స్ఫూర్తి దాత అని అతా నిజాంబాబా పేర్కొన్నారు.

## స్కోడా ఆటో ఇండియా నుండి నూతన ఎడిషన్లు

విజయవాడ, ఆగస్టు 15, ప్రభాతవార్త : తమ 25వ వార్షికోత్సవం సందర్భంగా భారత వినియోగదారుల ఆదరణ పొందిన కుశఖ్, స్లావియా, కైలాఖ్ ల పరిమిత ఎడిషన్లను అందిస్తున్నట్లు స్కోడా ఆటో ఇండియా ప్రతినిధులు తెలిపారు. ఇప్పటికే వున్న హై స్పెసిఫికేషన్ల ఆధారంగా ఈ పరిమిత ఎడిషన్లు తయారయ్యాయన్నారు.

## మండలంలో త్రివర్ణ పతాకాల రెపరెపలు

ఎ కొండూరు, ఆగస్టు 15, ప్రభాతవార్త : భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఎ కొండూరు మండలంలో ప్రజలు వివిధ శాఖల ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రయివేట్ సెక్టార్లలో ప్రజా ప్రతినిధులు అధికారులు అనధికారులు శుక్రవారం ఘనంగా జరిపారు. మండల తహాశీల్దారు కార్యాలయం వద్ద డిప్యూటి తహాశీల్దార్ యు.రాజ్‌కుమార్, ఎంపిడివో కార్యాలయం వద్ద ఎంపిపి కాలసాని నాగలక్ష్మి, పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్సై చల్లా కృష్ణ ఎ కొండూరు టి.డబ్లు ఆశ్రమ ఉన్నత పాఠశాల వద్ద ఎస్ఎంసి



చైర్మన్ బాలాజి, హెచ్ఎం జి కవిత, చీమలపాడు పిఎసిఎస్ వద్ద చైర్‌పర్సన్ బెజవాడ శంకర్ కంభంపాడులో సోషల్ వెల్ఫేర్ స్పెషల్ హాస్టల్లో హెచ్‌డబ్లువో సిహెచ్ మల్లయ్య, చీమలపాడు హైస్కూలు వద్ద ఎస్ఎంసి చైర్మన్ ఎస్‌కె నాగుల్ మీరా ఎఎంటికె దర్బార్ పీఠాధిపతి మొహమ్మద్, ఖాజా మొహియుద్దీన్, హెచ్ఎం హైమేశ్వరరావు, ఈ.జయరామ్, రామచంద్రాపురం హైస్కూలు వద్ద టిడిపి మండల మాజీ ప్రెసిడెంట్ గడ్డి కృష్ణారెడ్డి పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. గడ్డి కృష్ణారెడ్డి విద్యార్థిని విద్యార్థులకు పెన్నులు స్వీటు హాట్ పంపిణీ చేశారు.

## అభివృద్ధి ప్రణాళికపై గ్రామసభ.. సెక్రటరీ కృష్ణారెడ్డి

ఎ కొండూరు, ఆగష్టు 15, ప్రభాతవార్త :ఎ కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామ సచివాలయం వద్ద సెక్రటరీ అవులూరి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, ఇంకా ఇతర సమస్యలపై గ్రామ సభ నిర్వహించి చర్చించారు. ఈ గ్రామ సభలో ముఖ్యంగా అభివృద్ధి ప్రణాళిక ప్రధాన మంత్రి సూర్యఘర్ సౌర విద్యుత్ ఏర్పాటు గ్రామంలో కుక్కల నిర్మూలనకు ఆపరేషన్ నిర్వహించటం తదితర అంశాలపై ఈ గ్రామ సబలో సెక్రటరీ కృష్ణారెడడ్డి చర్చించారు. ఇంకా ఈ కార్యక్రమంలో మండల టిడిపి మాజీ అధ్యక్షుడు సీనియర్ నాయకుడు గడ్డి కృష్ణారెడ్డి, ఒంటేరు రామారావు, పిచ్చేశ్వరరావు, మండల టిడిపి ఉపాధ్యక్షుడువేములకొండ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞానదృష్టి ద్వారా కలిగే స్వాతంత్ర్యం నేటి భారతానికి అవశ్యం

### : డాక్టర్ అబ్దుల్‌కలాం అంతర్జాతీయ పురస్కార గ్రహీత గెంటేల వెంకటరమణ

జగ్గయ్యపేట, ఆగస్టు 15, ప్రభాతవార్త : భౌతిక జీవనంలో అవసరమైన స్వాతంత్ర్యం, జ్ఞానదృష్టి కలిగిన వారి ద్వారా కలిగే స్వాతంత్ర్యం జీవుడి ఉద్ధరణకు అవశ్యమైనదని, దేశభక్తి, దైవభక్తి కలిగి ఉండటమే నిజమైన స్వాతంత్ర్యమని ప్రముఖ తాత్వికులు, డాక్టర్ అబ్దుల్‌కలాం అంతర్జాతీయ పురస్కార గ్రహీత గెంటేల వెంకటరమణ అన్నారు. జగ్గయ్యపేట మండలం బలుసుపాడు శ్రీగురుధామ్‌లో శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా



పాల్గొన్న శ్రీగురుధామ్ వ్యవస్థాపకులు, ప్రముఖ తాత్వికులు గెంటేల వెంకటరమణ–వసంతలక్ష్మి గురు దంపతులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. శ్రీశివానందగురు ఎడ్యుకేషనల్, కల్చరల్ ట్రస్టు ఏర్పాటుచేసిన ఈకార్యక్రమంలో వెంకటరమణ మాట్లాడుతూ స్వచ్ఛమైన మనసుతో కదలటమే స్వాతంత్ర్యమని, కలుషిత మనసుతో ప్రవర్తించటం స్వాతంత్ర్యం కాదన్నారు. మనసుకు పవిత్రత ఉంటేనే ఉత్తమమైన భారతీయ వర్ధిల్లుతుందన్నారు. అసూయ ద్వేషాలు లేకుండా ఉండాలని పవిత్రమైన హృదయం పురుషార్థత అని పెద్దలు చెపుతారన్నారు. నేడు ఎదుర్కొంటున్న సమస్యలకు కారణం దేశభక్తి లేకపోవటమేనన్నారు. కుటుంబం, సమాజం, దేశం పట్ల బాధ్యత లేకుంటే అది ఏవిధంగా స్వాతంత్ర్యం అవుతుందన్నారు. హక్కును వాడుకోవటం స్వేచ్ఛకాదని, పూర్ణ ఆనందాన్ని–సత్యాన్ని తెలుసుకోగలగటమే దేశభక్తి అవుతుందన్నారు. కాగా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పలు ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## సంపూర్ణ రజిత శ్రీమహాలక్ష్మి అమ్మవారు



జగ్గయ్యపేట, ఆగస్టు 15, ప్రభాతవార్త : శావణమాసం నాల్గవ శుక్రవారం సందర్భంగా పట్టణంలోని అద్దాలబజార్‌లో వేంచేసివున్న సంపూర్ణ రజిత శ్రీమహాలక్ష్మి అమ్మవారు గాజుల అలంకరణతో దర్శనమిచ్చారు. కోట మైసమ్మగా పూర్వకాలంలో భక్తుల ఆరాధనలు అందుకున్న అమ్మవారు బలులకు దూరంగా శాంతిని, సంపదను అందించే శ్రీమహాలక్ష్మిగా అవతరించి నిత్య కైంకర్యాలతో పూజాది అభిషేక అర్చనలతో అలరారుతున్నారు. అమ్మవారిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటి ఆధ్వర్యంలో మహిళా భక్తులు కుంకుమార్చనలు నిర్వహించారు.

## సమాజస్ఫూర్తిని రగిలించిన దాల్మియా సిమెంట్స్

విజయవాడ, ఆగష్టు 15, ప్రభాతవార్త : స్వాతంత్ర్య దినోత్సవ వేళ కర్నూలు క్యాన్సర్ అవగాహన మారథాన్, మొక్కల పంపిణీ నిర్వహించి సమాజస్ఫూర్తిని దాల్మియా సిమెంట్స్ రగిలించింది. నాగార్జున విద్యానిలయంలో 3000 మొక్కలు నాటారు. ప్రజలకు 1950 మొక్కలు పంచారు. కార్యక్రమంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, పాఠశాల అధికారులు, కమ్యూనిటీ సభ్యులు, దాల్మియా సిమెంట్ ప్రతినిధులు పాల్గొన్నారు.




## నగర పంచాయతీలో 79వ స్వాతంత్ర్య ఘన వేడుకలు

తిరువూరు, ఆగష్టు 15, ప్రభాతవార్త :ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నగర పంచాయతీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ కె.నిర్మల అధ్యక్షతన మున్సిపల్ కమీషనర్ కె.మనోజ చేతుల మీదుగా 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన భారతీయ జనతా పార్టీ ఉపాధ్యక్షురాలు పోలె శాంతి మాట్లాడుతూ ఎందరో మహానుబావుల



ప్రాణాల త్యాగఫలం భారత స్వాతంత్ర్యమును ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకుని స్వేచ్ఛగా మెలిగితే భారతదేశం ప్రగతి పథంలో నడుస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు అబ్దుల్ హుస్సేన్, శేఖర్‌బాబు, కాకర్లమూడి సుందర్‌కుమార్, మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత బస్సులు ప్రారంభ వేడుకలు

తిరువూరు, ఆగష్టు 15, ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అతి ప్రతిష్టాత్మకంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం ప్రారంభించిన సందర్భంగా శుక్రవారం తిరువూరులో మహిళలకు ఉచిత



ప్రయాణ బస్సులను శుక్రవారం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్, ఆర్డీవో మాధురి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ నిర్మల ప్రారంభించారు.

## జగ్గయ్యపేటలో స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రారంభం

జగ్గయ్యపేట, ఆగస్టు 15, ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకంను జగ్గయ్యపేట పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం ప్రారంభించారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం ఈ స్త్రీశక్తి పథకం ద్వారా మహిళ రవాణా సౌలభ్యమే కాకుండా వారి ఆర్థిక, సామాజికస్థితి మెరుగు పర్చడానికి దోహదపడుతోందని



కెడిసిసి బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. కాగా కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి తులసి వెంకటకృష్ణారావు, మాజీచైర్మన్ శ్రీరాం సుబ్బారావు, మహిళా నేతలు ఆచంట సునీత, కన్నెబోయిన రామలక్ష్మి, కౌన్సిలర్లు, ఐకెపి సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎందరో మహానుభావుల త్యాగఫలం స్వాతంత్ర్యం : పలువురు నేతల ఉద్బోధ

### ఆంధ్రా-తెలంగాణా సరిహద్దులో 150 అడుగుల ఎత్తున రెపరెపలాడిన త్రివర్ణ పతాకం

జగ్గయ్యపేట, ఆగస్టు 15, ప్రభాతవార్త : సుధీర్ఘ కాలం బ్రిటీష్ వారితో పోరాడి, మానప్రాణాలు ఆస్థులు త్యాగంచేసిన మన పూర్వీకుల కారణంగానే నేడు మనం పూర్తి స్వాతంత్ర్యంతో స్వేచ్ఛగా జీవించగలుగుతున్నామని, మహాత్ముల త్యాగ నిరతి నేటి యువతరానికి శిరోధార్యం కావాలని పలువురు నేతలు శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఉద్బోధించారు. ఆంధ్రప్రదేశ్–తెలంగాణా రాష్ట్రాలకు సరిహద్దు పట్టణంగా రెండు వేల సంవత్సరాల చరిత్రకు సాక్షీభూతంగా భాసిస్తున్న జగ్గయ్యపేట శివార్లలో విష్ణుప్రియనగర్ వద్ద ప్రకృతి రమణీయత నడుమ



150 అడుగుల ఎత్తున త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. జాతీయత, సమగ్రత, సార్వభౌమత్వం, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు చిహ్నంగా మువ్వన్నెల భారత జాతీయ పతాకం గగన వీధుల్లో జేజ్జేమానంగా దర్శనమిస్తూ పౌరుల హృదయాలను రంజింపజేస్తోంది.

ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణశివారులోని విష్ణుప్రియ నగర్‌లో రెండేండ్ల క్రితం నాటి ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రల ఆధ్వర్యంలో తిరంగా పార్కు ప్రాంగణంలో 150 అడుగుల ఎత్తులో ఏర్పాటుచేసిన జాతీయ పతాకాన్ని రాష్ట్ర గవర్నర్ ఆవిష్కరించిన విషయం విదితమే. స్థానిక ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారీ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పలు రంగాల్లో విధులు నిర్వర్తించి విశ్రాంతజీవితం గడుపుతున్న వారిని గౌరవిస్తూ మున్సిపాల్టీ ద్వారా మున్సిపల్ కమిషనర్ డి తులసి వెంకట కృష్ణారావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కాగా మాజీ ఎంఎల్ఏ, జనసేన జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను పలుచోట్ల జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొని జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. జాతీయ పతాకాన్ని చేతపట్టి పురవీధుల్లో జనసైనికులతో బైక్ ర్యాలీ నిర్వహించారు. అలాగే మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైఎస్ఆర్‌సీపి ఇన్‌ఛార్జి తన్నీరు నాగేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, శ్రీరాం ధనుంజయ, బిజెపి, సిపిఐ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు కూడా పలుచోట్ల జాతీయ జెండాలను ఆవిష్కరించి స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తిని పాదుకొల్పారు.

## విజయవాడలో రెనాల్ట్ ఆర్ స్టోర్ ప్రారంభం

విజయవాడ, ఆగష్టు 15, ప్రభాతవార్త : విజయవాడలో రెనాల్ట్ ఆర్ స్టోర్ ప్రారంభించినట్లు సంస్థ సేల్స్ అండ్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ ఫ్రాన్సిస్కో హిడాల్గో ప్రకటించారు. మా ఉత్పత్తులకు ఏపిలో లభిస్తున్న ఆదరణ, ప్రోత్సాహకర స్పందనకు అనుగుణంగా ఏపి తమకు ప్రాధాన్యత గల మార్కెట్ అన్నారు.

## అమేజాన్‌లో కెకె కెమేరాలపై అద్భుతమైన డీల్స్

విజయవాడ, ఆగష్టు 15, ప్రభాతవార్త : ప్రపంచ ఫోటోగ్రఫీ సందర్భంగా కెకె కెమేరాలపై అద్భుతమైన డీల్స్ ఆగస్టు 19 వరకు అందిస్తున్నట్లు అమేజాన్ ఇండియా ప్రతినిధులు ప్రకటించారు. డీఎల్ఎల్ఆర్‌లు, మిర్రర్‌లెస్ కెమేరాలు, లెన్స్‌లు, వాటికవసరమైన యాక్సరీస్, సోనీ, కానన్, ఇన్‌స్టా 360 వంటి ప్రముఖ బ్రాండ్ల ను ఈ డీల్స్‌లో పొందాలన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## బలమైన నాయకత్వంతోనే సమగ్రాభివృద్ధి : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట,ఆగస్టు15,ప్రభాతవార్త: సమర్ధవంతమైన, బలమైన నాయకత్వం ఉన్నప్పుడే భారతదేశంతోపాటు రాష్ట్రాలు సమగ్రాభివృద్ధి చెందుతాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వ ఏడాది సుపరిపాలనలో రాష్ట్రం గత పాలకుల విధ్వంసం నుంచి బైటపడి సుస్థిర ప్రగతి దిశగా పరుగులు ప్రారంభించిందని మాజీమంత్రి, శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, పార్టీ కార్యాలయంలో ప్రత్తిపాటి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పలుచోట్ల ప్రసంగించారు. తొలుత స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో త్రివర్ణ పతకాన్ని ఎగురవేసి, కార్యాలయ సిబ్బంది, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. 140 కోట్ల జనాభా ఒక తాటిపై నిలపబడటమే మన దేశ సమగ్రతకు, సార్వభౌమత్వానికి బలమని ప్రత్తిపాటి తెలిపారు.




పొరుగు దేశాలు ఉగ్రవాదంతో కవ్వింపు చర్యలకు పాల్పడటాన్ని కట్టడి చేయడంలో ప్రధాని మోది సమర్ధవంతంగా పనిచేశారని ప్రత్తిపాటి కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు. ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు రాష్ట్ర ఆదాయం పెంపుతో పాటు, ప్రజలకు మంచి సంక్షేమాన్ని అందించేందుకు శక్తి వంచన లేకుండా పనిచేస్తున్నారని ప్రత్తిపాటి చెప్పారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలు, నియంత్రృత్వ, నిరంకుశ విధానాలలో మగ్గిపోతున్న పెత్తందార్లకు మింగుడు పడటంలేదని, అటువంటి వారికి ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని ప్రత్తిపాటి పరోక్షంగా వైసిపికి చురకలు అంటించారు. చంద్రబాబు సంకల్పానికి ప్రధాని మోదీ అండగా నిలిచారని అన్నారు. పోలవరం పూర్తితో నదులను అనుసంధానం చేయాలనుకుంటున్న చంద్రబాబు సంకల్పానికి ప్రధాని అండగా నిలవడం శుభపరిణామమని అన్నారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలను దిశగా సాగుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి ఆలోచన కార్యరూపం దాల్చాలని, రాష్ట్రంలోని పేదలు ఆర్దికంగా ఉన్నత స్దానాలకు చేరాలన్న చంద్రబాబు కల సాకారం కావాలని ప్రత్తిపాటి ఆకాంక్షించారు.

**పేద,మధ్యతరగతి వర్గాలకు త్వరలోనే ఇంటిస్థలాలు**

ఇంటిస్థలం, ఇళ్లులేని నిరుపేదల కోసం త్వరలోనే కూటమి ప్రభుత్వం ఉచితంగా ఇళ్లస్థలాలు అందించనున్నదని ప్రత్తిపాటి తెలిపారు. మున్సిపల్, మండల, గ్రామ, టిడిపి నాయకులు, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## స్త్రీశక్తి అమలుతో కువిమర్శలు చేసే నోళ్లు శాశ్వతంగా మూతబడతాయి : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట,ఆగస్టు15,ప్రభాతవార్త: సూపర్-6 లో కీలకమైన స్త్రీశక్తి (మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం) పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లు నేడు ప్రారంభించి రాష్ట్ర మహిళలకు కొత్త వరం అందించారని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ప్రభుత్వం నేడు సగర్వంగా, సంతోషంగా ప్రారంభిచంని స్రీశక్తి పథకం ప్రారంభోత్సవంలో బాగంగా పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్‌లో నూతన బస్సులను ప్రత్తిపాటి ప్రారంభించారు.




మహిళల జయజయధ్వానాల మద్య ఉచిత బస్ ప్రయాణసౌకర్యానికి ప్రత్తిపాటి శ్రీకారం చుట్టారు. అనంతరం బస్టాండ్‌నుంచి కళామందిర్ కూడలి వరకు మహిళలతో కలసి బస్‌లో ప్రయాణించిన ప్రత్తిపాటి ఈ పథకంపై వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సందిస్తున్న ప్రజాసంక్షేమ అస్త్రాలతో రాష్ట్రంలోని కొందరు రాజకీయ నిరుద్యోగులకు కంటిమీద కునుకు లేకుండా పోయిందని ప్రత్తిపాటి చెప్పారు. మొన్నటికి మొన్న తల్లికి వందనం అమలుతో వైసిపి నేతలు ప్రజల మద్య తిరగలేక తలలు వేలాడేసారని ప్రత్తిపాటి తెలిపారు నేడు అమలులోకి వచ్చిన స్రీశక్తి పథకంతో ప్రభుత్వంపై కువిమర్శలు చేసే వాళ్ల నోళ్లు శాశ్వతంగా మూతపడతాయని అన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే కొన్ని వర్గాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నారని, మహిళలకు ఉచిత గ్యాస్ సిలెండర్‌తో పాటు తాజాగా ఉచిత బస్ ప్రయాణం అందుబాటులోకి తీసుకువచ్చారని అన్నారు. స్రీశక్తి పథకం అమలుతో ప్రభుత్వంపై ఏడాదికి రూ 1970 కోట్ల వరకు భారం పడుతుందని ప్రత్తిపాటి చెప్పారు. ఈ పథకం అమలుతో రాష్ట్రంలోని మహిళలందరూ ఇది మా ప్రభుత్వం, మంచి ప్రభుత్వమని సంతోషించడం చూశాక ముఖ్యమంత్రి ఎందుకు మహిళల సంక్షేమానికి అధికా ప్రాధాన్యత ఇస్తారో అర్ధమైందని అన్నారు. మహిళల సంతోషం, సంక్షేమం, ఆర్ధిక స్వావలంభన కోసం చంద్రబాబు ఎన్ని పథకాలైనా అమలు చేస్తారని ప్రత్తిపాటి తెలిపారు. ఆడబిడ్డలు కూటమి ప్రభుత్వాన్ని కంటికి రెప్పలా కాపాడుకోవాలని, ఉచిత బస్ ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జగన్ తన హయంలో రాష్ట్ర రవాణా వ్యవస్థలను పూర్తిగా గాలికి వదిలేశారని దానివల్ల వందలాది బస్‌లు మూతబడ్డాయని అన్నారు. దానికి తోడు రోడ్లు వేయకపోవడంతో బస్‌లు బాగా దెబ్బతిన్నాయని, డ్రైవర్లు కూడా అనారోగ్యసమస్యలతో ఇబ్బంది పడ్డారని ప్రత్తిపాటి తెలిపారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్దపెట్టి నెలల వ్యవధిలోనే రాష్ట్రంలోని రోడ్ల రూపురేఖలు పూర్తిగా మార్చేశారని ప్రత్తిపాటి తెలిపారు.

## అసిస్ట్ డైరెక్టర్ జాష్టి రంగారావుకు ఉత్తమ సేవా అవార్డు

చిలకలూరిపేట,ఆగస్టు15,ప్రభాతవార్త: ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలలో రైతులకు, పేద ప్రజలకు, కార్మికులకు, మహిళలకు, వృద్ధులకు, నిరుద్యోగులకు విశేష సేవలు అందిస్తున్న ప్రముఖ స్వచ్ఛందసేవా సంస్థ అసిస్టుకు ఉత్తమ సేవా అవార్డు లభించింది. ఈ అవార్డును 79వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల సందర్భంగా బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్,బాపట్ల జిల్లా కలెక్టర్ మురళి చేతులమీదుగా అసిస్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి రంగారావు అందుకున్నారు. జాష్టి రంగారావు ఈ అవార్డు అందుకోవడం పట్ల స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, చిలకలూరిపేట రోటరీ క్లబ్ సభ్యులు, చిలకలూరిపేట మాజీ శాసనసభ్యులు డాక్టర్ కందిమళ్ల జయమ్మలు జాష్టి రంగారావుకు అభినందనలు తెలియచేశారు.



## చిలకలూరిపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శారదా మున్సిపల్ పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

చిలకలూరిపేట,ఆగస్టు15,ప్రభాతవార్త: చిలకలూరిపేట రోటరీక్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని శారదా మున్సిపల్ పాఠశాలలో 79వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను చిలకలూరిపేట రోటరీక్లబ్ అధ్యక్షుడు ఉప్పుటూరి ప్రసాద్, స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు నాగ్నెని విజయశ్రీ కలిసి ఎగురవేశారు. అనంతరం క్లబ్ డైరక్టర్లు పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు నోట్‌బుక్స్, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నా రోటరీ మాజీ అధ్యక్షుడు తోటకూర వెంకటనారాయణ విద్యార్థులకు స్వాతంత్ర్య సమరయోధుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి బోడే రామసుబ్బారావు, కోశాధికారి, కటకం శివరామప్రసాద్, డైరక్టర్లు దండా గోపి, గల్లా సాంబశివరావు, గుమ్మడి సాంబశివరావు, పరాంకుశం శ్రీనివాసరావు, ఓబూరి సాంబశివరావు, విద్యాకమిటి చైర్మన్, పాఠశాల ఉపాధ్యాయునీలు పాల్గొన్నారు.



## తహశీల్దార్ షేక్ మహ్మద్ హుస్సేన్‌కు ఉత్తమ తహసిల్దార్ పురస్కారం



చిలకలూరిపేట,ఆగస్టు15,ప్రభాతవార్త: ఉత్తమ సేవలు అందించినందుకుగాను చిలకలూరిపేట తహసిల్దార్ షేక్ మహ్మద్ హుస్సేన్‌కు ఉత్తమ సేవా అవార్డు లభించింది. ఈ అవార్డును పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో భాగంగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు చేతులమీదుగా తహశీల్దార్ మహ్మద్ హుస్సేన్ అందుకున్నారు. ఈ అవార్డును అందుకున్న తహసిల్దార్ మహ్మద్ హుస్సేన్‌కు మండలంలోని పలువురు నాయకులు, అధికారులు అభినందనలు తెలియచేశారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

నరసరావుపేట, ఆగస్టు 15 ప్రభాతవార్త : పల్నాడు జిల్లా కలెక్టర్ పి అరుణ్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా స్దానిక కలెక్టరేట్ పేరేడ్ గ్రౌండ్‌లో 79వ స్వతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిధిగా రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హాజరై జిల్లా ఎస్పీ కె శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేలతో కలిసి జాతీయ పతాకం ఆవిష్కరించి పోలీస్‌ల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఏడాది కాలంలో పల్నాడు జిల్లాలో జరిగిన ప్రగతి, సంక్షేమ కార్యక్రమాలను తమ సందేశంలో వారుతెలిపారు. వివిధ ప్రభుత్వాశాఖల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలను వివరిస్తూ ప్రదర్శించిన ప్రత్యేక శకటాలు విశేషంగా ఆహుతులనుఆకట్టుకున్నాయి. అదే విధంగా ప్రభుత్వాశాఖల సమాచారం, సేవల గురించి తెలిపే స్టాల్స్ ఏర్పాటు చేశారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రదర్శన, వివిధ పాఠశాలల నుండి వచ్చిన చిన్నారుల సాంస్కృతిక నృత్యాలు అందరిని అలరించాయి. ఆయా శాఖలకు సంబంధించి ఉత్తమ అధికారులకు ప్రశంసా పత్రాలను 61 మంది జిల్లా స్థాయి అధికారులు, 111 మంది రెవిన్యూ అధికారులు, 47 మంది పోలీస్, ఆరుగురు మున్సిపల్ అధికారులు, 357 మంది ఉద్యోగులు, 16 మంది ఎన్జీవోలు మొత్తం 598 మందికి మంత్రి నాదెండ్ల మనోహర్, కలెక్టర్ అరుణ్‌బాబులు అందించారు.



**స్వర్ణాంధ్ర - 2047 దిశగా అడుగులు : మంత్రి నాదెండ్ల మనోహర్**

స్వర్ణాంధ్ర - 2024 లో భాగంగా 15 శాతం వృద్ధి, పేదరికి నిర్మూలన సాధన కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖామంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. వ్యవసాయం, అనుబంధశాఖలకు సంబంధించి ప్రభుత్వం రైతు కుటుంబాలకు రూ.161.04 కోట్లు వారి ఖాతాలలో జమ చేసిందన్నారు. నకరికల్లులో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ నిర్మాణానికి పనులు జరుగుతున్నాయన్నారు. జిల్లాలో రూ.కోటి విలువైన గొర్రెల పెంపక కేంద్రాలు, చేపల పెంపకం కోసం 1500 లైసెన్సుల జారీ, మల్టీ గోడౌన్‌ల నిర్మాణం, వరికపూడిసెల ప్రాజెక్ట్‌కు నిధులు మంజూరు చేశామన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు కృషి జరుగుతుందన్నారు. కేసానుపల్లి వద్ద ఆటోనగర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్య, వైద్యానికి సంబంధించి పెద్ద ఎత్తున నిధులు కేటాయించడం జరిగిందన్నారు. గృహ నిర్మాణాలు జిల్లాలో రూ.805 కోట్లతో జరుగుతున్నాయన్నారు. మహిళలకు ఉచిత బస్సు రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధులత, జిల్లా రెవిన్యూ, పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## విజయవంతమైన మెగా ఉచిత వైద్య శిబిరం

నరసరావుపేట, ఆగస్టు 15 ప్రభాతవార్త : కొండవీడు ఇ.యన్.టి.హాస్పటల్‌లో ఆగష్టు 15వతేదీ శుక్రవారం జాతీయ పర్వదినాన్ని పురస్కరించుకొని ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఛైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎన్నో ఏళ్ళుగా పేదలకు ఉచిత వైద్యసేవలను అందిస్తూ కొనసాగుతున్న కొండవీడు ఇ.యన్.టి.హాస్పటల్ సేవలు విలువైనవని తెలిపారు. డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ మొత్తం 209 మంది క్యాంప్‌కు హాజరైనట్లు తెలిపారు. వారికి రూ.2 లక్షల 62 వేల విలువైన మందులను ఉచితంగా అందజేశామని, రూ.35 వేల విలువైన వైద్య పరీక్షలు చేశామన్నారు. 55 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీవర్షిణి, డాక్టర్ విష్ణురాజు, డాక్టర్ శేఖర్‌రెడ్డి, డాక్టర్ సుదీప్‌చంద్ర, డైరెక్టర్ కంజుల కోటిరెడ్డి, మస్తాన్‌రెడ్డి, మేనేజర్ మహేష్, ఫార్మసిస్ట్ స్వామి పాల్గొన్నారు.

**స్వాతంత్ర్య దినోత్సవం స్ఫూర్తిని కూటమి ప్రభుత్వం కొనసాగిస్తుంది : ఎమ్మెల్యే, కొమ్మాలపాటి**

నరసరావుపేట, ఆగస్టు 15 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తిని కొనసాగిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, టిడిపి జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్, రాష్ట్ర వైద్య విభాగం ఉపాధ్యక్షులు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావులు అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేసి మహాత్ములకు నివాళులర్పించారు. పార్టీ సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య, పలువురు ప్రజా ప్రతినిధులు, మహిళా నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు స్థానిక పార్టీ కార్యాలయం, మున్సిపల్ బాయ్స్ హై స్కూల్, ఎంపిడివో కార్యాలయం, ఆర్డీవో కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, తిలక్ స్కూల్, ప్రభుత్వ హాస్పటల్ తదితర చోట్ల జాతీయ జెండాను ఎగురవేసి సందేశం అందించారు. నరసరావుపేట నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధులత, తహశీల్దార్ వేణుగోపాల్, ఎంపిడివో కృష్ణకుమారి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అధికారులు, పార్టీ నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు వెంట ఉన్నారు.



## సిఐ సుబ్బనాయుడుకు ఉత్తమ పోలీస్ అధికారి అవార్డు


చిలకలూరిపేట,ఆగస్టు15,ప్రభాతవార్త: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పల్నాడు జిల్లాలో ఉత్తమ పోలీస్ అధికారిగా చిలకలూరిపేట రూరల్ సిఐ బి సుబ్బనాయుడు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ పురస్కారాన్ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్, పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు చేతులమీదుగా శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో అందుకున్నారు. చిలకలూరిపేట రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ, అలాగే సమర్దవంతంగా విధులు నిర్వహించినందుకుగాను సుబ్బనాయుడుకు ఈ పురస్కారం లభించింది. పోలీసులకు ఇది గొప్ప గుర్తింపు అని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. కాగా ఉత్తమ పోలీస్ అధికారి అవార్డు అందుకున్న బి సుబ్బనాయుడుకు రూరల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ ఎస్ఐలు, సిబ్బంది, పలువురు అధికారులు, మిత్రులు అభినందనలు తెలియచేశారు.

## ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడను కలిసిన బొందిలి కార్పోరేషన్ డైరెక్టర్

నకరికల్లు, ఆగస్టు 15 ప్రభాతవార్త : శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబును శుక్రవారం బొందిలి కార్పోరేషన్ డైరెక్టర్లు మర్యాద పూర్వకంగా స్థానిక కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా నాయకులు బొందిలి శ్రీనివాససింగ్, బాలాజీ సింగ్, సీతారామసింగ్, శ్యామ్‌సింగ్, నాగమల్‌సింగ్ పాల్గొని మాట్లాడారు. బొందిలి సంక్షేమం, అభివృద్ధి కార్పోరేషన్ ఛైర్మన్‌గా కర్నూలుకు చెందిన విక్రమ్‌సింగ్‌ను నియమించడం పట్ల వారు హర్షం ప్రకటించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్యేకంగా ఆయనకు సత్కారం చేశారు.

## ఎందరో మహనీయుల త్యాగ ఫలితం దేశ స్వాతంత్ర్యం : జీ.వీ

వినుకొండ,ఆగస్టు15,ప్రభాతవార్త: భారతదేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహానుభావులు చేసిన త్యాగం సాగించిన పోరాటం ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని వినుకొండ పట్టణం,నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లోని ప్రభుత్వ,ప్రవేటు కార్యాలయాల్లో, విద్యాసంస్థల్లో జాతీయ జెండాలు ఎగురవేశారు. పట్టణంలోని చీఫ్‌విప్ కార్యాలయం,తహశీల్ధార్ కార్యాలయం,మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమంలో చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు పాల్గొన్నారు. అలాగే తహశీల్ధార్ కార్యాలయం నుంచి శివయ్య స్థూపం సెంటర్ వరకు 1000 అడుగల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఆనాడు బ్రిటిషర్లతో జరిగిన పోరాటంలో భారతీయులు ఎందరో అమరులైనారని వారిని స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. స్వాతంత్ర్యద్యోమ స్ఫూర్తితో సమాజ శ్రేయస్సుకు అందరూ కృషి చేయాలన్నారు. వికసిత ఆంధ్రప్రదేశ్ సాకారమే సీఎం చంద్రబాబు స్వప్నమని అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అనేక అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. 2047 నాటికి ఏపీని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. జగన్‌రెడ్డి అరాచకత్వ పాలనలో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుందని చెప్పారు. ఎన్ని అడ్డంకులు పెట్టినా పులివెందుల్లో ప్రజాస్వామ్యం గెలిచిందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,కూటమి నాయకులు,విద్యార్థులు,యువత తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

చిలకలూరిపేట,ఆగస్టు15,ప్రభాతవార్త: పట్టణంలో పలు పార్టీలు, పలు సంస్థల ఆధ్వర్యంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని వేద పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డానియేల్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఎన్‌సిసి విద్యార్థులు చేసిన కవాతులు, విన్యాసాలు అందరిని అలరించాయి. అదేవిధంగా విద్యార్థిని, విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరక్టర్ శ్రీగిరి పెర్సీ స్వరూప, అకడమిక్ డైరక్టర్ డాక్టర్ సత్యదీప్తి, ఆపరేషన్ హెడ్ జోసఫ్, ఎన్‌సిసి కేర్‌టేకర్ పార్ధసారథి, ఉపాధ్యాయులు మనోహర్, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు. బిజెపి ఆధ్వర్యంలో ఎన్‌ఆర్‌టి సెంటర్ వద్దనున్న కార్యాలయం వద్ద జాతీయ జెండాను పార్టీ నాయకులు ఎగురువేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కె పవన్‌కుమార్ గాంధి, సింగరేసు పోలయ్య, మల్లెల శివనాగేశ్వరరావు, గట్టా హేమకుమార్, పరాంకుశం శ్రీనివాసరావు, పోట్రు పూర్ణచంద్రరావు, తాటిపర్తి జయరామిరెడ్డి, తూబాటి రాజ్యలక్ష్మీ, నెల్లూరి ఈశ్వర రంజిత్, ఆదిమూలం గురుస్వామి, ఉప్పాల భాస్కరరావు, కస్తూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని బ్రిలియంట్ స్కూల్‌లో జాతీయ పతాకాన్ని క్లబ్ అధ్యక్షుడు ఐతా వెంకట ప్రసాద్ ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కొత్తమాసు పూర్ణచంద్రరావు, కోశాధికారి శనగపల్లి వెంకటేశ్వరరావు, క్లబ్ డైరక్టర్లు కొలిశెట్టి శివ సుబ్రహ్మణ్యం, పొట్టి సుబ్బారావు, స్కూల్ డైరక్టర్ శ్రీనివాస్, ప్రిన్సిపల్ సాయికృష్ణ, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. ఆర్యవైశ్య కళ్యాణమండపం ఆవరణలో జాతీయ నాయకుల విగ్రహాలకు కళ్యాణ మండపం నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జాతీయ జెండాను అధ్యక్షుడు డాక్టర్ ఎవి సురేష్‌కుమార్ ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో చేవూరి కృష్ణమూర్తి, కనమర్లపూడి రమేష్, కొత్త కోటేశ్వరరావు, రాచమల్లు సూర్యారావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొత్తమాసు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద జాతీయ జెండాను కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి యం రాధాకృష్ణ ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గోవింద శంకర శ్రీనివాస్, అనీల్‌కుమార్, శ్రీరాంరెడ్డి నాగాంజనేయులు, స్వప్నకుమార్, యం ప్రసన్న తదితరులు పాల్గొన్నారు. విద్యాసంఘం ఆధ్వర్యంలో జూనియర్‌కాలేజీ, ఆర్‌వియస్ హైస్కూల్, డిఆర్‌ఎన్ కళాశాల, ఆర్‌వియస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూళ్లనందు జాతీయపతాకాన్ని పాలకవర్గ అధ్యక్షులు తేళ్ల సుబ్బారావు ఎగురవేశారు. ఈ కార్యక్రమాలలో కార్యదర్శి మైలవరపు శివానందకుమార్, ఉపాధ్యక్షులు కందిమళ్ల సాంబశివరావు, బేతంచర్ల రామకోటేశ్వరరావు, బచ్చు రామలింగేశ్వరరావు, ఉప్పలపాటి వెంకటేశ్వరరావు, యం వెంకటేశ్వరరావు, డాక్టర్ బైరా సుజాతలు పాల్గొన్నారు.



## ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న గార్డ్స్ సంస్థ అధ్యక్షురాలు దాసరి ధనలక్ష్మి

చిలకలూరిపేట,ఆగస్టు15,ప్రభాతవార్త: స్దానిక స్వచ్ఛంద సేవాసంస్ద జ్ఞానేశ్వరి ఆర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (గార్డ్స్) సంస్దకు ఉత్తమ సేవలు ప్రజలకు అందించినందుకుగాను ఉత్తమ సేవా పురస్కారం లభించింది. కాగా ఈ పురస్కారాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, జిల్లా ఎస్పి కె శ్రీనివాసరావు చేతులమీదుగా గార్డ్స్ సంస్ద అధ్యక్షురాలు దాసరి ధనలక్ష్మీ అందుకున్నారు. ఈ సంస్ద పేదలకు, మహిళలకు, విద్యార్థుల అభ్యున్నతికి చేస్తున్న సేవలకు ఈ పురస్కారం లభించింది. గార్డ్స్ సంస్ద ఈ పురస్కారం పొందటం పట్ల పట్టణ ప్రముఖులు అభినందనలు తెలియచేశారు.



## ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించిన కలెక్టర్, ఎం.పి., ఎమ్మెల్యేలు

నరసరావుపేట, ఆగస్టు 15 ప్రభాతవార్త : స్థానిక ఆర్టీసీ బస్ డిపోలో శుక్రవారం సాయంత్రం మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణానికి సంబంధించి బస్సులకు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎం.పి.లావు శ్రీకృష్ణదేవ రాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావులు ప్రారంభించారు. స్త్రీ శక్తి పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులతో ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు ఉచిత బస్సును ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా హామీలను అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సిఎం నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పాలనకు అన్ని వర్గాల ప్రజలు అండగా నిలవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్‌గనోరే, ఆర్డీవో మధులత, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.



## మహంకాళి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

రొంపిచర్ల, ఆగస్టు 15 ప్రభాతవార్త : మండలంలోని ఇస్సపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. దేవస్థానంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. వరలక్ష్మిదేవి వ్రతం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామంలోని మహిళా భక్తులతో పాటు పట్టణ, పరిసర ప్రాంతాలలోని భక్తులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. శ్రద్ధగా పూజలు నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులందరికీ ఆలయ ఈవో నలబోతు మాధవిదేవి పర్యవేక్షణలో పసుపు, కుంకుమ, గాజులు, అమ్మవారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాలను అందజేశారు. ప్రత్యేక పూజలకు హాజరైన భక్తులకు తీర్ధ ప్రసాదాలతో పాటు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## నరసరావుపేట ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

నకరికల్లు, ఆగస్టు 15 ప్రభాతవార్త : వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో...మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి నాయకత్వంలో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయంలోనూ, మహాత్మాగాంధీ విగ్రహం వద్ద, సెయింట్‌ఆన్స్ కళాశాలలోనూ, కొండవీడు ఇ.యన్.టి.హాస్పటల్‌లోనూ జాతీయ జెండాలను పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. కూటమి పాలన స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందన్నారు. రాజధానిని మరో చోటకు మార్చాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. జనసేన పార్టీ కార్యాలయంలో... జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సయ్యద్ జిలానీ జాతీయ పతాకాన్ని ఎగురవేసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్నటువంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలియజేశారు. పార్టీ అధినేత, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు పోతుందని తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జి.వి.ఎస్.ప్రసాద్, షబ్బీర్, ఎస్.కె.అద్రూఫ్, వీర మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌పార్టీ, సిపిఐ కార్యాలయాలలో...**

కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో డిసిసి అధ్యక్షులు అలెగ్జాండర్ సుధాకర్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. సిపిఐ కార్యాలయంలో పార్టీ నాయకులు కాసా రాంబాబు, సత్యనారాయణరాజు, ఉప్పలపాటి రంగయ్య, అంజిరెడ్డి, జాన్‌సైదా, రాజు ఆధ్వర్యంలో జరిగాయి.

### విద్యాసంస్థల ఆధ్వర్యంలో....

ఎస్‌ఎస్‌ఎన్ కళాశాలలో కళాశాల కార్యదర్శి నాగసరపు సుబ్బరాయగుప్తా ఎన్‌సిసి క్యాడెట్స్ నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కృష్ణవేణి డిగ్రీ కళాశాల, కేరిడ్జ్ పాఠశాలలో ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు జాతీయ జెండాను ఎగురవేశారు. ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఛైర్మన్ షేక్.మీరావలి, కార్యదర్శి కరీమ్ మొహిద్దీన్‌లు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో ఛైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌లు జాతీయ జెండాను ఎగురవేశారు. ఏఎంరెడ్డి విద్యాసంస్థలలో కార్యదర్శి అట్లూరి శాంతి - శ్రీనివాసరెడ్డి, ఎంఏఎం విద్యాసంస్థల ఛైర్మన్ ఎం.ఆర్.శేషగిరిరావు, డైరెక్టర్ దరువూరి శ్రావ్యలు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. విద్యార్థులకు తమ సందేశాలను అందించారు.

## రెపరెపలాడిన మువ్వన్నెల జాతీయ జెండా

నూజెండ్ల,ఆగస్టు15,ప్రభాతవార్త: 79వ దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడకులు వాడవాడలా ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రమైన నూజెండ్ల ఎంపిడివో కార్యాలయం తహశీల్దార్ కార్యాలయం,సొసైటీ కార్యాలయం,జెడ్పి స్కూల్,కేజీబీవి,మోడల్ స్కూల్,అన్ని ప్రభుత్వ,ప్రైవేటు స్కూల్స్ నందు ఘనంగా జాతీయ జెండాను ఆవిష్కరించి వేడుకలు నిర్వహించారు. ఆయా కార్యాలయాల్లో జరిగిన వేడుకల నందు తహశీల్దార్ రమేష్‌కుమార్,ఎంపిడివో ఉమాదేవి,ఎంఈవో సత్యనారాయణ,ఎంపిపి మేడం జయరామిరెడ్డి,నూజెండ్ల సొసైటీ ఛైర్‌పర్సన్ బచ్చు అంజిరెడ్డిలు పాల్గొని పతాక ఆవిష్కరణలు చేశారు. కార్యక్రమాల్లో సొసైటీ సీఈవో గంగినేని శ్రీనివాసరావు, జెడ్పి స్కూల్ హెచ్‌ఎం శ్రీదేవి,కేజీబీవీ స్పెషలాఫీర్ ఉషారాణి,డీటి తులసి,రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ సైదా, సర్వేయర్ చండీరాణి కూటమి నాయకులు, రామయ్య పాల్గొన్నారు

## మహిళాసాధికారతకు వెన్నుదన్ను స్త్రీ శక్తి!

### - ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభోత్సవంలో జూలకంటి!

మాచర్ల, ఆగస్టు 15 ప్రభాతవార్త: మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సూపర్‌సిక్స్ హామీల్లో కీలక పథకమైన మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం స్త్రీ శక్తి పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.



అనంతరం బస్సులో ప్రయాణిస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించిన టికెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం ఆర్థిక లోటులో ఉండి, ఇబ్బందుల్లో ఉన్నా.. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తోందని పేర్కొన్నారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ప్రభుత్వానికి రూ.1297 కోట్లు భారం పడుతున్నప్పటికీ మహిళలకు ఆర్థిక ఊతం అందించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన మాటకు కట్టుబడి ఈ పథకాన్ని అమలు చేశారని ఆయన పేర్కొన్నారు. ఆర్థిక సంక్షేమానికి ఊతం సూపర్ సిక్స్ పథకాలని ఎమ్మెల్యే జూలకంటి పునరుద్ఘాటించారు. సూపర్‌సిక్స్‌లోని ప్రతి ఒక్క పథకం ఆర్థిక సంక్షేమానికి మార్గం చూపుతుందని ఆయన పేర్కొన్నారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ ఉచిత బస్సు ప్రయాణం పథకం వారి ఆర్థిక స్వావలంబనకు ఎంతగానో దోహదపడుతుందని ఆయన వెల్లడించారు. జగన్‌రెడ్డి హయాంలో అమలైన పథకాలు సంక్షోభానికి దారి తీశాయని, తద్వారా రాష్ట్రం తీవ్ర అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఆయన విమర్శించారు. ఏడాది కాలంలోనే సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలై, ప్రజలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయన్నారు. ప్రజలకు ఎలాంటి సంక్షేమం అందిస్తే.. వారి ఆర్థిక అభివృద్ధి మెరుగుపడుతుందో అలాంటి సంక్షేమ పథకాలనే అందించడానికి కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు సుపరిపాలన, సంక్షేమం, ప్రాంతాల అభివృద్ధి వంటి వాటిపైనే ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టిసారించారని ఈ సందర్భంగా ఆయన చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం వీరాస్వామి, పలువురు అధికారులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాచర్ల రూరల్ సీఐకు ఉత్తమ సేవా పురస్కారం



మాచర్ల, ఆగస్టు 15 ప్రభాతవార్త: మాచర్ల రూరల్ సీఐ షేక్ నఫీజ్‌బాషా 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. నరసరావుపేటలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు, అధికారులు, సిబ్బంది అవార్డు గ్రహీత నఫీజ్‌బాషాను అభినందించారు.

## ఉత్తమ హౌసింగ్ ఏఈగా మరియదాసు

మాచర్ల, ఆగస్టు 15 ప్రభాతవార్త: 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మాచర్ల టౌన్ హౌసింగ్ ఏఈ ఎస్.మరియదాసు ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. శుక్రవారం నరసరావుపేటలో జరిగిన కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా పురస్కారాన్ని పొందారు.



ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సమస్యలను పరిష్కరించడంలో ఏఈగా మరియదాసు సేవలు అందించారు. ఆయన పనిచేసిన ప్రతి మండలంలోనూ పాలనా సంస్కరణలు చేపట్టి ప్రజల ప్రశంసలు అందుకున్నారు. ఆయన ప్రతిభకు గుర్తింపుగా ఇప్పటి వరకు రెండుసార్లు ఉత్తమసేవా పురస్కారాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా తోటి అధికారులు, సిబ్బంది ఆయనను అభినందించారు.

## ఉత్తమ ఇంజినీరుగా వెల్దుర్తి మండల జేఈ శ్రీనివాసరెడ్డి

మాచర్ల, ఆగస్టు 15 ప్రభాతవార్త: 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వెల్దుర్తి మండల జేఈ పాశం శ్రీనివాసరెడ్డి ఉత్తమ ఇంజినీరుగా పురస్కారాన్ని అందుకున్నారు.



జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి పురస్కారాన్ని అందుకున్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సమస్యలను పరిష్కరించడంలో ఆయన సేవలు ప్రశంసనీయం. పనిచేసిన ప్రతి మండలంలోనూ పాలనా సంస్కరణలు చేపట్టి ప్రజల ప్రశంసలు అందుకున్నారు.

## ఉత్తమ కమిషనర్‌గా అవార్డు అందుకున్న వేణుబాబు

మాచర్ల, ఆగస్టు 15 ప్రభాతవార్త: 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మాచర్ల మున్సిపల్ కమిషనర్ వేణుబాబు ఉత్తమ కమిషనర్‌గా పురస్కారాన్ని అందుకున్నారు.



జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో జరిగిన కార్యక్రమంలో డి.వేణుబాబు పురస్కారాన్ని అందుకున్నారు. పట్టణ ప్రజలకు అందుబాటులో ఉంటూ పట్టణాభివృద్ధికి ఆయన చేసిన సేవలకు గాను ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

## ప్రపంచ స్థాయి రంగాల్లో భారత్ అగ్రగామిగా ఎదుగుతోంది: ఎమ్మెల్యే జూలకంటి

మాచర్ల, ఆగస్టు 15 ప్రభాతవార్త: ప్రపంచస్థాయి రంగాల్లో అగ్రగామిగా భారత్ స్వతంత్రంగా ఎదుగుతోందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్క్ సెంటర్, తహశీల్దారు కార్యాలయం, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు.



ముందుగా దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహనీయుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో మన వెనుకబాటును చూసి నవ్వుకున్న దేశాలు.. నేడు వృద్ధి చెందుతున్న భారతదేశం వైపు చూస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. సాంకేతిక, పారిశ్రామిక, అంతరిక్ష పరిశోధన, వైద్య, విద్య, వ్యవసాయ, రవాణా వంటి రంగాల్లో మన దేశం శరవేగంగా అభివృద్ధిని సాధిస్తోందని ఆయన వివరించారు. నేడు గర్వంగా తలెత్తుకొని మేము భారతీయులం అని చెప్పుకునే స్థితి ప్రధాని మోదీ దేశ గతి మార్చి, తీర్చిదిద్దారని కొనియాడారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు కిరణ్, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, ఎంఈఓ సురేష్, పాఠశాల హెచ్ఎం ఉషారాణి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎంతోమంది మహనీయుల త్యాగఫలమే స్వాతంత్ర్యం: యాగంటి మల్లికార్జునరావు


మాచర్ల, ఆగస్టు 15 ప్రభాతవార్త: ఎంతోమంది మహనీయులు మహోత్తర ప్రాణ త్యాగాల ఫలితమే స్వాతంత్ర్యం అని టీడీపీ సీనియర్ నాయకులు, మాచర్ల మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండా వందనంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. గత వైకాప నియంతృత్వ పాలన తర్వాత ఇప్పుడు ఆంధ్ర రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వ పాలనలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అనుభవిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మద్దిగపు వెంకటేశ్వరరెడ్డి, బండ్ల బ్రహ్మం, పులుసు రఘునాథ్‌రెడ్డి, బండ్ల శ్రీను, చందుగోప్, సచివాలయ అడ్మిన్ శ్రీలక్ష్మి ఆకుల నరసింహారావు, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

మాచర్ల, ఆగస్టు 15 ప్రభాతవార్త: మాచర్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్టేషన్ ఆవరణలో జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహానుభావులను స్మరించుకున్నారు. వారి అడుగుజాడల్లో నడవాలని ఎస్సై సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగించారు.

## మహనీయుల త్యాగ ఫలితమే స్వాతంత్ర్యం

పిడుగురాళ్ల, ఆగస్టు 15 ప్రభాతవార్త: ఎందరో మహనీయుల త్యాగ ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని, వారి త్యాగాలను ఎన్నటికీ మరువకూడదని గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని మస్జిద్ పల్లగిరి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ పాలకులకు ఎదురొడ్డి ఎందరో మహానుభావులు ప్రాణాలర్పించారన్నారు.



మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకొని వారి చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేశారు. మున్సిపల్ ఛైర్మన్ కొత్త వెంకటసుబ్బారావు, జడ్పీటీసీ జంగా వెంకటకోటయ్య, మార్కెట్‌యార్డు ఛైర్మన్ కటారి రామస్వామి, సీనియర్ నేత డాక్టర్ ఉన్నం నాగమల్లేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు పాండురంగ శ్రీను, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌వలీ, మాజీ సొసైటీ అధ్యక్షుడు వడపల్లి నర్సేశ్వరరావు, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి కనిగిరి శ్రీనివాసరావు, పిల్లి వెన్నూరావు, వడ్డపల్లి సాంబశివరావు, జనసేన మండల అధ్యక్షుడు కామిశెట్టి రమేష్, కాశిం, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకయ్యచౌదరి, ఆత్మకూరు కాశి, హెచ్ఎం కొత్త మల్లికార్జున, విద్యాకమిటీ ఛైర్మన్ బాలకృష్ణ, పట్టణ ఎస్‌హెచ్‌వో వెంకటరావు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ కార్యాలయం, మండల టీడీపీ కార్యాలయం వద్ద నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడులు

బాపట్ల,ఆగస్టు15,ప్రభాతవార్త: ఎంతోమంది ప్రాణత్యాగాలు, పోరాట వీరుల బలిదానంతోనే స్వాతంత్ర్య ఫలాలు అందుకున్నామని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా శుక్రవారం స్థానిక కలెక్టరేట్ పై జాతీయ జెండాను జిల్లా కలెక్టర్ ఎగురవేశారు. త్రివర్ణ పతాకానికి ఆయన సెల్యూట్ చేసిన తదుపరి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా కలెక్టర్ ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేటి పిల్లలే రేపటి భావి భారత పౌరులని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అన్నారు. ఎంతోమంది త్యాగాల చేత, ప్రాణాలు అర్పించడం చేత, వారు సర్వాన్ని కోల్పోవడం ద్వారా ఒక వలస సామ్రాజ్యవాద ప్రభుత్వం చేతి నుండి మనం స్వాతంత్ర్యాన్ని పొందామన్నారు. స్వాతంత్రం పొందిన తర్వాత స్వేచ్ఛ వాయువులు పీల్చుకుంటున్నామని,మనం మన స్వదేశీ ప్రభుత్వంలో ఎవరిమీద ఆధారపడకుండా, స్వతంత్రంగా,ఆర్థికంగా ఎంతో బ్రహ్మాండమైన పురోగతిని సాధిస్తున్నామన్నారు. సైనికపరంగా, విదేశీ విధానాల పరంగా మనం ప్రపంచ దేశాలతో ఎంతో బ్రహ్మాండంగా వ్యవహరిస్తున్నామని ఆయన అన్నారు. మనకు స్వాతంత్రం రావడానికి ఎంతో మంది మహనీయుల ప్రాణ త్యాగాల గాధలను పెద్దవాళ్లు,చిన్న పిల్లలు కు తెలియజేయాలన్నారు. మన స్వాతంత్ర్య సమరయోధులు ఎంతో త్యాగధనులు అని ఆయన అన్నారు. అభివృద్ధి సంక్షేమాలకు అందరం పునరంకితులమవుదామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి జిల్లా సంయుక్త కలెక్టర్ జి గంగాధర్ గౌడ్, కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి మల్లికార్జున రావు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అబ్బురపర్చిన చిన్నారుల సాంస్కృతి కార్యక్రమాలు

బాపట్ల,ఆగస్టు15,ప్రభాతవార్త: స్వాతంత్ర ఫలాలు ప్రజలందరికి సమానంగా చేరాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు.79వ స్వాతంత్ర దినోత్సవం శుక్రవారం స్థానిక మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు.జిల్లా ప్రగతిని చాటి చెప్పేలా శకటాల ప్రదర్శన స్వాతంత్ర వేడుకలలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలు సాధించిన ప్రగతిని ప్రదర్శించిన శకటాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.విద్యుత్ శాఖ అధికారులు రూపొందించిన శకటానికి ప్రధమ బహుమతిని మంత్రి రవికుమార్ ప్రకటించారు.వ్యవసాయశాఖ,ఉద్యానవనశాఖ శకటానికి ద్వితియ బహుమతిని అందజేశారు.మత్స్యశాఖ,పశుసంవర్ధక శాఖ శకటాలు తృతీయ బహుమతిని కైవసం చేసుకున్నాయి.ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖలు వారి ఉత్పత్తులను ప్రదర్శిస్తూ స్టాల్స్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ స్టాల్స్ సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. స్టాల్స్ ప్రదర్శనలో మొదటి బహుమతి వ్యవసాయ శాఖ, రెండవ బహుమతి మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, మూడో బహుమతి జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ లు కైవసం చేసుకున్నాయి. ఈ కార్యక్రమంలో చీరాల వాస్తవ్యురాలు మహిత తన మైక్రో ఆర్ట్ ప్రతిభతో 65 పెన్సిళ్లపై డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవిత చరిత్రను, 86 పెన్సిళ్లపై నెల్సన్ మండేలా జీవిత చరిత్రను, 800 పెన్సిళ్లపై శ్రీమద్ భగవద్గీత లోని 700 శ్లోకాలను, 73 పెన్సిళ్లపై మహాత్మా గాంధీ జీవిత చరిత్రను,25 పెన్సిళ్లపై శ్రీమతి డొక్కా సీతమ్మ గారి జీవిత చరిత్రను లిఖించారు. ఈ ప్రదర్శన చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి, బండ్లను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి, బాపట్ల శాసనసభ్యులు వేగేసిన నరేంద్ర వర్మ రాజు, చీరాల శాసనసభ్యులు ఎం మాలకొండయ్య, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ తుషార్ డ్యూటీ వారి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ జిల్లా సంయుక్త కలెక్టర్ జి గంగాధర్ గౌడ్, జిల్లా అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## బాపట్లజిల్లా చరిత్ర ,వైభవాన్నితెలియజేసే బాపట్ల జిల్లా గీతాన్ని అవిష్కరించిన మంత్రి

బాపట్ల,ఆగస్టు15,ప్రభాతవార్త:

బాపట్ల జిల్లా చరిత్ర, వైభవాన్ని తెలియజేసే "..బాపట్ల జిల్లా గీతాన్ని.." రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి శ్రీ గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి కలిసి ఆవిష్కరించారు. 79వ స్వాతంత్ర స్వాతంత్ర్య దినోత్సవం బాపట్ల మహిళ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా సిడిని ఆవిష్కరించారు. జిల్లాపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న కలెక్టర్ రచయితలకు పోటీలు నిర్వహించారు. అందులో నందిరాజు విజయ్ కుమార్ రచించిన ఉత్తమమైన గీతాన్ని ఎంపిక చేశారు. జె నాగపూర్ణ, రమాదేవి స్వరకల్పనతో సంజయ్ కుమార్, రమాదేవి, కుమారి కీర్తి, స్వాతిలు గానం చేసిన గీతాన్ని వేదికపై ప్రదర్శించారు. ఫోరం ఫర్ బెటర్ బాపట్ల, వి ఆర్ క్రియేషన్స్ ఈ పాటను రూపొందించడంలో విశేషంగా కృషి చేశారని కలెక్టర్ మంత్రి దృష్టికి తెచ్చారు. కరతాల ధ్వనుల మధ్య మంత్రి చేతుల మీదుగా సిడిని అతిధులకు పంపిణీ చేశారు. జిల్లా చరిత్ర, ప్రాశస్త్యాన్ని వెలుగులోకి తీసుకురావడం, అలాగే జిల్లా అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ని మంత్రి రవికుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

## పురపాలకసంఘకార్యాలయంలో స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు:

తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట్ 15 (ప్రభాతవార్త):

పురపాలకసంఘ కార్యాలయం నందు నిర్వహించిన 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.మున్సిపల్ కార్యాలయ సిబ్బంది సమక్షంలో జాతీయజెండా ఎగరవేసి అమరవీరులకు నివాళులు అర్పించారు.అనంతరం వివిధ మున్సిపల్ విభాగాల్లో పనిచేస్తూ ప్రతిభచూపిన ఉద్యోగులు,సిబ్బందికి చైర్మన్ తాడిబోయిన రాధిక ప్రసంసాపత్రాలు అందించారు.పట్టణ ప్రజలందరికి స్వాతంత్ర్యదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.పలువురు సిబ్బంది పనితీరును ప్రశాంసించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధవార్డుల కౌన్సిల్లర్లు,మున్సిపల్ కమిషనర్ మహాలక్ష్మి ౖపతి, మున్సిపల్ ఇంజనీర్ శ్రీకాంత్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వాణి,మేనేజర్ విల్సన్ జయ, మరియు ఆఫీస్ ఇండోర్ అండ్ అవుట్ డోర్ సిబ్బంది సచివాలయ సిబ్బంది మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

ఫోటో నెం 2 ను క్రింధి వార్తకు వాడుకోవలెను

## స్వాతంత్ర్యఫలాలు అందరికి చేరువ కావాలి,హరిప్రసాద్:

తెనాలి టౌన్ ఆగస్ట్ 15 (ప్రభాతవార్త):

స్వాతంత్ర్యఫలాలు ప్రజలందరికి చేరువైనరోజునే నిజమైన స్వాతంత్యం లభించినట్టు అని పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తాడిబోయిన హరిప్రసాద్ పేర్కొన్నారు.పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 79వ స్వాతంత్యదినోత్సవ వేడుకలను నిర్వహించిన సందర్భంగా,ముందుగా మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలతో నివాళి అర్పించి,జాతీయగీతం ఆలపించి,జాతీయజెండా ఏగురవేశారు.అనంతరం ప్రజలందరికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో త్యాగధనుల పోరాటంతో లభించిన స్వాతంత్ర్యఫలాలు, ముఖ్యంగా బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం,ఉన్నవారు లేనివారికోసం సహాయ సహకారాలు అందించిననాదే నిజమైన స్వాతంత్రం వచ్చినట్టన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఎండి.ఖుద్దుస్, జొన్నాదుల మహేష్,ఈదర పూర్ణచంద్, అక్కిశెట్టి వెంకటేశ్వరరావు,బోయపాటి అరుణ,రాళ్లపల్లి అనిత, కామేశ్వరి,వసంతం అశోక్,వేమూరి శేషగిరిరావు, పినపాటి రవీంద్ర,మల్లవరపు విజయ్,తవ్వాప్రసాద్,సత్యనారాయణ, రబ్బానీ,వెంకట్,ఎం. శ్రవణ్,కోగంటివెంకటేశ్వరరావు,సాంబయ్య,డేవిడ్,జయకృష్ణ, భాస్కర్,రమణ,కుదరవల్లి శ్రీనివాస్, పెద్దఎత్తున పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహనీయుల త్యాగాలు చిరస్మరణీయం:సబ్ కలెక్టర్

తెనాలి టౌన్ ఆగస్ట్ 15 (ప్రభాతవార్త): దేశ స్వాతంత్రంకోసం తమ ప్రాణాలను సైతం ఫణంగాపెట్టి పోరాడిన యోధులను స్ఫూర్తిగా తీసుకోవాలని సబ్ కలెక్టర్ సంజనా సిన్హా పేర్కొన్నారు.79వ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకలలో తహసీల్దార్ కేవి.గోపలకృష్ణ కార్యాలయం సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయగీతం ఆలపించి,జెండాఆవిష్కరణ చేసి అందరికి స్వాతంత్ర్యదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం కార్యాలయంలోని ప్రతిభచూపిన పలువురు సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించారు.కోర్టుప్రాంగణంలో జెండా ఆవిష్కరణ:పట్టణంలోని కొత్తపేటలోఉన్న కోర్టుప్రాంగణంలో 79వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు జాతీయజెండాను ఆవిష్కరించారు.అనంతరం ఎన్సీసీ క్యాడేట్ల గౌరవవందనం స్వీకరించారు.ఈ కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు,బార్ అసోసియేషన్ అధ్యక్షులు భేతాళ ప్రభాకర్,ఉపాధ్యక్షులు అన్నం పిన్నారావు,కార్యర్శి హరిదాసు గౌరీశంకర్,కోర్టు సిబ్బంది,న్యాయవాద గుమ్మస్తాలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు

తెనాలి టౌన్ ఆగస్ట్ 15 (ప్రభాతవార్త): పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 79 వ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా తెనాలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి డాక్టర్ చందు సాంబశివుడు ఆధ్వర్యంలో జండా ఆవిష్కరణ వేడుకలు నిర్వహించారు.ముందుగా జాతీయగీతం ఆలపించి, మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది కాంగ్రెస్ పార్టీఅని,అంతేకాకుండా దేశానికి రాజ్యాంగం అందించింది,రాజ్యాంగ బద్ద స్వాతంత్ర సంస్థలైన న్యాయవ్యవస్థ,ఎన్నికల సంఘం లాంటివి కూడా ఏర్పాటు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే అని ఆయన పేర్కొన్నారు.అంతేకాకుండా నేడు రాష్ట్రంలో కూడా ఇతర పార్టీల్లో పెద్దనాయకులుగా చెలామణి అవుతున్నవారు కాంగ్రెస్ పార్టీద్వారానే ఎదిగారన్నది గుర్తుంచుకోవాలన్నారు.అలాగే కొన్ని రాష్ట్రల్లో ఇటీవల జరిగిన ఎన్నికలు గమనిస్తే ఎన్నికల సంఘం పాత్రపై అనుమానాలు వస్తున్నాయని,ఎన్నికల సంఘం నిష్పక్షపాతం గా వ్యవహారించట్లేదన్నారు. దీనిపై తమపార్టీ అధినేత రాహుల్ గాంధీ ఆరోపణలపై కేంద్రప్రభుత్వం స్పందించట్లేదన్నారు.ఎన్నికల సంఘం నిష్పక్షపాతం గాఉంటేనే ప్రజాస్వామ్యంకి అర్ధం ఉంటుందని,కాంగ్రెస్ పార్టీ ఒక్కటే ఈదేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుతుందని ఆయన పేర్కొన్నారు.

ఫోటో నెం 5 ను క్రింధి వార్తకు వాడుకోవలెను

## మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం

## ప్రారంభించిన మంత్రి నాదెండ్ల

తెనాలి టౌన్ ఆగస్ట్ 15 (ప్రభాతవార్త):

రాష్ట్రప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన,సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఆగస్ట్15 స్వాతంత్ర్యదినోత్సవం రోజునుండి మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా స్త్రీశక్తిఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని, పట్టణంలోని ఆర్టీసీ డిపోలో, స్థానిక శాసనసభ్యులు,రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రికి డిపో మేనేజర్ రాజశేఖర్, ఉద్యోగులు,మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన బస్సులను ప్రారంభించారు. నాదెండ్ల మాట్లాడుతూ,కూటమి ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా,స్వాతంత్ర్యదినోత్సవం రోజున రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రారంభిస్తున్నందుకు అనందంగా ఉందన్నారు.తమ ప్రభుత్వం ఆడబిడ్డలకు అండగా ఉంటుందన్నారు. మహిళలకు ఆర్థికంగా వెసులుబాటు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందన్నారు.

## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

పిడుగురాళ్ల, ఆగస్టు 15 ప్రభాతవార్తః పిడుగురాళ్ల పట్టణ, మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బాష్యం పబ్లిక్ స్కూల్‌లో జరిగిన వేడుకల్లో గుంటూరు జోనల్ అధికారి హృదయరాజు హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎ ఈశ్వర్, లక్ష్మీ, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే లెనిన్ నగర్ క్రాక్ స్కూల్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా



జరిపారు. విద్యార్థులకు నిత్యావసర సరుకులు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నాగేశ్వరరావు, రామిరెడ్డి, లలితా, అనిత, పుష్పలత, అరుణ, దయామని, కీర్తన, అబ్దుల్ రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

## 17న ఉచిత మెగా వైద్య శిబిరం

పిడుగురాళ్ల, ఆగస్టు 15 ప్రభాతవార్తః కాటూరి మెడికల్ కళాశాల సౌజన్యంతో ఎపీపీ అల్లు సత్యవతి పిచ్చిరెడ్డి, గ్రామ పెద్దల ఆధ్వర్యాన ఈనెల 17వ తేదీన తుమ్మలచెరువులోని ప్రాథమిక పాఠశాలలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు అల్లు పిచ్చిరెడ్డి తెలిపారు. జిల్లాలో మొదటిసారిగా అత్యాధునిక పరికరాలతో ఏర్పాటు చేసిన బస్సులు వైద్య పరీక్షలు చేస్తారన్నారు. సాధారణ వ్యాధులు, గుండె, ఊపిరితిత్తులు, చర్మ వ్యాధులు, ఎముకలకు సంబంధించిన సమస్యలు, కంటిశ/క్లముల పరీక్షలు, స్త్రీలకు సంబంధించిన వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారన్నారు. శిభిరానికి వచ్చే వారు ఆధార్‌కార్డు, ఫోన్ వెంట తీసుకురావాలన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## లాల్‌జాన్‌బాషాకు నివాళులర్పించిన ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, ఆగస్టు 15 ప్రభాతవార్తః మాజీ రాజ్యసభ సభ్యుడు, స్వర్గీయ లాల్‌జాన్‌బాషాకు గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు నివాళులర్పించారు. పట్టణంలో శుక్రవారం ముస్లిం మైనార్టీ నేతలు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని లాల్‌జాన్‌బాషా చిత్రపటకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, ముస్లిం మైనార్టీ నేతలు పాల్గొన్నారు.

## ఉత్తమ తహసీల్దార్‌గా మధుబాబు

పిడుగురాళ్ల, ఆగస్టు 15 ప్రభాతవార్తః పిడుగురాళ్ల మండల తహసీల్దార్ మధుబాబు ఉత్తమ తహసీల్దార్



అవార్డుకు ఎంపికయ్యారు. ఈమేరకు శుక్రవారం నరసరావుపేటలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. రెవెన్యూ సిబ్బంది ఆయన్ను అభినందించారు.

## రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

గురజాల, ఆగస్టు 15 ప్రభాతవార్తః గురజాల పట్టణ, మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీవో మురళీకృష్ణ, కోర్టు భవనాల వద్ద బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటా శ్రీనివాసరావు, డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ జగదీష్, పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఆవుల భాస్కర్, ఎస్ఐలు అనంతకృష్ణ, వినోద్‌కుమార్, నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ శివన్నారాయణ, చైర్మన్ బడేజాని, గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి హేమబిందు, ప్రభుత్వ వైద్యశాలలో సూపరింటెండెంట్ సుధీర్‌బాబు, సాయికర్ణ, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చలమయ్య ఆధ్వర్యాన స్వాతంత్ర్య దినోత్స వేడుకలు జరిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, కౌన్సిలర్ బొల్లయ్య, టీడీపీ నేత శరమాళ్ల హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు చింతా శ్రీనివాసరావు ఆధ్వర్యాన గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## బీసీ సామాజిక వర్గానికి చెందిన బూడిద శ్రీనివాసరావు అక్రమ అరెస్టు

విజయపురిసౌత్, ఆగస్టు 15 ప్రభాతవార్త: మాచర్ల మండలం నాగులవరం గ్రామానికి చెందిన మాచర్ల ఎంపీపీ తనయుడు మాచర్ల వైసీపీ నాయకుడు బూడిద శ్రీనివాసరావవును అక్రమ అరెస్టు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి బీసీ సామాజిక వర్గాలపై కక్ష సాధింపునకు పాల్పడుతుందన్నారు. ఇది చాలా దురదృష్టకర సంఘటన అని బీసీ సంక్షేమ సంఘం నాయకులు పండ్ల మనోజ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రకుల నాయకులపై ఇప్పటివరకు ఎలాంటి కేసులు కానీ, ఆరోపణలు కానీ రాలేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కులాల వారి రాజకీయ ఎదుగుదలను ఓర్వలేని అగ్రకుల నాయకులు ఈ విధంగా తప్పుడు కేసులు బనాయించడం శోచనీయం. పార్టీలకు అతీతంగా ఎందరికో, ఎన్నో సహాయ సహకారాలు అందించిన బీసీ బిడ్డ బూడిద శ్రీనివాసరావుపై తప్పుడు కేసులు బనాయించి అర్ధరాత్రి వేళ, కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అక్రమ అరెస్టు చేసి తీసుకురావడం చట్టవిరుద్ధ చర్య. శ్రీనివాసరావు ఉగ్రవాదా లేక తీవ్రవాదా. అతనిపై ఏం కేసులు ఉన్నాయి. ఎవరు పెట్టారో తెలియజేయకుండా ఇలాంటి ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలకు పాల్పడటం కూటమి ప్రభుత్వానికి సిగ్గుచేటు. దయచేసి ఇప్పటికైనా బీసీ బిడ్డ బూడిద శ్రీనివాసరావును ఎక్కడ దాచారో తెలియజేయవలసిందిగా పోలీసు వారిని కోరారు. పోలీసు వ్యవస్థ మీద పూర్తి నమ్మకం ఉందన్నారు. పోలీసువారు బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటారని ఆశిస్తున్నామన్నారు. ఇలాంటి చర్యలు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆయన అన్నారు.

## జిల్లా ఉత్తమ అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేత

వినుకొండ,ఆగస్టు15,ప్రభాతవార్త: 79వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని నర్సరావుపేట నందు జరిగిన వేడుకల్లో జిల్లాలోని పలువురు అధికారులు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్,జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. జిల్లా ఉత్తమ అధికారులుగా డిఎల్‌డివో వెంకటరెడ్డి, వినుకొండ మున్సిపల్ కమీషనర్ సుభాష్‌చంద్రబోస్, వినుకొండ తహశీల్ధార్ సురేష్‌నాయక్, నూజెండ్ల తహశీల్ధార్ రమేష్‌కుమార్,వినుకొండ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మధుసూదన్‌రావు,మున్సిపల్ ఏఈ ఆదినారాయణ,శానిటరీ ఇన్స్‌పెక్టర్ ఇస్మాయిల్,మండల పరిషత్ జూనియర్ అసిస్టెంట్స్ కృష్ణ, భారతి, ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో ఆంజనేయులు, పంచాయితీ కార్యదర్శి చిట్టిబాబు, ముప్పాళ్ళ గ్రంధాలయ శాఖ అధికారి నాగలక్ష్మిలు ప్రశంసా పత్రాలు అందుకోవడం జరిగింది.

## జిల్లా ఉత్తమ అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేత..........

వినుకొండ,ఆగస్టు15,ప్రభాతవార్త: 79వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని నర్సరావుపేట నందు జరిగిన వేడుకల్లో జిల్లాలోని పలువురు అధికారులు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్,జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. జిల్లా ఉత్తమ అధికారులుగా డిఎల్‌డివో వెంకటరెడ్డి, వినుకొండ మున్సిపల్ కమీషనర్ సుభాష్‌చంద్రబోస్, వినుకొండ తహశీల్ధార్ సురేష్‌నాయక్, నూజెండ్ల తహశీల్ధార్ రమేష్‌కుమార్,వినుకొండ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మధుసూదన్‌రావు,మున్సిపల్ ఏఈ ఆదినారాయణ,శానిటరీ ఇన్స్‌పెక్టర్ ఇస్మాయిల్,మండల పరిషత్ జూనియర్ అసిస్టెంట్స్ కృష్ణ, భారతి, ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో ఆంజనేయులు, పంచాయితీ కార్యదర్శి చిట్టిబాబు, ముప్పాళ్ళ గ్రంధాలయ శాఖ అధికారి నాగలక్ష్మిలు ప్రశంసా పత్రాలు అందుకోవడం జరిగింది.

## పురపాలకసంఘకార్యాలయంలో స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు:

తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట్ 15 (ప్రభాతవార్త): పురపాలకసంఘ కార్యాలయం నందు నిర్వహించిన 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.మున్సిపల్ కార్యాలయ సిబ్బంది సమక్షంలో జాతీయజెండా ఎగరవేసి అమరవీరులకు నివాళులు అర్పించారు.అనంతరం వివిధ మున్సిపల్ విభాగాల్లో పనిచేస్తూ ప్రతిభచూపిన ఉద్యోగులు,సిబ్బందికి చైర్మన్ తాడిబోయిన రాధిక ప్రసంసాపత్రాలు అందించారు.పట్టణ ప్రజలందరికి స్వాతంత్ర్యదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.పలువురు సిబ్బంది పనితీరును ప్రశాంసించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధవార్డుల కౌన్సిల్లర్లు,మున్సిపల్ కమిషనర్ మహాలక్ష్మి ౖపతి, మున్సిపల్ ఇంజనీర్ శ్రీకాంత్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వాణి,మేనేజర్ విల్సన్ జయ, ఆఫీస్ ఇండోర్ అండ్ అవుట్ డోర్ సిబ్బంది సచివాలయ సిబ్బంది మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్యఫలాలు అందరికి చేరువ కావాలి,పట్టణ తెదేపా అధ్యక్షులు హరిప్రసాద్:

తెనాలి టౌన్ ఆగస్ట్ 15 (ప్రభాతవార్త): స్వాతంత్ర్యఫలాలు ప్రజలందరికి చేరువైనరోజునే నిజమైన స్వాతంత్యం లభించినట్టు అని పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తాడిబోయిన హరిప్రసాద్ పేర్కొన్నారు.పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 79వ స్వాతంత్యదినోత్సవ వేడుకలను నిర్వహించిన సందర్భంగా,ముందుగా మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలతో నివాళి అర్పించి,జాతీయగీతం ఆలపించి,జాతీయజెండా ఏగురవేశారు.అనంతరం ప్రజలందరికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## మహనీయుల త్యాగాలు చిరస్మరణీయం:సబ్ కలెక్టర్

తెనాలి టౌన్ ఆగస్ట్ 15 (ప్రభాతవార్త):దేశ స్వాతంత్రంకోసం తమ ప్రాణాలను సైతం ఫణంగాపెట్టి పోరాడిన యోధులను స్ఫూర్తిగా తీసుకోవాలని సబ్ కలెక్టర్ సంజనా సిన్హా పేర్కొన్నారు.79వ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకలలో తహసీల్దార్ కేవి.గోపలకృష్ణ కార్యాలయం సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయగీతం ఆలపించి,జెండాఆవిష్కరణ చేసి అందరికి స్వాతంత్ర్యదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం కార్యాలయంలోని ప్రతిభచూపిన పలువురు సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించారు.కోర్టుప్రాంగణంలో జెండా ఆవిష్కరణ:పట్టణంలోని కొత్తపేటలోఉన్న కోర్టుప్రాంగణంలో 79వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు జాతీయజెండాను ఆవిష్కరించారు.అనంతరం ఎన్సీసీ క్యాడేట్ల గౌరవవందనం స్వీకరించారు.ఈ కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు,బార్ అసోసియేషన్ అధ్యక్షులు భేతాళ ప్రభాకర్,ఉపాధ్యక్షులు అన్నం పిన్నారావు,కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్,కోర్టు సిబ్బంది,న్యాయవాద గుమ్మస్తాలు పాల్గొన్నారు.



# జాతీయ జెండా ఆవిష్కరణ

**జాతీయ జెండాను** ఆవిష్కరించిన మెగాస్టార్ చిరంజీవి 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు హైదరాబాద్ లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో ఘనంగా జరిగాయి. మెగాస్టార్ చిరంజీవి వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. జెండా వందన కార్యక్రమంలో అల్లు అరవింద్, సాయి ధరమ్ తేజ్, సుస్మిత, మెగా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి అందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ షేర్ చేశారు.ప్రతి భారతీయుడికి 79వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. మన పూర్వీకులు సాధించిన ఈ విలువైన స్వాతంత్ర్యాన్ని ఆనందంగా జరుపుకుందాం. ఈ స్వేచ్ఛ మన ప్రతిభ, అభివృద్ధికి బలాన్ని ఇచ్చి, మన దేశం ఎప్పటికీ ముందుకు సాగడానికి దోహదం చేయాలి. జై హింద్ .


# సైమా 2025 గ్రాండ్ ప్రెస్‌మీట్‌లో అల్లు అరవింద్




**సైమా** సక్సెస్ ఫుల్ గా 13వ ఎడిషన్‌కి చేరుకోవడం చాలా ఆనందంగా వుంది. నేషనల్ అవార్డ్ విన్నర్స్‌ని సైమా సత్కరించడం అభినందనీయం: సైమా 2025 గ్రాండ్ ప్రెస్ మీట్ లో నిర్మాత అల్లు అరవింద్ ప్రతిష్ఠాత్మక సైమా 2025 (సైబా సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్) అవార్డ్స్ వేడుక సెప్టెంబరు 5, 6 తేదీల్లో దుబాయ్‌లో అంగరంగవైభవంగా జరగనుంది. ఈ వేడుకలకు సంబంధించిన ప్రెస్ మీట్ హైదరాబాద్‌లో గ్రాండ్ గా జరిగింది.ఈ సందర్భంగా నేషనల్ అవార్డ్ విజేతలైన దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత సాహు గారపాటి(భగవంత్ కేసరి), దర్శకుడు సాయి రాజేష్, సింగర్ రోహిత్ (బేబీ) దర్శకుడు ప్రశాంత్ వర్మ, విజువల్ ఎఫెక్ట్స్ వెంకట్ (హనుమాన్)లని సైమా ఘనంగా సత్కరించింది. ప్రెస్ మీట్‌లో నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ,అందరికీ ధన్యవాదాలు. విష్ణు, బృందాకి కంగ్రాజులేషన్స్ .12 ఏళ్లుగా ఈ వేడుకని విజయవంతంగా నిర్వహిస్తూ ఇప్పుడు 13వ ఎడిషన్‌కి శ్రీకారం చుట్టడం చాలా ఆనందంగా ఉంది. తెలుగు పరిశ్రమకు ఏడు నేషనల్ అవార్డ్స్ వచ్చాయి. ఇండస్ట్రీ స్పందించక ముందే సైమా వారు స్పందించి వారందరినీ ఒక స్టేజి మీద తీసుకొచ్చి సత్కరించాలని అనుకోవడం నిజంగా అభినందనీయం. ఈ సందర్భంగా నేషనల్ అవార్డ్ విజేతలు అందరికీ అభినందనలు. నిజంగా దీన్ని ఒక పండగ లాగా జరుపుకోవాలి. సైమా దీన్ని అద్భుతంగా ముందుకు తీసుకెళుతున్నందుకు వారికి మరోసారి కంగ్రాచ్యులేషన్స్. డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. భగవత్ కేసరి నా కెరీర్‌లో చాలా స్పెషల్ ఫిలిం. సినిమాకి జాతి స్థాయిలో గుర్తింపు రావడం చాలా సంతోషాన్ని ఇచ్చింది. సైమా విష్ణుతో నాకు చాలా మంచి అనుబంధం ఉంది. నాఫస్ట్ మూవీ పటాస్ సినిమాకి ఆయన అవార్డ్ ఇవ్వడం ఇప్పటికీమర్చిపోలేను. ఆ ఫస్ట్ అవార్డ్ నాకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది. లాస్ట్ ఇయర్ భగవంత్ కేసరి సినిమాకి బెస్ట్ ఫిల్మ్ కేటగిరీలో అవార్డు తీసుకున్నాను.. ఇది కేవలం అవార్డులు వేడుకే కాదు నాలుగు భాషల సినీ టాలెంట్ ని కనెక్ట్ చేస్తుంది. డిఫరెంట్ టాలెంట్స్ అన్నీ ఒక వేదిక మీద కలవడం చాలా బ్యూటిఫుల్‌గా ఉంటుంది. చాలా అద్భుతంగా ఈవెంట్ ని సెలబ్రేట్ చేస్తారు. ఈ ఏడాది కూడా అద్భుతంగా జరగబోతుంది. ఈ సందర్భంగా నేషనల్ అవార్డ్స్ విజేతలందరికీ అభినందనలు. నిర్మాత సాహు గారపాటి మాట్లాడుతూ.. ఈ సినిమాకి నేషనల్ అవార్డు వస్తుందని. సినిమాపై అంత నమ్మకం ఉంచినందుకు వారికి కృతజ్ఞతలు. డైరెక్టర్ ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ నేషనల్ అవార్డు వచ్చిన తర్వాత ఇది తొలి సత్కారం. అందరూ నేషనల్ విన్నర్స్‌ని కలవడం చాలా ఆనందంగా ఉంది. ఈ సందర్భంగా విష్ణుకి బృందాకి సైమాకి ధన్యవాదాలు. అవార్డు వచ్చిన వారికే కాదు సినిమా కోసం పని చేసిన అందరికీ అభినందనలు తెలుపుతున్నాను. సైమా టాలెంట్ ని సెలబ్రేట్ చేసుకునే చాలా గొప్ప వేదిక. ఎన్నో గొప్ప సినిమాలు రావడానికి కారణం అవుతున్నందుకు ఈవెంట్ ని ఇంత బాగా ఆర్గనైజ్ చేస్తున్నందుకు బృందా కి విష్ణుకి కంగ్రాజులేషన్స్.

నాకు సౌత్ ఇండియాలో ఉన్న దాదాపు 80 కోలాబరేషన్స్ సైమా వేడుక ద్వారానే వచ్చాయి. సైమా ప్రతి ఏడాది గొప్పగా ముందుకు వెళుతుంది.. అలా అందరికీ తెలిసిన ప్రెస్టీజియస్ అవార్డ్స్‌లో సైమా ముందుంటుంది అది మన తెలుగు రాష్ట్రాల్లో పుట్టడం మనందరికీ ఆనందదాయకం. వేడుకలో పాలుపంచుకోవడం గర్వంగా భావిస్తున్నాను బృందాకి విష్ణుకి కంగ్రాజులేషన్స్ వేడుకల కోసం ఎదురుచూస్తున్నాను. హీరోయిన్ వేదిక మాట్లాడుతూ, ఇక్కడికి రావడం చాలా ఆనందంగా ఉంది. సౌత్ ఇండియన్ టాలెంట్ ని సెలబ్రేట్ చేసుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఇది అవార్డు వేడుక మాత్రమే కాదు సెలబ్రేషన్స్ ఆఫ్ కల్చర్. ఈ ఏడాది నేను పెర్ఫార్మ్ చేస్తున్నాను. హీరోయిన్ ఫారియా అబ్దుల్లా మాట్లాడుతూ, చాలా ఎక్సైటెడ్ గా ఉన్నాము. దుబాయ్‌లో సినిమాని సెలబ్రేట్ చేయడం మోస్ట్ ఎక్సైటింగ్ థింగ్. హీరోయిన్ మంచు లక్ష్మీమాట్లాడుతూ,అందరికి నమస్కారం. సైమా13వ ఎడిషన్ ని సెలబ్రేట్ చేసుకోవడం చాలా ఆనందంగా ఉంది. విష్ణు, బృందాకి కంగ్రాచ్యులేషన్స్. సైమా చైర్ పర్సన్ బృందా మాట్లాడుతూ అందరికి నమస్కారం. మరో రీయూనియన్ కి సైనా సిద్ధమైంది. 13 ఏళ్లంటే లాంగ్ జర్నీ. చాలా బ్యూటిఫుల్ మెమొరీస్ మైల్ స్టోన్స్ ఉన్నాయిసైమా ప్రతి ఏడాది ఇంకా అద్భుతంగా ముందుకుకొనసాగుతోంది. మమ్మల్ని గొప్పగా బిలీవ్ చేసిన అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు. సైమా కేవలం అవార్డు వేడుక కాదు. టాలెంట్ ని కల్చర్ ని సెలబ్రేట్ చేసుకునే గ్లోబల్ స్టేజ్. ప్రతి ఏడాది మేము కొత్త బెంచ్ మార్క్ ని సెట్ చేస్తున్నాము. 13వ ఎడిషన్‌కి చేరుకోవడం చాలా ఆనందంగా ఉంది.

# "శ్రీ కృష్ణ అవతార్ ఇన్ మహోబా"




'అభయ్ చరణ్ ఫౌండేషన్', 'శ్రీజీ ఎంటర్‌టైన్‌మెంట్' సంయుక్తంగా ఒక చారిత్రక మహాకావ్యాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక టైటిల్‌ను తాజాగా అనౌన్స్ చేశారు. "శ్రీకృష్ణ అవతార్ ఇన్ మహోబా" పేరుతో అనిల్ వ్యాస్ నిర్వహణ బాధ్యతలు చూసుకుంటుండగా, కథ, స్క్రీన్ ప్లే , దర్శకత్వం ముకుంద్ పాండే వహిస్తున్నారు.

ఇస్కాన్–ఢిల్లీకి చెందిన సీనియర్ ప్రీచర్ జితామిత్ర ప్రభు శ్రీ ఆశీస్సులతో ఈ నవ్య కావ్యం రూపొందుతోంది. ఇది 1112వ శతాబ్దాల నాటి 'మహోబా' సాంస్కృతిక వైభవాన్ని, అలాగే భగవాన్ శ్రీ కృష్ణుడి దివ్యత్వాన్ని, ధీరత్వాన్ని, ఆధ్యాత్మిక ప్రభావాన్ని చూపించబోతుంది. చలన చిత్ర పరిశ్రమలో తొలిసారిగా శ్రీ కృష్ణుడిని ఒక యుద్ధవీరుడి పాత్రలో చూపించబోయే సినిమా ఇది. 'శ్రీ కృష్ణ అవతార్ ఇన్ మహోబా' ఒక పాన్‌వరల్డ్ ప్రాజెక్ట్‌గా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందుతోంది. ప్రపంచస్థాయి టెక్నీషియన్లతో తెరకెక్కుతున్న ఈ చిత్రం, చరిత్ర, సాంస్కృతిక వారసత్వం, ఆధ్యాత్మికతను కలగలుపుతుంది. ఈ ప్రకటనలో టైటిల్, నిర్మాణ సంస్థలు, మరియు క్రియేటివ్ టీమ్ వివరాలు వెల్లడించారు. నటీనటులు, సాంకేతిక బృందం, ఇతర వివరాలు త్వరలో ప్రకటించబడతాయి.

శ్రీకృష్ణ అవతార్ ఇన్ మహోబా వివరాలు

నిర్మాణ సంస్థలు: అభయ్ చరణ్ ఫౌండేషన్, శ్రీజీ ఎంటర్‌టైన్‌మెంట్,
నిర్మాణ నిర్వహణ: అనిల్ వ్యాస్కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం: ముకుంద్ పాండే ఆశీస్సులు: జితామిత్ర ప్రభు శ్రీ (ఇస్కాన్ – ఢిల్లీ)
సినిమా నేపథ్యం: 1112వ శతాబ్దాల నాటి మహోబా సాంస్కృతిక వైభవం ,శ్రీ కృష్ణుడి పాత్ర .

# 'భీమవరం టాకీస్ 'లో15 చిత్రాలు విడుదల

**అంగరంగ వైభవంగా** అతిరథమహారథుల సమక్షంలో భీమవరం టాకీస్ 15 చిత్రాలు ప్రారంభం కిక్కిరిసిన సారధి స్టూడియోస్ వెల్లువెత్తిన అభినందనలు భీమవరం టాకీస్ పతాకంపై ఇప్పటికే 114 చిత్రాలను నిర్మించి ప్రముఖ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ... ప్రపంచ సినిమా చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో ఒకేసారి 15 చిత్రాలకు శ్రీకారం చుట్టారు. హైదరాబాద్ లోని సారధి స్టూడి యోలో కిక్కిరిసినసినీ అభిమానుల సమక్షంలో జరిగిన ఈ వేడుకకు తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన అతిరధ మహారధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



మురళీమోహన్, రేలంగి నరసింహారావు, సుమన్, శ్రీకాంత్, జె.డి.చక్రవర్తి, తనికెళ్ళ భరణి, 30 ఇయర్స్ పృథ్వి, అజయ్ ఘోష్,సి.కళ్యాణ్, తమ్మా రెడ్డిభరద్వాజ, తుమ్మల ప్రసన్నకుమార్, చదలవాడ శ్రీనివాసరావు, భరత్ భూషణ్, వల్లూరిపల్లి రమేష్ బాబు, దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్, ప్రముఖ రచయిత, రాజ్యసభ సభ్యులు విజయేంద్రప్రసాద్, కె.ఎల్.స్టూడియో అధినేత కొంతం లక్ష్మణ్, గజల్ శ్రీనివాస్, చీకటి ప్రవీణ్, ఇమ్మడి రమేష్, వంశీ రామరాజు, కె.ధర్మారావు, శ్రీమతి గిడుగు కాంతి కృష్ణ తదితర దిగ్గజాలు హాజరై రామసత్యనారాయణను అభినందించారు.

15 చిత్రాలదర్శకుల వివరాలు!..

1) జస్టిస్ ధర్మ: (యండమూరి వీరేంద్రనాథ్), 2) నాగపంచమి :(ఓం సాయిప్రకాష్)

3) నా పేరు పవన్ కల్యాణ్ : (జె.కె.భారవి), 4) టాపర్:(ఉదయ్ భాస్కర్), 5) కె.పి.హెచ్.బి. కాలని : (తల్లాడ సాయికృష్ణ), 6) పోలీస్ సింహం : (సంగకుమార్), 7) అవంతిక 2 (శ్రీరాజ్ బళ్ళా), 8) యండమూరి కథలు: (రవి బసర),9) బి.సి.(బ్లాక్ కమాండో): (మోహన్ కాంత్), 10) హనీ కిడ్స్ (హర్ష) 11) సావాసం, (ఏకరి సత్యనారాయణ)12) డార్క్ స్టోరీస్:(కృష్ణ కార్తీక్),13) మనల్ని ఎవడ్రా ఆపేది (బి.శ్రీనివాసరావు),14) ది ఫైనల్ కాల్: (ప్రణయ్ రాజ్ వంగరి),15) అవతారం: (డా: సతీష్) ఈ 15 చిత్రాలకు 15 కెమెరాలతో క్లాప్, స్విచ్చాన్, గౌరవ దర్శకత్వం చేయించడం విశేషం. తెలుగు సినిమాకు ప్రపంచరికార్డు సాధించేలా ఒకేసారి 15 చిత్రాలు మొదలు పెట్టిన రామసత్యనారాయణను అతిధులంతా అభినందించారు. 2025, ఆగస్టు 15న కొబ్బరికాయలు కొట్టిన ఈ 15 చిత్రాలకు 2026 ఆగస్టు 15కి పూర్తి చేసి గుమ్మడికాయలు కొట్టేందుకు అన్ని సన్నాహాలు చేస్తున్నామని రామసత్యనారాయణ పేర్కొన్నారు. ఈ 15 చిత్రాలకు రీలిస్టూడియోను 25 డిస్కౌంట్ తో ఇస్తున్నందుకు కొంతంకు కృతజ్ఞతలు తెలిపారు. దేశవ్యాప్తంగా పేరొందిన 9 సంస్థలు ఈ ప్రారంభోత్సవాన్ని వరల్డ్ రికార్డ్ బుక్స్ లో నమోదు చేశాయి. ఒకేరోజు మొదలై ప్రపంచ రికార్డ్స్ లో నమోదైన ఈ 15 చిత్రాలకు సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్ అప్పాజీ పి.ఆర్.ఓ. కావడం విశేషం!!

# వెంకటేష్, త్రివిక్రమ్ కలయికలో కొత్త చిత్రం ప్రారంభం

**సినీ ప్రియులంతా** ఎంతగానో ఎదురుచూస్తున్న వెంకటేష్‌త్రివిక్రమ్ కలయికలో చిత్రానికి మొదటి అడుగు పడిందివిక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ కలయికలో చిత్రం కోసం తెలుగు సినీ అభిమానులంతా ఎంతగానో ఎదురుచూస్తున్నారు. తెలుగు సినిమా రంగంలో తమదైన ముద్ర వేసిన ఈ ఇద్దరు ప్రసిద్ధులు ఎట్టకేలకు కొత్త సినిమా కోసం చేతులు కలిపారు. అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చిత్రం నేడు పూజా కార్యక్రమాలతో ప్రారంభించబడింది. దీంతో ప్రేక్షకుల హృదయాల్లో చిరస్మరణీయంగా నిలిచే చిత్రానికి తొలి అడుగు పడింది.సినీ వర్గాలతో పాటు, ప్రేక్షకులలో కూడా వెంకటేష్‌త్రివిక్రమ్ కలయికలో సినిమా పట్ల ఎంతో ఆసక్తి ఉంది. త్రివిక్రమ్ యొక్క ప్రత్యేకమైన కథా శైలి ద్వారా రూపుదిద్దుకున్న పాత్రలో వెంకటేష్ ను చూడటం ప్రేక్షకులకు మరిచిపోలేని అనుభూతిని అందించనుంది. స్వచ్ఛమైన వినోదం, లోతైన భావోద్వేగాలతో నిండిన కుటుంబ కథా చిత్రాలను అందించడంలో త్రివిక్రమ్ పేరుగాంచారు. ఇప్పుడు త్రివిక్రమ్ మరో ఆకర్షణీయమైన, అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చే చిత్రాన్ని అందించడానికి సిద్ధమవుతున్నారు.సుప్రసిద్ధ హారిక హాసిని క్రియేషన్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిత్రీకరణ త్వరలో ప్రారంభం కానుంది.ప్రముఖ నిర్మాత సురేష్ బాబు కెమెరా స్విచ్ ఆన్ చేయడం ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఇది అరుదైన, మాయాజాల కలయికలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు ఇప్పటికే ఆకాశాన్ని తాకుతున్నాయి. త్రివిక్రమ్ శైలి కథలో వెంకటేష్ ను వెండితెరపై చూడటానికి అభిమానులు, సినీ ప్రేమికులు ఎంతో ఆసక్తిగా ఉన్నారు .



# హిందీ రైట్స్ సొంతం చేసుకున్న 'మిరాయ్'

**సూపర్ హీరో** తేజ సజ్జా, కార్తీక్ ఘట్టమనేని, టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పాన్ ఇండియా ఫిల్మ్ 'మిరాయ్' హిందీ రైట్స్ సొంతం చేసుకున్న బాలీవుడ్ లీడింగ్ ఫిల్మ్ మేకర్ కరణ్ జోహార్ ధర్మ ప్రొడక్షన్స్

హనుమాన్ సంచలన విజయంతో దేశవ్యాప్తంగా క్రేజ్ సంపాదించుకున్న సూపర్ హీరో తేజ సజ్జా, ఇప్పుడు కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించిన మోస్ట్ అవైటెడ్ మూవీ 'మిరాయ్'లో సూపర్ యోధగా అలరించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ భారీ స్థాయిలో నిర్మిస్తున్న మిరాయ్ ఈ సంవత్సరం బిగ్గెస్ట్ సినిమాటిక్ ఈవెంట్‌లలో ఒకటిగా మారనుంది.ఉత్సాహాన్ని మరింత పెంచుతూ బాలీవుడ్ లీడింగ్ ఫిల్మ్ మేకర్ కరణ్ జోహార్ 'మిరాయ్' లోకి వచ్చారు. తన ప్రతిష్టాత్మక బ్యానర్ ధర్మ ప్రొడక్షన్స్, మిరాయ్ హిందీ థియేట్రికల్ డిస్ట్రిబ్యూషన్ రైట్స్ సొంతం చేసుకుంది. మిరాయ్ నార్త్ లో మ్యాసివ్ గా రిలీజ్ కానుంది. బాహుబలి, దేవర వంటి తెలుగు బ్లాక్‌బస్టర్‌లతో ధర్మ ప్రొడక్షన్స్ కు సక్సెస్ ఫుల్ ట్రాక్ రికార్డ్ వుంది. ఈ కొలాబరేషన్ మిరాయ్ పై మరింత ఎక్స్ యిట్మెంట్ పెంచింది. ఈ చిత్రం గ్లింప్స్, టీజర్‌కు నేషనల్ వైడ్ గా అద్భుతమైన స్పందన వచ్చింది. మొదటి సింగిల్ వైబ్ ఉంది చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. తేజ సజ్జ సరసన రితికా నాయక్ కథానాయికగా నటిస్తోంది. మిరాయ్‌లో మనోజ్ మంచు విలన్‌గా, శ్రియ శరణ్, జయరామ్, జగపతి బాబు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని మిరాయ్ దర్శకత్వం వహించడమే కాకుండా, సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. అలాగే స్క్రీన్‌ప్లేను కార్తీక్ స్వయంగా రూపొందించారు. మణిబాబు కరణం రచన, సంభాషణలకు కీలకంగా పని చేశారు. గౌర హరి సంగీతం, ఆర్ట్ డైరెక్టర్‌గా శ్రీ నాగేంద్ర తంగాల, ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా సుజిత్ కుమార్ కొల్లి పని చేస్తున్నారు. మిరాయ్ 2డి , 3డి ఫార్మాట్‌లలో ఎనిమిది భాషల్లో సెప్టెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇది ట్రూ పాన్‌ఇండియన్ విజువల్ వండర్‌గా ఉండబోతుంది. తారాగణం: సూపర్ హీరో తేజ సజ్జ, మనోజ్ మంచు, రితికా నాయక్, శ్రియశరణ్, జయరామ్, జగపతి బాబు.




# ఒక పార్వతి ఇద్దరు దేవదాసులు



**మాహిష్మతి ప్రొడక్షన్స్** బ్యానర్ పై తోట రామకృష్ణ దర్శకనిర్మాతగా రూపొందిస్తున్న చిత్రం ఒక పార్వతి ఇద్దరు దేవదాసులుయువతను ఆకట్టుకునేలా ఒక పార్వతి ఇద్దరు దేవదాసులు కథ. పార్వతి దేవదాసుల ప్రేమ కథకు ఎంతటి క్రేజ్ ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సి న పని లేదు. ఈసారి ఒక పార్వతి ఇద్దరు దేవదాసులు టైటిల్ తో ఓ విభిన్నమైన చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

మాహిష్మతి ప్రొడక్షన్స్ బ్యానర్ పై తోట రామకృష్ణ దర్శక నిర్మాత గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సిద్దార్థ మీనన్, దిలీప్ హీరోలుగా రాశి సింగ్ హీరోయిన్ గా నటించారు. రఘు బాబు, కశి రెడ్డి రాజ్ కుమార్, వీర శంకర్, గౌతం రాజు, రాకెట్ రాఘవ, గుండు సుదర్శన్, రవితేజ, రజిత ఇతర కీలక పాత్రలు పోషించారు.

రీసెంట్ గా ఈ సినిమాకు సంబంధించిన చిత్రీకరణ పూర్తయింది.

ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఇటీవల విడుదల చేసిన ఫస్ట్ లుక్ మోషన్ పోస్టర్‌కు చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇదొక కాలేజ్ బ్యాక్ డ్రాప్ లో జరిగే ట్రయాంగిల్ లవ్ స్టోరీ. యువతను ఆకట్టుకునేలా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్టు దర్శకనిర్మాత తోట రామకృష్ణ తెలియజేశారు. సంగీత దర్శకుడు మోహిత్ రహమానియాక్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండగా, ఆస్కార్ విన్నింగ్ లిరిసిస్ట్ చంద్రబోస్ తో పాటు సుద్దాల అశోక్ తేజ, భాస్కరభట్ల ఆకట్టుకునే సాహిత్యం అందించారు.

చిత్రం : ఒక పార్వతి ఇద్దరు దేవదాసుల.

నటీ నటులు : సిద్దార్థ మీనన్, దిలీప్, రాశి సింగ్, రఘు బాబు, కశి రెడ్డి రాజ్ కుమార్, వీర శంకర్, గౌతం రాజు, రాకెట్ రాఘవ, గుండు సుదర్శన్, రవితేజ, రజిత. బ్యానర్ : మాహిష్మతి ప్రొడక్షన్స్
రచన, దర్శకత్వం, నిర్మాత : తోట రామకృష్ణ
మ్యూజిక్ డైరెక్టర్ : మోహిత్ రహమానియాక్
సినిమాటోగ్రాఫర్ : శ్రీనివాసరాజు,
ఎడిటర్ : గన్, గీత రచయితలు : చంద్ర బోస్ (ఆస్కార్ విన్నింగ్ లిరిసిస్ట్), సుద్దాల అశోక్ తేజ, భాస్కర భట్ల,
ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : శరత్ వర్మ,
పిఆర్ఓ : బిరీ (గణేష్, కుమార్) తదితరులు.

# బివిసి బ్యానర్లపై 'మటన్‌సూప్' విడుదల

**రామకృష్ణ వట్టికూటి** సమర్పణలో అలుక్కా స్టూడియోస్, శ్రీ వారాహి ఆర్ట్స్, భవిష్య విహార్ చిత్రాలు(బివిసి) బ్యానర్లపై రామచంద్ర వట్టికూటి తెరకెక్కిస్తున్న 'మటన్ సూప్'టైటిల్ పోస్టర్‌ను విడుదల చేసిన ప్రముఖ నిర్మాత కె.ఎస్.రామారావు రామకృష్ణ వట్టికూటి సమర్పణలో అలుక్కా స్టూడియోస్, శ్రీ వారాహి ఆర్ట్స్, భవిష్య విహార్ చిత్రాలు (బివిసి) బ్యానర్లపై రమణ్, వర్షా విశ్వనాథ్ హీరో హీరోయిన్లుగా రామచంద్ర వట్టికూటి తెరకెక్కిస్తోన్న చిత్రం 'మటన్ సూప్' విట్‌నెస్ ది రియల్ క్రైమ్ ట్యాగ్ లైన్. మల్లిఖార్జున ఎలికా (గోపాల్), అరుణ్ చంద్ర వట్టికూటి, రామకృష్ణ సనపల నిర్మాతలుగా రానున్న ఈ నూతన చిత్రానికి సంబంధించిన టైటిల్ పోస్టర్‌ను ప్రముఖ నిర్మాత కె.ఎస్.రామారావు విడుదల చేశారు.ఇండిపెండెన్స్ డే సందర్భంగా ఆగస్ట్ 15న ఈ నూతన సినిమాకు సంబంధించిన టైటిల్ పోస్టర్, మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీనియర్ నిర్మాత కె.ఎస్.రామారావు మాట్లాడుతూ,పర్వతనేని రాంబాబు సారథ్యంలో అలుక్కా స్టూడియోస్, శ్రీ వారాహి ఆర్ట్స్, భవిష్య విహార్ చిత్రాలు (బివిసి) బ్యానర్లపై రామచంద్ర వట్టికూటి దర్వకత్వంలో రాబోతోన్న చిత్రం 'మటన్ సూవ్'. టైటిల్ పోస్టర్ బాగుంది. చిత్రయూనిట్‌కు ఆల్ ది బెస్ట్. సినిమా పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను అని అన్నారు.చిత్ర నిర్మాత మల్లిఖార్జున ఎలికా (గోపాల్) మాట్లాడుతూ,మా మటన్ సూప్ టైటిల్ పోస్టర్‌ను విడుదల చేసిన లెజెండరీ ప్రొడ్యూసర్ కె.ఎస్.రామారావుకి ధన్యవాదాలు. మా టీం అందరికీ ఆయన ఆల్ ది బెస్ట్ తెలిపారు. త్వరలోనే మేం ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నాం. మంచి చిత్రంతో రాబోతోన్న మా అందరినీ ఆడియెన్స్ ఆదరిస్తారని ఆశిస్తున్నాను అని అన్నారు. హీరో రమణ్ మాట్లాడుతూ, నా ఫ్రెండ్ రామచంద్ర మంచి కథతో 'మటన సూప్' తెరకెక్కిస్తున్నారు. మా టైటిల్ పోస్టర్, మోషన్ పోస్టర్ అద్భుతంగా వచ్చింది. సినిమా అద్భుతంగా వస్తోంది. పగలు రాత్రి అన్న తేడా లేకుండా మేం అంతా కష్టపడుతున్నాం. మేం తీస్తున్న ఈ మంచి చిత్రాన్ని అందరూ ఆదరిస్తారని ఆశిస్తున్నాను అని అన్నారు.చిత్ర దర్శకుడు రామచంద్ర వట్టికూటి మాట్లాడుతూ,రామకృష్ణ వట్టికూటి సమర్పణలో అలుక్కా స్టూడియోస్, శ్రీ వారాహి ఆర్ట్స్, భవిష్య విహార్ చిత్రాలు (బివిసి) బ్యానర్లపై పర్వతనేని రాంబాబు సారథ్యంలో నేను తెరకెక్కిస్తున్న చిత్రం 'మటన సూప్'. నిర్మాత రామకృష్ణ సనపల మాట్లాడుతూ,రియల్ ఇన్సిడెంట్స్ ఆధారంగా చేసుకుని మటన్ సూప్ సినిమాను రూపొందించాం. త్వరలోనే విడుదల చేసేలా సన్నాహాలు చేస్తున్నాం. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ పర్వతనేని రాంబాబు, నిర్మాత అరుణ్ చంద్ర వట్టికూటి, లైన్ ప్రొడ్యూసర్ కొమ్మా రామ కృష్ణ, ఎడిటర్ లోకేష్ కడలి, నటుడు గోవింద్ రాజ్ నీరుడి తదితరులు పాల్గొని కె.ఎస్. రామారావుగాకి ధన్యవాదాలు తెలియజేశారు. నటీనటులు: రమణ్, వర్ష విశ్వనాథ్, జెమినీ సురేష్, గోవింద్ శ్రీనివాస్, శివరాజ్, ఎస్ఆర్‌కే, చరణ్, కిరణ్, గోపాల్ మహర్షి, సునీత మనోహర్, మాస్టర్ విహార్ తదితరులు.



16-8Pg5 9 pg_16-8Pg5.qxd 8/15/2025 10:46 PM Page 1



# భారత్‌కు ప్రపంచ దేశాల శుభాకాంక్షలు

**వాషింగ్టన్, ఆగస్టు 15:** భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రపంచ దేశాల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. అమెరికా, సింగపూర్, మాల్దీవుల నుంచి సందేశాలు అందాయి. భారత్‌తో తమ బంధాన్ని మరింత బలోపేతం చేసుకొంటామని ఆయా దేశాధినేతలు, మంత్రులు పేర్కొన్నారు.

తమ 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని సగర్వంగా నిర్వహించుకుంటున్న భారత ప్రజలకు అమెరికా ప్రజల తరఫున శుభాకాంక్షలు అని ఆ దేశ విదేశాంగ మంత్రి మార్కో రూబియో అన్నారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యమైన్య భారత్, ప్రపంచంలో పురాతన ప్రజాస్వామ్యమైన యుఎస్ మధ్య చారిత్రాత్మక సంబంధం కొనసాగుతోందని, ఉభయ దేశాల సంబంధాలు ఎంతో దృఢమైనవని ఆయన అన్నారు. భారత్, అమెరికా మరింత శక్తిమంతమైన ఒప్పందాలను చేసుకోవడం కోసం ఎదురుచూస్తున్నాయని రూబియో అన్నారు.



భారత ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు, న్యూఢిల్లీ సామాజిక-ఆర్థిక, శాస్త్రీయ, సాంకేతిక, ఇతర రంగాల్లో విజయన్ని సాధిస్తూ.. శరవేగంగా ముందుకు సాగుతోందని రష్యా అధ్యక్షుడు పుతిన్ అన్నారు. ప్రపంచ వేదికపై తగిన గౌరవాన్ని పొందుతోందన్నారు. అంతర్జాతీయ ఎజెండాలోని కీలక సమస్యలను పరిష్కరించడంలో చురుకుగా వ్యవహరిస్తోందని, భారత్‌తో ప్రత్యేక, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని తాము విలువైనదిగా భావిస్తున్నామని ఆయన అన్నారు. తమ ఉమ్మడి ప్రయత్నాల ద్వారా బహుళ రంగాల్లో నిర్మాణాత్మక, ద్వైపాక్షిక సహకారాన్ని మరింత విస్తరించేలా చర్యలు తీసుకుంటున్నామని పుతిన్ అన్నారు.

భారత్‌కు ఇజ్రాయెల్ ఎంబసీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపింది. భారత్, ఇజ్రాయెల్ మధ్య ఉన్న స్నేహబంధం ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నామని పేర్కొంది.

భారత ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. న్యూఢిల్లీ మాల్దీవులకు ఎల్లప్పుడూ విశ్వసనీయ అభివృద్ధి భాగస్వామిగా ఉంటుందని ఆకాంక్షిస్తున్నట్లు మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు తెలిపారు. ఇరు దేశాల మధ్య ఉన్నతస్థాయి సంబంధాలు మరింత ముందుకు వెళ్లాలని ఆయన అన్నారు.

భారత ప్రజలకు సింగపూర్ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వారం ప్రారంభంలో న్యూఢిల్లీతో జరిపిన చర్చలు తమ ఉభయ దేశాల బంధాన్ని మరింత బలోపేతం చేశాయన్నారు. మరిన్ని దౌత్య సంబంధాల కోసం ఎదురుచూస్తున్నామని ఆయన అన్నారు.

దేశ 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ న్యూఢిల్లీలోని ఎర్రకోటపై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ వేడుక కోసం ఎర్రకోట పరిసరాల్లో 11 వేల మంది భద్రతా సిబ్బందిని మోహరించారు. 'నయా భారత్' ఇతివృత్తంతో ఈ స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహించారు.

# చర్చలు విఫలమైతే భారత్‌పై మరిన్ని సుంకాలు

## అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెంట్

**వాషింగ్టన్, ఆగస్టు 15:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య శుక్రవారం అలాస్కాలో జరగనున్న చర్చలు విఫలమైతే భారత్‌పై అదనంగా మరోసారి అమెరికా ప్రభుత్వం సుంకాలు విధిస్తుందని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్ హెచ్చరించారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ ట్రంప్, పుతిన్ మధ్య అలాస్కాలో జరగనున్న చర్చలు అనుకూల ఫలితాలు సాధించడంలో విఫలమైన పక్షంలో భారత్‌పై అదనపు సుంకాలు వడ్డించక తప్పదని ఆయన అన్నారు.



రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై అదనంగా సుంకాలు విధించామని, పరిస్థితి తమకు అనుకూలంగా లేకపోతే భారత్‌పై మరోసారి అదనపు సుంకాలు విధించడమో లేదా ఆంక్షలు విధించడమో తమ ప్రభుత్వం చేపడుతుందని స్కాట్ హెచ్చరించారు. భారత్‌పై మొదట 25 శాతం సుంకాలు విధించిన అధ్యక్షుడు ట్రంప్ రష్యా నుంచి చమురును, ఆయుధాలను కొనుగోలు చేస్తున్నందుకు మరో 25శాతం సుంకాలను జరిమానాగా విధించారు. ఉక్రెయిన్‌తో యుద్ధం సాగిస్తున్న రష్యాకు భారత్ పరోక్షంగా నిధులు సమకూరుస్తోందని అమెరికా ప్రభుత్వం ఆరోపించింది. అమెరికా విధించిన సుంకాలు మొత్తంగా 50 శాతానికి పెరిగి పోవడాన్ని భారత్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఇంత భారీ స్థాయిలో సుంకాలు విధించడాన్ని అన్యాయం, అసంబద్ధంగా భారత్ అభివర్ణిస్తూ తమ జాతీయ ఇంధన భద్రత కోసం చమురు దిగుమతులు అనివార్యమని సమర్థించుకుంది.

# భారత్-పాక్ అణుయుద్ధాన్ని నేనే నివారించా..

## ట్రంప్ నోట మళ్లీ అదే పాతపాట

**అలాస్కా, ఆగస్టు 15:** తనను తాను శాంతి దూతగా ప్రమోట్ చేసుకునేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శతవిధాలా తపనపడుతున్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రపంచంలో చాలా యుద్ధాలను తానే ఆపినట్లు పదేపదే చెప్పుకుంటున్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ పాక్ యుద్ధంపై కూడా పదేపదే కామెంట్స్ చేసారు. ఇరు దేశాల మధ్య అణు యుద్ధాన్ని తానే నివారించానని మీడియా ముందు చెప్పిన ట్రంప్, తాజాగా మరోసారి అదే కామెంట్ చేశారు. భారత్ పాకిస్థాన్ మధ్య సంభవించబోయే అణుయుద్ధాన్ని తానే నివారించానని ప్రకటించారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో అలాస్కాలో జరగబోయే సమావేశం గురించి నిర్వహించిన మీడియా సమావేశంలో ట్రంప్ ఈ కామెం ట్స్ చేశారు. తన అధ్యక్ష పదవీకాలంలో ఆరు నెలల వ్యవధిలో ఆరు ప్రధాన యుద్ధాలు ముగిసాయని ట్రంప్ చెప్పారు. 37 ఏళ్లుగా కొనసాగుతున్న ఒక యుద్ధం, 31ఏళ్లుగా సాగుతున్న కాంగో-రువాండా ఘర్షణతో పాటు మరో నాలుగు యుద్ధాలను కేవలం ఆపడం మాత్రమే కాదు, శాంతిని కుదిర్చినట్లు తెలిపారు. భారత్ పాకిస్థాన్ మధ్య పరిస్థితి అత్యంత ఉద్రిక్తంగా ఉండగా, ఆరు, ఏడు విమానాలు కూలాయని, ఈ క్రమంలో ఇరు దేశాలూ అణుయుద్ధానికి సిద్ధమవగా తానే ఆపినట్లు ట్రంప్ గొప్పలకు పోయారు. ట్రంప్ వాదనలను గతంలోనే భారత్ ఖండించింది. భారత్ పాకిస్థాన్ మధ్య ఎలాంటి మధ్యవర్తిత్వం అవసరం లేదని, ఇది పూర్తిగా ద్వైపాక్షిక అంశమని భారత ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇటీవల భారత ఎయిర్ చీఫ్ మార్షల్ స్టాఫ్ అమర్ ప్రీత్‌సింగ్ మాట్లాడుతూ, ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు చెందిన ఐదు ఫైటర్ జెట్లతో పాటు మరో పెద్ద విమానాన్ని భారత్ కూల్చివేసిందని వెల్లడించారు. అయితే పాకిస్థాన్ ఈ వాదనను తిరస్కరించింది.

# పిఓకేలో వరదలు: 154 మంది మృతి

**ముజఫరాబాద్, ఆగస్టు 15:** పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ ప్రాంతాల్లో కుండపోత వర్షాలతు భీభత్సం సృష్టిస్తున్నాయి. ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలకు భారీ ప్రాణనష్టం సంభవించింది. గడచిన 24 గంటల వ్యవధిలో 154 మంది మృతిచెందినట్లు అధికారులు వెల్లడించారు. అనేకమందికి గాయాలయ్యాయన్నారు. పిఓకేలోని గిల్గిత్ బాల్టిస్టాన్‌లో పలుభవనాలు ధ్వంసం అయ్యాయి. ఖైబర్ ఫక్తుంఖ్వా ప్రావిన్స్‌లోనే అధికమరణాలు సంభవించాయి. బునేర్‌జిల్లాలో 75 మంది మృతి చెందగా, మాన్సెహ్రా జిల్లాలో 17మంది బాజౌర్, బాటాగ్రామ్ జిల్లాల్లో 18 మంది చొప్పున మృతిచెందినట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఖైబర్ ఫక్తూంఖ్వా ప్రావిన్స్‌లో పలు ప్రాంతాల్లో మేఘ విస్ఫోటనం, ఆకస్మిక వరదల ప్రభావంతో పలువురు చిన్నారులు సహా 125 మంది ప్రాణాలు కోల్పోయారు. సహాయక బృందాలు సైన్యం స్థానికులు సహాయక చర్యలు చేపడుతున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అనేక మంది గల్లంతైనందున మృతులసంఖ్య గణనీయంగాపెరుగుతుందని ప్రాదేశిక ఉపద్రవ పర్యవేక్షక సంస్థ అధికారి ఫైజీ తెలిపారు. అనేక ఇళ్లు ధ్వంసం అయ్యాయి. వాహనాలు, స్కూళ్లు, ఆరోగ్యకేంద్రాలు కొట్టుకుపోయాయి. నీలమ్ వ్యాలీ వద్ద ఉన్న పర్యాటకులను సురక్షితంగా



తరలించేందుకు చర్యలు చేపడుతున్నారు. పలు వంతెనలు సైతం కొట్టుకునిపోయాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఇంకా అనేకమంది తప్పిపోయారని మరణాలసంఖ్య మరింతపెరిగే అవకాశం ఉందని ఫైజీ వెల్లడించారు.

# దుబాయ్ వ్యాపారి కిడ్నాప్‌ను ఛేదించిన కేరళ పోలీస్

**మలప్పురం, ఆగస్టు 15:** సొంత రాష్ట్రమైన కేరళకు సెలవుల కోసం వచ్చిన యూఏఈకి చెందిన భారత వ్యాపారి కిడ్నాప్ ఉదంతం సుఖాంతమైంది. ఆయన వద్ద గతంలో పనిచేసిన ఉద్యోగే ఈ కిడ్నాప్‌కు సూత్రధారి అని తేలింది. మలప్పురం, కొల్లాం పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి, కేవలం రెండు రోజుల్లోనే వ్యాపారిని సురక్షితంగా కాపాడి, ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. యూఏఈలో ఫార్మసీ స్టోర్ల చైన్ నడుపుతున్న వీపీ షమీర్ (36) మంగళవారం సాయంత్రం తన బైక్‌పై ఇంటికి వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. మలప్పురంలో రాత్రి 7:45 గంటల సమయంలో కొందరు దుండగులు ఆయనను బలవంతంగా ఒక టయోటా ఇన్నోవా కారులోకి ఎక్కించుకుని అపహరించారు. ఆ తర్వాత, షమీర్ ఫోన్ నంబర్ నుంచే దుబాయ్‌లోని ఆయన బిజినెస్ పార్ట్‌నర్‌కు కిడ్నాపర్లు ఫోన్ చేశారు. షమీర్‌ను విడిచిపెట్టాలంటే రూ.1.5కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలీసులను ఆశ్రయించవద్దని ఆయన భార్యను కూడా బెదిరించారు.

రంగంలోకి దిగిన పోలీ సులు సీసీటీవీ ఫుటేజ్, లొకేషన్ ట్రాకింగ్ ఆధా రంగా దర్యాప్తు ప్రారంభించారు. కిడ్నాపర్ల కారు ఎర్నాకుళం వైపు వెళ్లినట్టు గుర్తించారు. వారికి కారు సమకూర్చిన వారిని ప్రశ్నించడంతో కీలక సమాచారం లభించింది. ఎర్నాకుళంలో షమీర్ ఫోన్ రెండుసార్లు ఆన్ అవ్వడం దర్యాప్తులో పోలీసులకు బాగా ఉపయోగపడింది. మలప్పురం, కొల్లాం పోలీసుల జాయింట్ ఆపరేషన్‌లో నిన్న ఉదయం 11:30 గంటలకు కొల్లాం జిల్లా కురువిక్కోణంలో షమీర్‌ను గుర్తించారు. తమిళనాడుకు తరలించేందుకు కిడ్నాపర్లు ప్రయత్నిస్తుండగా ఒక కారులో ఉన్న ఆయనను పోలీసులు కాపాడారు. ఈ కిడ్నాప్‌తో సంబంధం ఉన్న ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారిలో సూత్రధారి పుతువీట్టిల్ షంషీర్‌తోపాటు హంషీర్, ఫయాస్, అఫ్జల్, మహమ్మద్ నైఫ్, షాహీర్ ఉన్నారు. పోలీసుల విచారణలో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి.

షమీర్ వద్ద గతంలో పనిచేసిన షంషీర్ (30)ను ఉద్యోగం నుంచి తీసేయడంతో కక్షపెంచుకున్నాడు. గతంలోనే బెదిరింపులకు పాల్పడిన అతడు, పక్కా ప్లాన్‌తో ఈ కిడ్నాప్‌కు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. కిడ్నాప్ సమయంలో తనపై దాడి జరిగిందని షమీర్ చెప్పడంతో ఆయనకు వైద్యపరీక్షలు నిర్వహించనున్నారు.

# విద్యార్థుల కోసం మరుగుదొడ్లు నిర్మించిన ఫ్రెంచ్ బృందం




**ఉడుపి, ఆగస్టు 15:** ఫ్రెంచ్ విద్యార్థులు భారతదేశం పట్ల తమ ఇష్టాన్ని చాటుకున్నారు. రెండు నెలల ఇంటర్న్‌షిప్ కోసం వచ్చిన వారు ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలతో మమేకమవ్వడమే కాకుండా ఇండియా పట్ల మమకారాన్ని చూపించారు. భారత్ నుంచి వెళ్లినప్పుడు ఒక జ్ఞాపకంగా మిగిలిపోకూడదనే ఉద్దేశంతో తాము ఉన్న ఊరిలోని పాఠశాలకు అత్యవసరమైన మరుగదొడ్ల సౌకర్యాన్ని నిర్మించి కానుకగా అందజేశారు. ఫ్రాన్స్‌కు చెందిన విద్యార్థుల బృం దం రెండు నెలల ఇంటర్న్‌షిప్ కోసం ఉడుపి జిల్లాలోని కన్యాణ గ్రామం కుద్లు తండాకు వచ్చింది. ఈ క్రమంలోనే స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు పాఠాలు చెప్పడం, సృజన్మాత్మక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాల్లోని రోజూవారీ లైఫ్‌స్టైల్‌తో కలిసిపో యారు. తాజాగా వారి ఇంటర్న్‌షిప్ పూర్తి కావ చ్చింది. దీంతో ఈ ఊరికి కేవలం ఒక జ్ఞాపకంగా మాత్రమే మిగిలిపోకూడదని ఆ బృందం భావించింది. ఎప్పటికీ ఆ గ్రామ ప్రజల మనసుల్లో నిలిచిపోవాలని తాపత్రయపడింది. ఈ క్రమం లోనే పాఠశాలకు అత్యవసరమైన సదుపాయాలను కల్పించాలని నిర్ణయించుకుంది. విద్యార్థుల కోసం పూర్తిస్థాయి మరుగుదొడ్ల సౌకర్యాన్ని సొంతంగా నిర్మించి పాఠశాలకు అందజేశారు. దీనికి సంబంధించిన వీడియోను ఎల్కానీపేరుతో ఉన్న ఒక ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశారు. అందులో ఫ్రెంచ్ విద్యార్థులు పిల్లలతో ఆడుతూ, పాఠాలు చెబుతూ స్నేహపూర్వకంగా మెలుగుతుండటం కనిపించింది. ఇది చూసి నెటిజన్లు ఫ్రెంచ్ విద్యార్థులపై ప్రశంసలు కురిపిస్తున్నారు. వారి సేవాభావం, పిల్లల పట్ల చూపిన మమకారం చూసి మురిసిపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల లోపం వల్ల చదువులో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో, ఈ చిన్న కానుక పెద్ద మార్పు తీసుకురావచ్చని స్థానికులు భావిస్తున్నారు. సరిహద్దులు దాటే దయకు ఇదే నిదర్శనమని కొనియాడుతున్నారు.

# ఐఫోన్‌ను హ్యాక్‌చేస్తే రూ.17.52 కోట్ల రివార్డు

## సవాల్ చేసిన యాపిల్ సంస్థ

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** ప్రపంచవ్యాప్తంగా ఇటీవలికాలంలో మొబైల్‌ఫోన్లను హ్యాకింగ్‌చేసే హ్యాకర్లు ఎక్కువయిపోయారు. సైబర్‌నేరాలు పెరిగిపోతున్నాయి. క్లిక్‌చేస్తేచాలు ఖాతాల్లో సొమ్ములు పోతున్నాయి. మొబైల్‌ఫోన్ సాయంతోనే మొత్తం అన్ని అక్రమాలు సాగిపోతున్నాయి. ఐఫోన్‌ను అయితే ఐఫోన్ మాత్రం ఇందుకు భిన్నంగా తయారవుతోంది. హ్యాకింగ్‌కు వీలుకాని వ్యవస్థలను తమ ఐఫోన్లలో నిక్షిప్తం చేస్తున్నట్లు చెపుతోంది. తమ ఐఫోన్లను హ్యాక్ చేస్తే రూ.17.52 కోట్లు రివార్డు ఇస్తామని యాపిల్ సంస్థ సవాల్‌చేసింది. కంపెనీ సెక్యూరిటీ బౌంటీ(బహుమతి) కార్యక్రమంలో భాగంగా తమ ఐఫోన్ సిస్టమ్స్‌ను బ్రేక్ చేసిన వారికి నగదు బహుమతులను అందిస్తామని ప్రకటించింది. భౌతికపరమైన యాక్సెస్ ద్వారా డివైస్ అటాక్ చేయగలిగితే రూ.1.31 కోట్లు, యూజర్ ఇంటరాక్షన్ ద్వారా నెట్‌వర్క్ అటాక్ చేస్తే రూ.2.18 కోట్లు అందిస్తారు.



# పాక్‌తో అంట కాగుతున్న అమెరికా

## స్వాతంత్ర్యదినోత్సవం రోజున బంపర్ ఆఫర్లు

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** అమెరికాలోని డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం పాకిస్థాన్‌తో వాణిజ్య పరంగా మరింత ముందుకు వెళ్లాలని భావిస్తోంది. కీలకమైన ఖనిజాలు, హైడ్రోకార్బన్‌ల రంగాలలో పాకిస్తాన్‌తో తమ సహకారాన్ని బలోపేతం చేయ డానికి ఎదురు చూస్తున్నట్లు పేర్కొంది. ఇతర అభివృద్ధి చెందుతున్న రంగాలలో ఆర్థిక సహకారంపైనా దృష్టి సారించింది. పాకిస్తాన్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పంపిన అభినందన సందేశంలో తమ ఉద్దేశాన్ని ప్రకటిస్తూ.. అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో ఈ మేరకు ఒక ప్రకటన చేశారు. అమెరికా, పాకిస్థాన్ దేశాల మధ్య నిరంతర సహకార ప్రాముఖ్యతను రూబియో తన ప్రకటనలో హైలైట్ చేశారు. ఆగస్టు 14న పాకిస్తాన్ ప్రజలు తమ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంగా అమెరికా తరపున నేను వారికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను అని రూబియో చెప్పారు. యుఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ విడుదల చేసిన ప్రకటనలో ఈ మేరకు తమ అభిమతాన్ని వ్యక్తపరిచారు. కీలకమైన అంశాలలో, ముఖ్యంగా ఉగ్రవాద నిరోధం, వాణిజ్యంలో పాకిస్తాన్ అభిమతాన్ని కూడా ఆయన అంగీకరించారు. పాకిస్థాన్‌కు కీలకమైన ఖనిజాలు, హైడ్రోకార్బన్‌లు సహా వివిధ రంగాల్లో ఆర్థిక సహకారం అందించేందుకు, కొత్త రంగాలను అన్వేషించడానికి, డైనమిక్ వ్యాపార భాగస్వామ్యాలను పెంపొందించడానికి తాము ఎదురుచూస్తున్నామని రూబియో చెప్పుకొచ్చారు. అంతేకాదు, ఇది అమెరికన్లు, పాకిస్తానీలకు సంపన్న భవిష్యత్తును రూపొందిస్తుంది అని రూబియో అన్నారు. కాగా, జూలై ప్రారంభంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాకిస్తాన్‌తో వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించారు. పాకిస్థాన్‌లో చమురు నిల్వలను అభివృద్ధి చేయడానికి సహకరిస్తామని, ఏదో ఒక రోజు ఇస్లామాబాద్ న్యూఢిల్లీకి చమురును విక్రయించవచ్చని ట్రంప్ చెప్పుకొచ్చారు. ప్రస్తుత రూబియో ప్రకటనకూడా దీనికి అనుగుణంగానే ఉంది.

# బతికుండగానే ఓటరు జాబితాలో చంపేసిన ఎన్నికల అధికారులు!

**పాట్నా, ఆగస్టు 15:** బీహార్‌కు చెందిన ఒక వ్యక్తి చనిపోయినట్లు ఎన్నికల అధికారి నిర్ధారించారు. ఓటరు జాబితా నుంచి ఆయన పేరు తొలగించారు. అయితే తాను బతికే ఉన్నానంటూ ఆ వ్యక్తి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు అలాగే ఎలక్షన్ కమిషన్ (ఈసీ)కు మొరపెట్టుకున్నాడు. భోజ్‌పూర్ జిల్లా అర్రా అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన మింటూ కుమార్ పాస్వాన్ మరణించినట్లు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)లో బూత్ స్థాయి ఎన్నికల అధికారి నిర్ధారించారు. ముసాయిదా ఓటరు జాబితా నుంచి ఆయన పేరు తొలగించారు. కాగా, బీహార్‌లో ఓటరు జాబితా సవరణ కోసం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియలో లక్షలాది మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించడంపై ఆ రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలు మండిపడుతున్నాయి.



# 100 మీటర్ల జాతీయ పతాకంతో సైనికుల తిరంగా యాత్ర

**తవాంగ్(అరుణాచల్), ఆగస్టు 15:** హిమాలయ పర్వత శిఖరాలు జాతీయ జెండాలోని మూడు రంగులతో నిండిపోయాయి. 14,000 అడుగుల ఎత్తులో సైనికులు, స్థానిక గిరిజనులు కలిసి 100 మీటర్ల పొడవైన జాతీయ పతాకాన్ని చేతబూని కదం తొక్కారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్ జిల్లా చునా సరిహద్దు ప్రాంతంలో ఈ అద్భుతమైన, అపూర్వమైన దృశ్యం ఆవిష్కృతమైంది. భారత సైన్యానికి చెందిన గజరాజ్ కార్ప్స్ ఈ తిరంగా యాత్రకు నేతృత్వం వహించింది. ఈ యాత్రలో 160 మంది గోర్ఖా సైనికులు, 25మంది ఇండోటిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) సిబ్బందితో పాటు మాగో, చునావంటి మారుమూల పల్లెల నుంచి సుమారు 150మంది గ్రామస్థులు పాల్గొన్నారు. పసిపిల్లల నుంచి పెద్దల వరకు అందరూ భుజం భుజం కలిపి నడవడంతో ఆ ప్రాంతమంతా కాషాయం, తెలుపు, ఆకుపచ్చ వర్ణాలతో నిండి పోయింది. అసిస్టెంట్ కమిషనర్ ఛుటన్ వాంగ్చు నేతృత్వంలోని సివిల్ అడ్మినిస్ట్రేషన్ ఈ కార్యక్రమంలో గ్రామస్థులను భాగస్వాములను చేసింది. ఈయాత్రలో వారణాసిలోని సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ టిబెటన్ స్టడీస్‌కు చెందిన 23మంది విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు కూడా పాల్గొనడం విశేషం. ఈ భారీ ప్రదర్శన అనంతరం దేశభక్తితో పాటు పర్యావరణ పరిరక్షణ బాధ్యతను కూడా ప్రదర్శించారు. యాత్రలో పాల్గొన్న సైనిక, పౌరవిభాగాలు, గ్రామస్థులు కలిసి ప్లాస్టిక్‌రహిత జోన్ పేరుతో పరిశుభ్రతా కార్యక్రమంచేపట్టారు. ఆ ప్రాంతంలోని వ్యర్థాలను తొలగించి, సున్నితమైన హిమాలయ పర్యావరణ వ్యవస్థను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను చాటిచెప్పారు. ఈకార్యక్రమంపై అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ హర్షం వ్యక్తం చేశారు. శిఖరాగ్ర ప్రాంతాల్లో ఇదే నిజమైన భారతస్ఫూర్తి అని ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా మాగో, చునా గ్రామాల్లోని ప్రతిఇంటిపైనా జాతీయ జెండాను ఎగురవేసి స్థానికులు తమ దేశభక్తిని చాటుకున్నారు. స్వాతంత్రం అనేది అందరి సమష్టి బాధ్యత అని ఈ కార్యక్రమం మరోసారి గుర్తు చేసింది.

# చషోటి వరదల్లో మృతుల సంఖ్య 65

## ఇప్పటికీ ఆచూకీ తెలియని 500 మంది

### అన్నివిధాలా ఆదుకుంటామని మోడీ భరోసా



**శ్రీనగర్, ఆగస్టు 15:** జమ్ముకాశ్మీర్ కొండల్లో నెలకొన్న ఆకస్మిక వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయినవారి సంఖ్య 65కి పెరిగింది. ఆకస్మిక వరదల్లో ఇప్పటికీ 500 మందికిపైగా ఆచూకీ తెలియడంలేదని వెల్లడి అయింది. తీవ్ర గాయాలతో బాధపడుతున్న 167 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కిష్త్‌వార్‌జిల్లాలోని చషోటి గ్రామంలో సంభవించిన ఈ వరదలు ప్రకృతి భయానక వాతావరణాన్ని సృష్టించినట్లు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రులకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఎన్సీ అధినేత ఫరూక్ అబ్దుల్లా 500 మందికిపైగా ఇప్పటికీ అ వరదల్లో చిక్కుకుని ఉంటారని చెపుతున్నారు. ఈ సంఖ్య సుమారు 1000ని దాటవచ్చని మరికొందరు చెపుతున్నారు. తన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ఒమర్ అబ్దుల్లా చషోటి గ్రామం విలయంపై ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ప్రధాని నరేంద్రమోడీ ఇప్పటికే ఈ పరిస్థితిపై వాకబు చేసారని, తనతో ఫోన్‌లోమాట్లాడారని, జమ్ముకాశ్మీర్ విలయంనుంచి రాష్ట్రానికి అవసరమైనంత తోడ్పాటును అందిస్తామని చెప్పారు. మా ప్రభుత్వం, మారాష్ట్రప్రజలు ఈ మేఘవిస్ఫోటనంతో అపారనష్టం చవిచూసారని, అనేక మంది దుర్మరణం పాలయ్యారని, రాష్ట్రచరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా నష్టం సంభవించిందని అన్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, ఆర్మీ సేవలతోపాటు స్థానిక వలంటీర్లుకూడా స్వచ్ఛందంగా సేవల్లోకి వస్తున్నట్లు తెలిపారు. జమ్ముకాశ్మీర్‌ప్రభుత్వం ఇందుకోసం ఒక హెల్ప్‌డెస్క్ ఏర్పాటుచేసింది. గుల్బర్గా పద్దార్‌వద్ద ఈ నంబర్లు ఏర్పాటుచేసింది. 300 మంది సైనిక బృందం సేవల్లో పాల్గొంటున్నది. మృతదేహాల్లో 21 మందిని ఇప్పటివరకూ గుర్తించారు. ఈ మేఘ విస్ఫోటనం కారణంగా మచైల్ మాతా దేవి దర్శనానికి వెళుతున్న యాత్రీకులు ఒక్కసారిగా వరదబారిన పడ్డారు. అనేకమంది ప్రాణాలు కోల్పోవడంతోపాటు మరింతగా గల్లంతయ్యారు. పలు భవనాలు, దుకాణాలు తుడిచిపెట్టుకుపోయాయి. వరదల విషాదంతో మచైల్ మాతాదేవి యాత్రను నిలిపివేసారు.

# సంక్షిప్తంగా..

## చెన్నైలో వైభవంగా స్వాతంత్ర్యవేడుకలు

**చెన్నై, ఆగస్టు 15 ప్రభాతవార్త :** 79వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు చెన్నైలోని అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవనంలో వైభవంగా జరిగాయి. ముందుగా అమరజీవి పొట్టి శ్రీరాములు వి గ్రహానికి నివాళులు అర్పించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార ్యక్ర మానికి ముఖ్య అతిథిగా సామాజిక సేవకులు పూరా ఆంజనేయులు హాజరయ్యారు. ఎంతో మంది త్యాగానికి ప్రతీకే ఈ స్వాతంత్ర్యం అని, వారిసేవలను మనం ఎప్పటికీ మరిచిపోకూడదని పేర్కొన్నారు. ఈ కార ్యక్రమానికి అమరజీవి పొట్టి శ్రీరాములు



స్మారక భవనం కమిటీ సభ్యులు జె.ఎం.నాయుడు, గుడిమెట్ల చెన్నయ్య, పూరా శశికళ, ఆచార్య విస్తారి శంకరరావు తది తరులు పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవ శుభా కాంక్షలు తెలిపారు. అందరికీ మిఠాయిలు పంచారు.

## దక్షిణ కొరియా 'సైన్యం'లో కలవరం



**సియోల్, ఆగస్టు 15:** దక్షిణ కొరియా సైనిక శక్తి గత ఆరేళ్లలో 20 శాతం తగ్గినట్లు అక్కడి రక్షణ శాఖతాజా నివేదిక వెల్లడించింది. ప్రపంచంలోనే అత్యంత తక్కువ జననాల రేటు ఉన్న దేశంలో సైనిక సేవల నమోదు చేసుకుంటున్న వారి సంఖ్య క్రమంగా తగ్గుతోందని తెలిపింది. సైనిక సేవలందించే వారి సంఖ్య క్రమంగా తగ్గుముఖం పట్టడం అధికారుల సంఖ్యలోనూ తగ్గుదలకు కారణమవుతోందని రక్షణ శాఖ వెల్లడించింది. తద్వారా కార్యకలాపాల నిర్వహణ ఇబ్బందిగా మారినట్లు అభిప్రాయపడింది. దక్షిణకొరియా సైన్యంలో చేరేందుకు కనీస వయస్సు 20 యేళ్లు. ప్రభుత్వ లెక్కల ప్రకారం దేశంలో ఈ వయసున్నవారి సంఖ్య 2019-25 మధ్యకాలంలోనే 30 శాతం తగ్గినట్లు అంచనా. 2000 సంవత్సరం మొదట్లో సైన్యం సంఖ్య 6.9 లక్షలుగా ఉండగా ప్రస్తుతం అది 4.5 లక్షలకు తగ్గింది. గడిచిన ఆరేళ్లలోనే సైన్యంలో 20 శాతం (దాదాపు 1.3లక్షలు) క్షీణత కనిపించింది. 2019లో ఈ సంఖ్య 5.63 లక్షలుగా ఉంది. అపె ఉత్తర కొరియాకు మాత్రం భారీ సైనిక శక్తి ఉంది. రక్షణ శాఖ వివరాల ప్రకారం.. 2022లో కిమ్ దాదాపు 12 లక్షల సైన్యాన్ని కలిగి ఉన్నట్లు అంచనా.

## మూడేళ్లుగా ఆస్పత్రిలోనే థాయిలాండ్ యువరాణి



**బ్యాంకాక్, ఆగస్టు 15:** థాయిలాండ్ యువ రాణి బజ్రకిటియభా మూడేళ్ల కిందట ఒక్కసారిగా కుప్పకూలి అస్వస్థతకు గురయ్యారు. ఆమెను ఆ స్పత్రిలో చేర్చగా ఇప్పటికీ చికిత్స పొందుతు న్నారు. అసలు ఆమెకు ఏమైందో ఎవరికీ తెలి యదు. తాజాగా యువరాణి ఆరోగ్య పరిస్థితిపై ఆస్పత్రి వర్గాలు, రాయల్ ప్యాలెస్ ప్రకటన విడుదల చేశాయి. ఆమె ఊపిరితిత్తులు, కిడ్నీలు పూర్తిగా చెడిపోయాయని, వాటిని వైద్య పరికరాల సాయంతో పనిచేసేలా చేస్తున్నామని వైద్యులు తెలిపారు. ఇటీవల వైద్య పరీక్షలు నిర్వహించగా బజ్రకిటియభా రక్తంలో ఇన్ఫెక్షన్ ఉన్నట్లు తేలిం దన్నారు. చికిత్స కొనసాగుతోందని పేర్కొ న్నారు. డిసెంబరు 2022లో ఓ కార్యక్రమంలో భాగంగా పెంపుడు శునకాలకు శిక్షణ ఇస్తోన్న సమయంలో బజ్రకిటియభా ఒక్కసారిగా కుప్ప కూలిపోయారు. దీంతో ఆమెను బ్యాంకాక్‌లోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మూడేళ్ల తర్వాత మళ్లీ హెల్త్ బులెటిన్ బయటి కొచ్చింది.

## ఆస్ట్రేలియాలో రెచ్చిపోయిన ఖలిస్థానీలు

**కాన్‌బెర్రా, ఆగస్టు 15:** ప్రపంచవ్యాప్తంగా భారతీయులు ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించుకుంటున్నారు. ఆస్ట్రేలియాలోని కాన్సులేట్ కార్యాలయంలో కూడా వేడుకలు నిర్వహణకు సిద్ధం కాగా అక్కడకు వచ్చిన ఖలిస్థానీయులు రెచ్చిపోయారు. మెల్‌బోర్న్‌లో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించేందుకు భారతీయులు కాన్సులేట్ వద్ద హాజరయ్యారు. దేశభక్తి గీతాలు పాడుతుండగా కొందరు ఖలిస్థానీలు చొరబడ్డారు. తర్వాత తమ జెండా ఊపుతూ నినాదాలు చేయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో పోలీ సులు జోక్యం చేసు కుని ఎలాంటి ఘర్షణలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకు న్నారు.

కాగా ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోని అల్బనీస్ భారతీయులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సుదీర్ఘ కాలంగా భారత్‌తో తమ స్నేహం కొనసాగు తోందని, న్యూ ఢిల్లీ విజయాన్ని తాము కూడా నిర్వహించుకుం టున్నామని చెప్పారు.

16-08pg6exHMNWJQE 10_16-08pg6exHMNWJQE.qxd 8/16/2025 12:07 AM Page 1



# రైల్వేలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న డిఆర్ఎం గుప్తా

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 15,ప్రభాతవార్త** దేశ స్వేచ్ఛ,స్వాతంత్ర్యం కోసం అలుపెరుగని పోరాటం చేసిన త్యాగధనుల,మహనీయుల ఆశయ సాధనకు ప్రతిఒక్కరు పునరంకితం కావాలని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా అన్నారు. స్థానిక రైల్వే క్రీడా మైదానంలో శుక్రవారం జరిగిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఆనందోత్సహాల మధ్య ఘనంగా జరిగాయి. డిఆర్ఎం సిఎస్ గుప్తా త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి రైల్వే రక్షకదళం,రైల్వే పాఠశాల విద్యార్థులు, భారత స్కౌట్,గైడ్స్ సమర్పించిన గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ కార్మికులకు పంపిన సందేశాన్ని, డివిజన్ సాధిస్తున్న ప్రగతి ఫలాలను వివరించారు. సమావేశంలో అదనపు డిఆర్ఎం సుధాకర్, సిఎంఎస్ డాక్టర్ జివి గోపాల్ రెడ్డి,డిఎస్‌సి ఆకాష్ కుమార్ జైశ్వాల్, రైల్వే మహిళా సంక్షేమ సంఘం డివిజనల్ అధ్యక్షురాలు మమతా గుప్తా వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు, హెచ్‌ఎల్‌ఎన్ ప్రసాద్,మనోజ్, శ్రావణ్ కుమార్, శ్రీనివాస్, వీరయ్య,వై. సందీప్,మంగాచార్యులు, సుదర్శన్ రెడ్డి,చంద్రశేఖర్,డిఆర్ఎం పేషీ సిబ్బంది టి.సాయి ప్రసాద్ రావు,గిరీష్ కుమార్,రవీంద్ర, సాయి,భాస్కర్ రావు, వివిధ విభాగాల సీనియర్ సబార్డినేట్లు,డిపో ఇంచార్ జ్‌లు అధిక సంఖ్యలో రైల్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. రైల్వే ఎస్‌సి కార్యాలయంలో జరిగిన పతాకావిష్కరణ కార్యక్రమంలో రైల్వే ఎస్‌సి రాహుల్ మీనా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఐఆర్‌పిలు బివి నాగేష్‌బాబు,బివి రమణ తదితరులు పాల్గొన్నారు. రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో డివిజనల్ కార్యదర్శి యస్ విజయ కుమార్,ఎంప్లాయిస్ సంఘ్ కార్యాలయంలో డిఎస్ ప్రభాకర్,రైల్వే ఎస్‌సి,ఎస్‌టి అసోసియేషన్‌లో అధ్యక్షుడు సాయిబాబా,డీజిల్ షెడ్, రైల్వేకోర్టు,స్టేషన్,రైల్వే ఉన్నత పాఠశాలలతో పాటు రైల్వేకు చెందిన విభాగాలకు చెందిన డిపోలలో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు.

# పక్కాగా సూపర్ సిక్స్ పథకాలు అమలు

## - మహిళలకు ఉచిత బస్సు ప్రారంభించిన మంత్రి సత్యకుమార్ యాదవ్

## - ఆర్టీసి బస్టాండ్ నుండి కాణిపాకం వరకు ప్రయాణించిన మంత్రి, ఎంపి, ఎమ్మెల్యేలు



చిత్తూరులో స్త్రీ శక్తి మహిళల ఉచిత ఆర్టీసీ ప్రయాణం పథకంను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు

**చిత్తూరు, ఆగస్టు 15 ప్రభాతవార్త:** ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను పక్కాగా అమలు చేయడానికి శ్రీకారం చుట్టినట్లు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్యవిద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం మంత్రి సత్యకుమార్ యాదవ్ ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు, కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలతలతో కలిసి స్త్రీ శక్తి మహిళలకు ఉచిత బస్సు పథకంను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మహిళలతో కలిసి చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్ నుండి బస్సులో కాణిపాకం వరకు ప్రయాణించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల్లో భాగంగా తాము అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ప్రస్తుత సిఎం నారా చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీ మేరకు శుక్రవారం మహిళలు, ఆడపిల్లలు, ట్రాన్స్‌జెండర్లకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ కార్యక్రమంను ప్రారంభిస్తున్నామన్నారు.

ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 2.8 కోట్ల మంది మహిళలు, ఆడపిల్లలు, ట్రాన్స్‌జెండర్లకు ఐదు రకాల ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణ సౌకర్యం వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్, ఇతర తెలుగుదేశం నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# నీట్ యూజి తాత్కాలిక ప్రాధాన్య జాబితా విడుదల

**విజయవాడ,ఆగస్టు 15,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రం లోని ప్రభుత్వ,ప్రైవేటు వైద్య,దంత కళాశాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్/బిడీఎస్ కోర్సుల ప్రవేశానికి విజయవాడ లోని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం తాత్కాలిక ప్రాధాన్య జాబితాను గురువారం రాత్రి విడుదల చేసింది. ప్రవేశాలకు దాదాపు 14వేల పైచిలుకు ధరఖాస్తులు ఆన్‌లైన్‌లో విశ్వవిద్యాలయానికి రాగా,ఇందులో అర్హత లేని అభ్యర్థుల జాబితా,రుసుము చెల్లించి, ధరఖాస్తులు సమర్పించని వారి జాబితా,ధరఖాస్తుల పరిశీలన పెండింగ్‌లో ఉన్న అభ్యర్థుల జాబితాలను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. ఈ తాత్కాలిక ప్రాధాన్యక్రమంలో అభ్యంతరాలుంటే అభ్యర్థి లాగిన్ ఐడీ ద్వారా తెలియచేయాలని రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు. పీజీ డెంటల్ (ఎండీఎస్) సీట్ల కేటాయింపు రాష్ట్రం లోని దంత వైద్య కళాశాల్లో పిజీ డెంటల్ (ఎండీఎస్) కోర్సుల ప్రవేశానికి ఎన్టీ ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నిర్వహించిన మూడో విడత కౌన్సిలింగ్(మాపప్) సీట్ల కేటాయింపుల వివరాలను గురువారం వెల్లడించారు. కన్వీనర్ కోటా కౌన్సిలింగ్‌కు 198 సీట్లను అందుబాటులో ఉంచగా 183 కేటాయించామని, యాజమాన్య కోటాలో 232 సీట్లను అందుబాటులో ఉంచగా 136 సీట్లు కేటాయించినట్లు విశ్వవిద్యాలయ వర్గాలు పేర్కొన్నాయి. సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా కళాశాలల్లో ఈ నెల 20న మధ్యాహ్నం 3 గంటల్లోగా చేరాల్సి ఉంటుంది.

# మద్యం బార్లకు టెండర్లలో పాల్గొనం

## - మద్యం దుకాణాలకు పర్మిట్‌రూమ్‌లిస్తే నష్టమే

## - తిరుపతిలో రాష్ట్ర బార్ల అసోసియేషన్ నేతలు



**తిరుపతి,ఆగస్ట్ 15ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన మద్యం బార్ల విధానం అమలువల్ల బార్లు ఏర్పాటుచేసుకునే వ్యాపారులు తీవ్రంగా నష్టపోవడం తప్పదని పలువురు వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం షాపుల్లో 200 రూపాయలు ఎంఆర్‌పి ఉండే మద్యం సీసా ,బార్లలో అదనంగా 10 రూపాయలు 210 రూపాయలుకు అందిస్తారు. ఈ ధరలపై అధిక ధరకు విక్రయిస్తేనే బార్లు నడపడానికి వీలవుతుందని లేకుండా నూతన మద్యం పాలసీతో మద్యంషాపులకు అనుబంధంగా పర్మిట్‌రూమ్‌లు ఇవ్వడంతో బార్ల వ్యాపారం పడిపోతుందన్నారు. రాష్ట్రప్రభుత్వం తీసుకువచ్చిన నూతన మద్యం బార్ల ఏర్పాటు పాలసీలో ఒక సీరియల్ నంబర్‌కు 4 టెండర్లు వేస్తేనే 20లక్షలు రూపాయలు అదనంగా భారం పడుతుందన్నారు. బార్లకు సరఫరా అయ్యే మద్యంసీసాలు ధరలు కూడా పెంచి విక్రయించేందుకు వీలులేదన్నారు .ప్రస్తుతం మద్యంబార్‌ల పాలసీలో గోడౌన్‌ల ఉండి సరుకు షాపులకంటే 15శాతం అదనంగా భారం పడుతుందన్నారు. నెలసరి ఆదాయం సుమారు 15లక్షలు నష్టం వస్తుందన్నారు. గతంలో 20శాతం మార్జిన్ అనిచెప్పిన ప్రభుత్వం ఇప్పుడు 13శాతం మాత్రమే వస్తుందన్నారు.ఎవరూ కూడా బార్లకు దరఖాస్తులు వేయకూడదని నిర్ణయించారు .టెండర్లను బాయ్‌కాట్ చేయాలని శుక్రవారం తిరుపతిలో జరిగిన బార్ల యజమానుల సంఘం తీర్మానించారు. కొత్తవ్యక్తులు కూడాతొందరపడి టెండర్లు వేసేముందు ఆలోచన చేయాలని ఈ సంఘం కోరారు.

# పులివెందుల, ఒంటిమిట్టలో టిడిపి అరాచకాలు సృష్టించింది

## వైసిపి నేలను టార్గెట్‌గా చేసి దాడులకు తెగబడ్డారు

## వైఎస్సార్సీపి ప్రధాన కార్యదర్శి ఎస్‌వి సతీష్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 15,ప్రభాతవార్త:** పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ అరాచకాలు సృష్టించిందని వైఎస్సార్సీపీ ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వి సతీష్‌రెడ్డి అన్నారు. ఈమేరకు శుక్రవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. "ప్రతి పౌరుడికి ఉన్న ఆస్తి ఓటు.. నిజమైన స్వాతంత్రం అంటే నచ్చిన నాయకుడిని ఎన్నుకోవడమే నన్నారు. పులివెందులలో టీడీపీ వాళ్లు మరణాయుధాలతో దాడులు చేసి చాలామందిని గాయపరిచారు. ఎస్పీని కలిసి పులివెందుల వచ్చే లోపే ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వేల్పుల రాముపై దాడి చేశారు. వారు ఉన్న కారుపై పెట్రోల్ పోసి చంపడానికి యత్నించారు. ఇప్పటికీ వేల్పుల రాము ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇప్పటివరకు ఒక్కరిని కూడా అరెస్ట్ చేయలేదు. తిరిగి మా వాళ్లపైనే ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టారు" అంటూ సతీష్ రెడ్డి నిప్పులు చెరిగారు."గ్రామాల్లో ఉన్న వైఎస్సార్సీపీ నేతలపై కూడా తప్పుడు కేసులు పెట్టారు.11న అర్ధరాత్రి ఎంపీ అవినాష్‌రెడ్డిని అక్రమ అరెస్ట్ చేశారు. వందల కిలోమీటర్లు తిప్పుతూ వేధించారు. నన్ను కూడా అక్రమంగా నిర్బంధించారు. జడ్పీటీసీ ఎన్నిక కోసం 700 మంది పోలీసులను పెట్టారు. 3 వేల మందికిపైగా టీడీపీ గూండాలను పులివెందులలో దింపారు. వారికి పోలీసులు కొమ్ము కాశారు. పోలింగ్ బూతులకు ఓటర్లను రాకుండా అడ్డుకున్నారు. వచ్చిన ఓటర్లను బెదిరించి స్లిప్పులు లాక్కున్నారు. 13 బూత్లోకి మీడియాను కూడా అనుమతించలేదు 'పులివెందుల్లో స్వేచ్ఛగా ఎన్నిక జరిగిందని ఎల్లో మీడియా రాయడం విడ్డూరం. వైఎస్ జగన్ రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుంచి పులివెందుల్లో ఏనాడు ఎన్నికల్లో అక్రమాలు జరగలేదు. టీడీపీ ఏనాడు ఎన్నికల్లో పులివెందుల్లో అక్రమాలు జరిగాయంటూ ఫిర్యాదు చేయలేదు. 700 మంది పోలీసులు బూత్లను స్వాధీనం చేసుకుని దొంగ ఓటర్లతో పోలింగ్ చేయించారు. దొంగ ఓట్లతో గెలిచిన వ్యక్తిని సీఎం సతీమణి అభినందించడం దారుణం" అని సతీష్‌రెడ్డి మండిపడ్డారు.

# నేటి నుంచి సీమలో రైల్వే ట్రాక్ వేగ నిర్ధారణ పరీక్షలు

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 15,ప్రభాతవార్త** రాయలసీమ జిల్లాలలోని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ పరిధిలో పలు సెక్షన్‌లలో రైళ్ల గరిష్ట వేగాన్ని పెంచేందుకు రైలు మార్గం పటిష్టత, సామర్థ్య, నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ నెల 16న సికింద్రాబాద్-వాడి-గుంతకల్లు మధ్య ఈనెల 18న గుంతకల్లు- ధర్మవరం-19న గుంతకల్లు-రేణిగుంట-గుంతకల్లు,

20న గుంతకల్లు- వాడి- సికింద్రాబాద్ మార్గాలలో ప్రస్తుతం ఉన్న రైళ్ల గరిష్ట వేగం 110కి.మీ నుండి 130కి.మీలకు పెంచేందుకు ముందుగా రైలు ట్రాక్ సామర్థ్యాన్ని నిర్ధారించేందుకు ప్రత్యేక బోగీలో అమర్చిన ఓఎంఎస్ యాంత్ర సహాయంతో రైలు మార్గం సామర్థ్యాన్ని నిర్ణయించేందుకు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ ట్రాక్ ఇంజనీర్, సంబంధిత అధికారులు ప్రత్యేక రైలులో పర్యటించి గరిష్ట వేగాన్ని నిర్ణయించిపై అధికారులకు నివేదించారు. ఈ నివేదిక ఆధారంగా సంబంధిత ఉన్నతాధికారులు ఆయా సెక్షన్లలో రైళ్ల గరిష్ట వేగాన్ని పెంచేందుకు నిర్ణయం తీసుకుంటారు.

# నేడు కృష్ణాష్టమి వేడుకలు - క్యూలైన్లన్నీ ఉచితం



హారం అందించిన దాతకు దుర్గమ్మ చిత్రపటం అందిస్తున్న దృశ్యం



దుర్గమ్మకు బంగారు హారం

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 15, ప్రభాతవార్త** శనివారం శ్రావణబహుళ అష్టమి పర్వదినం శ్రీ కృష్ణాష్టమి వేడుకలను దుర్గమ్మ ఆలయంలో వేడుకగా నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు అనివేటి మండపము నందు శ్రీకృష్ణభగవానునికి పూజాదికాలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 5 గంటలకు దేవస్థాన పురాణపండితులు ప్రవచనం చెబుతారన్నారు. సాయంత్రం 6.30 ఉట్టికొట్టే కార్యక్రమం వుంటుందన్నారు. భక్తులెల్లరు పాల్గొని శ్రీ స్వామివార్ల కృపకు పాత్రులవ్వాలన్నారు. - క్యూలైన్లన్నీ ఉచితం: దుర్గమ్మవారి ఆలయంలో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అన్ని క్యూలైన్లు ఉచితం అంటూ ఇఓ నిర్ణయం తీసుకున్నారు. ఉదయం 10 నుండి సాయంత్రం 3 వరకు భక్తుల సౌకర్యార్థం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఇఓ తెలిపారు. - దుర్గమ్మవారికి బంగారుహారం: దుర్గమ్మవారికి విజయవాడకు చెందిన వి శ్రవణ్‌కుమార్ శుక్రవారం నాడు 82గ్రాముల బంగారు హారాన్ని కానుకగా సమర్పించారు. దాతలకు స్వామి అమ్మవార్ల దర్శనం ఏర్పాటు చేసి, అనంతరం వేదపండితులచే వేదాశీర్వచనం, శ్రీఅమ్మవారి వస్త్రం, శ్రీఅమ్మవారి చిత్రపటం అందచేశారు.

# మంత్రిచే గోడపత్రికలు, బ్రోచర్ల ఆవిష్కరణ



కాణిపాకం బ్రహోత్సవాల గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న మంత్రి ఆనం, కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే మురళీమోహన్‌లు.

**కాణిపాకం, ఆగస్టు 15 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో జరుగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు సంభందించి ముద్రించిన గోడపత్రికలు, బ్రోచర్లను రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేతుల మీదుగా గురువారం రాత్రి ఆవిష్కరించారు. దేవస్థానంలో ఈనెల 27 నుండి సెప్టెంబర్ 16 వరకు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు 21 రోజుల పాటు జరుగనున్నాయి. తిరుపతి పద్మావతి అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, కాణిపాకం ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్‌లతో కలసి బ్రహ్మోత్సవాల ప్రచారంలో భాగంగా దేవస్థానం ముద్రించిన గోపడపత్రికలు, బ్రోచర్లను మంత్రి రామనారాయణరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం దేవస్థానం తరఫున అర్చకులు, వేపదండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి చిత్రపటాన్ని, శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు.ఈకార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, స్థానాచార్యులు పణిస్వామి, వేద పండితులు పాల్గొన్నారు. కాణిపాకం బ్రహ్మోత్సవాలు భక్తి ఆధ్యాత్మికతలకు ప్రతీకగా నిలుస్తాయని బ్రహ్మోత్సవాలకు ప్రతి ఏడాది లక్షలాది మంది భక్తులు కాణిపాకం వచ్చి వినాయకుని దర్శించుకుంటారని తెలిపారు.

వినాయక చవితి పర్వదినం అనేది ఐక్యత, శ్రద్ధ, శుభారంభానికి సంకేతమని ప్రజల జీవితాల్లో సద్గుణాలను పెంపొందించే పర్వదినమని మంత్రి పేర్కొన్నారు. కాణిపాకం ఆలయ ప్రత్యేక చరిత్ర, ఆలయంలో స్వయంభువుగా వెలసిన వినాయకుని విశిష్టత దేశవ్యాప్తంగా భక్తులను ఆకర్షిస్తోందని చెప్పారు.

# అద్భుతాలన్నీ మహిళలతోనే సాధ్యమవుతాయి: మంత్రి నారా లోకేష్

**విజయవాడ,ఆగస్టు15,ప్రభాతవార్తప్రతినిధి:** అద్భుతాలన్నీ మహిళలతోనే సాధ్యమవుతాయని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని పేర్కొన్నారు. శుక్రవారం స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా స్త్రీ శక్తి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తోపాటు మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ ఆవకాయ పట్టాలన్నా.. అంతరిక్షంలోకి వెళ్లాలన్నా.. అది మహిళలతోనే సాధ్యమవుతుందన్నారు.భూమి కంటే ఎక్కువ భారం మోసేది మహిళలేనన్నారు. మహిళల అభ్యున్నతికి పాటు పడుతున్నది టీడీపేనేనని పేర్కొన్నారు. మహిళలకు ఆస్తిలో సగం వాటా అమలు చేసింది కూడా టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ అని గుర్తు చేశారు. మహిళల పేరిట ఇళ్ల పట్టాలు, సంక్షేమ పథకాలు అమలు చేసింది సీఎం చంద్రబాబేనని చెప్పారు. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసింది కూడా సీఎం చంద్రబాబే అన్నారు. మహిళలను అన్ని విధాలా అభివృద్ధి చేసేలా చంద్రబాబు చర్యలు తీసుకున్నారని వివరించారు. మహిళలను కించ పరిచేలా సీరియళ్లు ,చిత్రాలు రాకుండా చట్టాన్ని తీసుకురావాలని తాను ప్రభుత్వాన్ని కోరుతున్నానన్నారు.

ముఖ్యమంత్రిగా చంద్రబాబు కొత్త ఒరఒడిని ప్రారంభించారన్నారు. ప్రజలు ఆనందంగా ఉంటే చాలు.. అదే కోటి వరాల జల్లు అని సీఎం చంద్రబాబు భావిస్తారని తెలిపారు. హ్యాపినెక్స్ట్ ఇండెక్స్‌ను అమలు చేస్తున్నది సీఎం చంద్రబాబేనని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. మహిళలకు ప్రత్యేక వర్సిటీ ఏర్పాటు చేసిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతోందని గుర్తు చేశారు. మహిళలకు సాధికారత కల్పించిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడేదని తెలిపారు. కొంత మంది మహిళలను కించపరిచేలా మాట్లాడుతున్నారంటూ వైసీపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సాక్షిగా తన తల్లిని అవమానించారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. సొంత చెల్లితో రాఖీ కట్టించుకోని అన్న.. మహిళల గురించి మాట్లాడుతున్నారంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై మండిపడ్డారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తోలు తీస్తామని హెచ్చరించారు. గతంలో మద్యపాన నిషేధం చేస్తానని ఓ రాక్షసుడు చెప్పాడన్నారు. కానీ..జే బ్రాండ్స్ తీసుకొచ్చి ప్రజల ప్రాణాలు తీశారంటూ గత వైసీపీ ప్రభుత్వంపై మండిపడ్డారు. తల్లి,చెల్లిని పట్టించుకోని వ్యక్తి..ఇతర మహిళలకు న్యాయం చేస్తారా? అంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. తల్లి మీద కేసు గెలిస్తే.. సంబరాలు చేసుకున్నారంటూ వైసీపీ అధినేత వైఎస్ జగన్‌పై మంత్రి లోకేష్ నిప్పులు చెరిగారు. తల్లి చెల్లికి న్యాయం చేశాకే నా గురించి మాట్లాడాలని వారిని కోరుతున్నానంటూ వైసీపీ అగ్రనాయకత్వానికి లోకేష్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర చీఫ్ పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ.. మహిళా సాధికారతకు ఉచిత బస్సు ప్రయాణం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఇవ్వడమే కానీ.. తీసుకోవడం తెలియని గొప్ప వారు మహిళలని ఈ సందర్భంగా ఆయన అభివర్ణించారు. స్త్రీ లకు ఎంతగానో ఉపయోగపడే పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభిస్తున్నారని పేర్కొన్నారు. ఉచిత బస్సు ప్రయాణానికి వచ్చిన నారా లోకేష్‌ను విద్యార్ధినిలు చుట్టూముట్టి ఆయనకు థ్యాంక్స్ చెప్పారు.ఆయన వారిని అనురాగంతో రాఖీలు కట్టారు.ఆయనకు రాఖీలు కట్టారు.

# స్వాతంత్ర్యదిన వేడుకల్లో ప్రతి శకటం.. ప్రగతి రథానికి మకుటం

## -స్వర్ణాంధ్ర 2047 సంకల్పాన్ని చాటిచెప్పిన శకటాలు..



ప్రథమ బహుమతి పొందిన పట్టు పరిశ్రమశాఖ శకటం



ద్వితీయ బహుమతి పొందిన మహిళాభివృద్ధి శాఖ శకటం



తృతీయ బహుమతి పొందిన మెప్మా శకటం

**విజయవాడ,ఆగస్టు15,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ మైదానంలో శుక్రవారం ఘనంగా జరిగిన 79వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల జరిగాయి.ఈ సందర్భంగా ప్రదర్శించిన వివిధ శాఖల అలంకృత శకటాలు అలరించాయి. స్వర్ణాంధ్ర 2047 సాకారం దిశగా వేస్తున్న అడుగుల్లో భాగంగా అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో ప్రగతిని చాటిచెప్పేలా శకటాల ప్రదర్శన సాగింది.

మొత్తం 21 శాఖలు, విభాగాలకు చెందిన శకటాలు అతిథులను ఆకట్టుకున్నాయి. పేదరికం లేని సమాజ నిర్మాణం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా రూపొందించిన ప్రణాళిక శాఖ పీ4 (పబ్లిక్, ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యం, పేదరిక నిర్మూలన కార్యక్రమం) శకటం సుసంపన్న, ఆరోగ్య, ఆంధ్ర దార్శనికతను ప్రతిబింబించింది. అదేవిధంగా వేడుకల్లో సీఆర్‌డీఏ, అమరావతి (కాలాతీత వారసత్వం నుంచి ప్రపంచ స్థాయి భవిష్యత్తు వరకు), పరిశ్రమల శాఖ (స్వర్ణాంధ్ర 2047 ప్రతి భాగస్వామ్యం పెట్టుబడులను పెంచే చోట), పౌరసరఫరాల శాఖ (దీపం2), ఆర్‌టీజీఎస్ (రియల్‌టైమ్ ఇంటెలిజెన్స్ ద్వారా స్మార్ట్ గవర్నెన్స్, క్వాంటం వ్యాలీ, వాట్సాప్ గవర్నెన్స్), జల వనరుల శాఖ (హంద్రీనీవా సుజల స్రవంతి పోలవరం), పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ (పేదల సేవలో అడవితల్లి బాట), స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ (ఎస్‌ఏఎస్‌ఏ వృత్తాకార ఆర్థిక వ్యవస్థ వ్యర్థ పదార్థాలు, చెత్త నుంచి రీ సైక్లింగ్, పునర్వినియోగం), అటవీ శాఖ (హరితాంధ్ర వన్యప్రాణుల సంరక్షణ, సుస్థిర అభివృద్ధి), రవాణా శాఖ (స్త్రీ శక్తి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం), మౌలిక వసతులు, పెట్టుబడులు, మారిటైమ్ బోర్డు (ఆంధ్రప్రదేశ్ లాజిస్టిక్ హబ్ ఆఫ్ ఈస్ట్), ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ (యోగాంధ్ర ఆరోగ్యాంధ్ర), విద్యా శాఖ (ఆంధ్రా మోడల్ ఎడ్యుకేషన్), వ్యవసాయ శాఖ (ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ సహజ వ్యవసాయ నిర్వహణ), సెర్ప్ (25 వసంతాల వెలుగు ప్రస్థానం పేదరికం నుంచి పారిశ్రామికవేత్తగా), మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ (మహిళల రక్షణ భద్రత సాధికారత మా ప్రభుత్వ ధ్యేయం), చేనేత మరియు జౌళి శాఖ (ఒక జిల్లా ఒక ప్రొడక్ట్), పట్టుపరిశ్రమ శాఖ (మేరా రేషం మేరా అభియాన్ ఆకు నుంచి వస్త్రం వరకు స్థిరమైన పట్టు వైపు), పర్యాటక శాఖ (క్రాఫ్టింగ్ అనుభవం, జ్ఞాపకాలను సృష్టించడం), మెప్మా (డిజిటల్ ప్రేరణతో సమష్టిగా సాధికారత పొందిన ఒక కుటుంబం ఒక వ్యవస్థాపకుడు), ఇంధన శాఖ (పునరుత్పాదక శక్తి హైడ్రోజన్ గ్రీన్ ఎనర్జీ భవిష్యత్ శక్తి) శకటాలు వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నా పట్టు నా అభిమానం నినాదంతో పట్టుశాఖ రూపొందించిన శకటం మొదటి బహుమతి సాధించింది. స్వర్ణాంధ్ర లక్ష్య మార్గంలో మహిళల సాధికారతను పెంపొందిస్తూ, పారిశ్రామిక రంగంలో యువతను ప్రోత్సహిస్తూ, గిరిజనుల జీవవైవిధ్యాన్ని పరిరక్షిస్తూ, పట్టు పరిశ్రమ గ్రామీణ ముఖచిత్రాన్ని మారుస్తోంది.

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ శకటానికి రెండో బహుమతి లభించింది. తెలుగువీర మహిళా జయహో.. నినాదంతో ఆడబిడ్డకు భద్రత కల్పిస్తూ, వారి జోలికి వస్తే శిక్ష తప్పదంటూ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ శకటాన్ని ప్రదర్శించింది. మెప్మా శకటానికి తృతయ బహుమతి లభించింది.

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా ఒక కుటుంబం ఒక వ్యాపారవేత్త నినాదంతో 30 వేల మంది పట్టణ మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్ది, వారు ఆర్థికంగా, సామాజికంగా సాధికారత సాధించేందుకు మెప్మా

# తిరుమల ఆలయ అధికారులకు వెండి డాలర్లు



**తిరుమల,ఆగస్ట్ 15ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో పలు రకాలుగా భక్తులకు సేవలందిస్తున్న వివిధ హోదాల్లోని అధికారులు, విజిలెన్స్, ఉద్యోగులకు గుర్తింపుగా వెండి డాలర్లు,ప్రశంసాపత్రాలు అందజేశారు. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒచిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి,జెఇఒ వీరబ్రహ్మం ఐదుగ్రాముల వెండి డాలర్ అందజేశారు. వీరిలో విజిలెన్స్ విఎస్‌ఒ ఎన్టీవిరామ్‌కుమార్, శ్రీవారి ఆలయ ఏవిఎస్‌ఒ రాజశేఖర్, ఏవిఎస్‌ఒ శ్రీనివాసరావు, ఛైర్మన్ పిఎస్ ప్రసన్నకుమార్ ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు

తెనాలి టౌన్ ఆగస్ట్ 15 (ప్రభాతవార్త): పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 79 వ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా తెనాలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ఛార్జి డాక్టర్ చందు సాంబశివుడు ఆధ్వర్యంలో జండా ఆవిష్కరణ వేడుకలు నిర్వహించారు. ముందుగా జాతీయగీతం ఆలపించి, మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది కాంగ్రెస్ పార్టీఅని, అంతేకాకుండా దేశానికి రాజ్యాంగం అందించింది, రాజ్యాంగ బద్ద స్వాతంత్ర్య వ్యవస్థలు, ఎన్నికల సంఘం లాంటివి కూడా ఏర్పాటు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే అని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా నేడు రాష్ట్రంలో కూడా ఇతర పార్టీల్లో పెద్దనాయకులుగా చెలామణి అవుతున్నవారు కాంగ్రెస్ పార్టీద్వారానే ఎదిగారన్నది గుర్తుంచుకోవాలన్నారు. అలాగే కొన్ని రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన ఎన్నికలు గమనిస్తే ఎన్నికల సంఘం పాత్రపై అనుమానాలు వస్తున్నాయని, ఎన్నికల సంఘం నిష్పక్షపాతం గా వ్యవహరించట్లేదన్నారు. దీనిపై తమపార్టీ అధినేత రాహుల్ గాంధీ ఆరోపణలపై కేంద్రప్రభుత్వం స్పందించట్లేదన్నారు. ఎన్నికల సంఘం నిష్పక్షపాతం గాఉంటేనే ప్రజాస్వామ్యంకి అర్థం ఉంటుందని, కాంగ్రెస్ పార్టీ ఒక్కటే ఈదేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా కొలకలూరు కి చెందిన మల్లవరపు ప్రసాద్ ని నియమించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొన్నూరు నాగ సూర్య శేఖర్ రావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లవరపు ప్రసాద్, పెసుగొండ శివకుమార్, స్టీవెన్ బాబు, తోలిమెట్ల అనిల్ శీలం శ్రీనివాస్, అరిగె వెంకటేష్, భీమరమేష్, చందువయ్యప్ప, కోటేశ్వరరావు, కృష్ణ, శ్రీను మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు

## ఉత్తమ తహసీల్దార్ గా గోపాలకృష్ణ

తెనాలి టౌన్ ఆగస్ట్ 15 (ప్రభాతవార్త): తహసీల్దార్ గా ఉత్తమసేవలు అందించినందుకు తెనాలి మండల తహసీల్దార్ కే.వి.గోపాలకృష్ణ కు ప్రశంసాపత్రం లభించింది. తహసీల్దార్ గా ఏడాది కాలంలో



చేసిన సేవలు, రైతు సమస్యల పరిష్కారంలో చేసిన కృషికి గుర్తింపుగా, రెడ్ క్రాస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో, సబ్ కలెక్టర్ సంజనా సిన్హా చేతులమీదుగా ఈ ప్రశంసాపత్రం అందించారు. ఈ సందర్భంగా బహుమతి గ్రహీత, తహసీల్దార్ కే.వి.గోపాలకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రశంసాపత్రం తో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఈ సందర్భంగా పలువురు తహసీల్దార్ గోపాలకృష్ణ ను అభినందించారు.

## ఘనంగా స్వాతంత్య్ర వేడుకలు

కొల్లూరు, ఆగస్టు 15 (ప్రభాతవార్త): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం విధుల సక్రమంగా నిర్వహించిన సందర్భంగా కొల్లూరు మండలం అనంతవరం శాఖ గ్రంథాలయాధికారిని గుండతోట కనకదుర్గకు బాపట్ల జరిగిన స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి



గొట్టిపాటి రవికుమార్, బాపట్ల ఎమ్మెల్యే వేగేసిన నరేంద్రవర్మ, జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి, జిల్లా ఎస్పీ తుషారా డూడి, జిల్లా స్థాయి అధికారుల సమక్షంలో ఉత్తమ గ్రంథాలయాధికారిగా అవార్డు, ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కనకదుర్గ విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థలో ఉత్తమ ఉద్యోగిగా అవార్డుకు ఎంపిక అయినందుకు ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వందనా సుబ్రహ్మణ్యం, ఝాన్సీలక్ష్మీ, గ్రేట్ వన్ లైబ్రరీలు, కార్యాలయ సిబ్బంది తదితరులు ఆమెను అభినందించారు. కార్యాలయ సిబ్బంది అభినందించారు.

కొల్లూరు, ఆగస్టు 15 (ప్రభాతవార్త): భారతదేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం కొల్లూరులోని మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయం, స్థానిక స్టేట్ బ్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన జాతీయ జెండాను కొల్లూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ ఆవిష్కరించారు. తొలుత స్వాతంత్ర్య సమరయోధులకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గోరికపూడి ప్రసాద్, కానూరిని మోహన్, పెదపూడి నాగరాజు, పోతార్లంక కుటుంబరావు, బుర్రి జగన్, కట్టా శ్రీనివాస్, గాదె చంటి, ఈమని పవన్, ఈమని మణికంఠ, కుర్ర సత్యనారాయణ, గోగినేని చంద్రం, అనిల్, మరియు తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొల్లూరు, ఆగస్టు 15 (ప్రభాతవార్త): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సందర్భంగా శుక్రవారం మండల కేంద్రమైన కొల్లూరులోని తహశీల్దార్ కార్యాలయం వద్ద కొల్లూరు మండల తహశీల్దార్ వెంకటేశ్వర్లు, స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై జానకి అమరవర్ధన్, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ నాంచారమ్మ, శ్రీసాయి వాసవి స్కూల్ వద్ద డైరెక్టర్ శ్రీనివాసరావు, ఫోర్ వ్రంట్ ఇంటర్నేషనల్ స్కూల్ వద్ద ప్రిన్సిపాల్ అనితకుమారి రాజన్, అదే విధంగా మండల పరిధిలోని పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలలో జాతీయ జెండాలను ఎగురవేశారు.

## స్త్రీ శక్తి పథకాన్ని వేమూరులో ప్రారంభించిన ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

కొల్లూరు, ఆగస్టు 15 (ప్రభాతవార్త): స్త్రీ శక్తి పథకంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని వేమూరు నియోజకవర్గ శాసన సభ్యులు నక్కా ఆనందబాబు శుక్రవారం ప్రారంభించారు. వేమూరు నుండి వెల్లటూరు వరకు బస్సులో మహిళతో ప్రయాణిస్తూ కొల్లూరు బస్టాండ్ సెంటర్లో మహిళను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ సూపర్ సిక్స్ లో భాగంగా ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించామని, రాష్ట్రం మొత్తం మీద రోజుకి 25లక్షల మంది మహిళలు ప్రయాణం చేస్తున్నారని



అంచనా ఉందని, దానికి వందల కోట్లు ఖర్చు అవుతుందని అయినా మహిళకు ఇచ్చిన హామీ ప్రకారం ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభిస్తుందాయని ఆయన అన్నారు. జగన్మోహనరెడ్డి రాష్ట్రాన్ని దివాలా తీయించాడని, అయినప్పటికీ సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీలన్ని నెరవేరుస్తున్నామని ఆయన అన్నారు. ఇప్పటికే నాలుగు వేల పెన్షన్, రాష్ట్రంలో 67లక్షల మందికి స్కూల్ పిల్లలకి తల్లికి వందనం ఇవ్వడం జరిగిందని, కొద్ది రోజుల క్రితం అన్నదాత సుఖీభవ క్రింద రూ.7వేలు రైతన్నకి ఇవ్వడం జరిగిందని ఇప్పటికే రెండు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వడం జరిగిందని ఆయన అన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం అమలుపరుస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూదన్‌ప్రసాద్, మరియు కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొల్లిపరలో 79 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

కొల్లిపర, ఆగస్టు 15 ప్రభాతవార్త: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు మండల గ్రామాలలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిపి భీమవరపు పద్మావతి జెండా ఎగురవేసి జెండా వందనం నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ గుమ్మడి సిద్ధార్థ జెండా



ఎగురవేసి విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ కోటేశ్వరరావు జాతీయజెండా ఎగురవేసి, విద్యార్థులకు గ్రామస్తులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఇదే విధంగా శ్రీలవతు రామిరెడ్డి జూనియర్ కళాశాలలో కళాశాల కార్యదర్శి అవుతు కృష్ణారెడ్డి, కొల్లిపర గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచ్ పిల్లి రాధికా గంగాధర్, వ్యవసాయశాఖ కార్యాలయంలో మండల వ్యవసాయాధికారి ఎన్.శ్రీనివాసరెడ్డి, విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ శాఖ డిప్యూటి ఇంజనీర్ కె.రాజశేఖర్ జెండాలను ఎగురవేసి మిఠాయిలు పంచిపెట్టారు. విశ్రాంత జిల్లా విద్యాశాఖాధికారి పి.మధుసూదన్‌రావు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పురస్కరించుకుని వల్లభాపురం వీరేశాపాలెంలో యువకులతో కలసి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో జాతీయ జెండాలను ఎగురవేసారు. ఆయా కార్యక్రమాలలో ఎంపీడీఓ విజయలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవో భార్గవ్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

కొల్లిపర, ఆగస్టు 15 ప్రభాతవార్త: కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యను అందుతుందని రిటైర్డు మండల



విద్యాశాఖాధికారి బసవటుంబరెడ్డి అన్నారు. శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవాలలో భాగంగా మండల కేంద్రం కొల్లిపర జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రజాప్రతినిధులు గ్రామపెద్దలు బహుమతులు అందజేసారు. ఈ సందర్భంగా బసవటుంబరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యార్థుల కోసం అనేక పౌష్టికపథకాలు కల్పిస్తుందన్నారు. ఆదేవిధంగా అత్తోట హైస్కూల్‌లో పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు గ్రామపెద్దలు కొఠారు ఆంజనేయులు, దాసరి నరసయ్యలు బహుమతులను అందజేసారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం ప్రారంభించిన మంత్రి నాదెండ్ల

తెనాలి టౌన్ ఆగస్ట్ 15 (ప్రభాతవార్త): రాష్ట్రప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన, సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఆగస్ట్15 స్వాతంత్ర్యదినోత్సవం రోజునుండి మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా స్త్రీశక్తిఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని, పట్టణంలోని ఆర్టీసీ డిపోలో, స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రికి డిపో మేనేజర్ రాజశేఖర్, ఉద్యోగులు, మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా



మంత్రి నాదెండ్ల మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా, స్వాతంత్ర్యదినోత్సవం రోజున రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రారంభిస్తున్నందుకు అనందంగా ఉందన్నారు. తమ ప్రభుత్వం ఆడబిడ్డలకు అండగా ఉంటుందన్నారు. మహిళలకు ఆర్థికంగా వెసులుబాటు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందన్నారు. అనంతరం మంత్రి నాదెండ్ల మనోహర్ ఆర్టీసీ బస్సులో తన టికెట్ కు డబ్బులు చెల్లించి తెనాలి నుండి విజయవాడ కు బస్సులో ప్రయానించారు. అయన వెంట కూటమి పార్టీల మహిళానాయకురాళ్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్

పొన్నూరు, ఆగస్టు 15, ప్రభాతవార్త: ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరే oద్రకుమార్ అన్నారు. స్థానిక ఆర్టీసి బస్సు డిపోలో శుక్రవారం స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పొన్నూరు డిపోలో 38సర్వీసులున్నాయని, ప్రతి రోజు 15వేల మంది ప్రయాణీకులు ప్రయాణిస్తున్నారన్నారు. వీరిలో సుమారు ఆరువేల మంది మహిళలున్నట్లు చెప్పారు.



అంటే ఈ పథకం ద్వారా ప్రతి రోజు సుమారు 6వేల మందికి ప్రయోజనం చేకూరే అవకాశం ఉందన్నారు. ఆర్థిక పరమైన ఇబ్బందులున్నప్పటికీ మహిళలకు ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేసే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమానికి ప్రధాన్యత ఇచ్చి ముందుకు సాగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక ప్రాంతాల్లో రోడ్లు నిర్మాణం చేపట్టామన్నారు. పొన్నూరు నియోజకవర్గంలో కూడా పెద్ద ఎత్తున రోడ్ల నిర్మాణం చేశామన్నారు. పట్టణంలో మాత్రమే కొద్ది మేర రోడ్డు నిర్మాణం మరమ్మత్తులు చేయాల్సి ఉందన్నారు. దీనికి రూ.2కోట్లు నిధులుమంజూరు అయ్యాయని త్వరలో ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో కొత్త పెన్షన్లను ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో 1.05లక్షల వితంతు పెన్షన్లు ఇవ్వడం జరిగిందన్నారు. మన నియోజకవర్గంలో 780మందికి కొత్త పించన్లను అందజేశామన్నారు. జగన్ ప్రభుత్వంలో వివిధ కారణాల చేత నియోజకవర్గంలో ఎనిమిది వేల పించన్లు తొలగించారన్నారు. రాష్ట్రంలో ఇబ్బందులున్నప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం పథకాలను అమలు చేస్తున్నామన్నారు. వైకాపా నాయకులు పథకాల లబ్ది పొందుతూ ప్లకార్డులు, ఫ్లెక్సీలు పట్టుకొని పథకాలు అందలేదని అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. వారికి దమ్ముంటే వారు తీసుకున్న పథకాలను తిరిగి వెనక్కు ఇచ్చేసి, ఇక మీదట పథకాలు తీసుకోకుండా ఉండగలరా.?అని సవాల్ విసిరారు. పథకాలు పొందుతూ విమర్శలు చేస్తున్నవారు ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. డిపో మేనేజర్ లంకా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు తమ ఆధార్‌కానీ, ఓటరు ఐడీకానీ, రేషన్‌కార్డు కానీ చూయించి ప్రయాణించవచ్చన్నారు. ఈ ఉచిత ప్రయాణం వల్ల ఆర్టీసి సంస్థకు కూడా ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఎంత మంది బస్సులో ప్రయాణిస్తే అంత మందికి సంబంధించిన నగదును ప్రభుత్వం ఆర్టీసి సంస్థకు చెల్లిస్తుందన్నారు. దీని ద్వారా ఆర్టీసి సంస్థ మనుగడకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయి ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు అన్నిటిని అమలు చేస్తున్నారన్నారు. ఈ విధంగా ఇచ్చిన మాట ప్రకారం పథకాలు అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి మద్దతు పలకాలని కోరారు. తొలుత రిబ్బన్ కట్‌చేసి ఉచిత ఆర్టీసి బస్సులను ప్రారంభించారు. తొలి టిక్కెట్‌ను ఓ మహిళకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. కొద్దిసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో వడ్రాణం మార్కండేయబాబు, గోవాడ వెంకటకృష్ణారావు, కలపాల శ్రీనివాసరావు, తోట ప్రసాద్, యరసాని శ్రీరామమూర్తి, బొప్పన బాపనయ్య, పఠాన్ పిరోజ్‌ఖాన్, షేక్ బాజిసాహెబ్, పఠాన్ అహమ్మద్‌ఖాన్, బొర్రు రామారావు, మాదల వెంకటేశ్వరరావు, బండ్లమూడి బాబూరావు, చలమశెట్టి సీతారామయ్య తదితరులున్నారు.

## సెప్టెంబరు 13న జాతీయ లోక్ అదాలత్

పొన్నూరు, ఆగస్టు 15, ప్రభాతవార్త: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ గుంటూరు వారి ఆదేశాల మేరకు సెప్టెంబరు 13వ తేదీన మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి పవన్ కుమార్ ఏకా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పొన్నూరుకోర్టు పరిధిలోని కక్షిదారులు ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు మనోవర్తి, కుటుంబ తగాదాలు, ప్రీలిటిగేషన్ కేసులు, బ్యాంక్ కేసులు తదితర కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు.

## యువజన విభాగం సంయుక్త కార్యదర్శిగా అమిరినేని



పొన్నూరు, ఆగస్టు 15, ప్రభాతవార్త: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన విభాగం సంయుక్త కార్యదర్శిగా పొన్నూరు పట్టణానికి చెందిన అమిరినేని సాంబశివరావును నియమించారు. అమిరినేని పార్టీ ఆవిర్భావం నుంచి వైకాపాలో క్రియాశీలకంగా కొనసాగుతుండడంతో సంయుక్త కార్యదర్శిగా నియమించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో పలువురు నాయకులు అమిరినేని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పార్టీకి అభివృద్ధికి అంకితభావంతో కృషి చేసివారికి పదవులు వాటంతటవే వస్తాయనడానికి అమిరినేని చక్కటి ఉదాహరణ అని చెప్పారు. అమిరినేనిని సముచితస్థానం కల్పించడం పట్ల పలువురురు నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా అమిరినేని మాట్లాడుతూ తనపై నమ్మకంతో కార్యదర్శింగా నియమించడం సంతోషంగా ఉందన్నారు. ఈ పదవి తనకు కేటాయించడం ద్వారా తన బాధ్యత మరింత పెరిగినట్లుగా భావిస్తున్నానన్నారు. భవిష్యత్‌లో పార్టీ అభివృద్ధికి, మళ్ళీ అధికారంలోకి వచ్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన సమన్వయకర్త అంబటి మురళీకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ కమీషన్ సభ్యు షేక్ సైఫుల్లా, సర్పంచి చుండూరు వీరయ్య, షేక్ నాజర్, అంబటి వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

## స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాలి

పొన్నూరు, ఆగస్టు 15, ప్రభాతవార్త: ఎంతో మహానుభావుల త్యాగాల ఫలితంగా సిద్ధించినటువంటి స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని సివిల్ జడ్జి పవన్ కుమార్ ఏకా



అన్నారు. స్థానిక సివిల్ జడ్జి కోర్టులో శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. తొలుత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జాతీయ గీతం ఆలపించారు. జాతీయ వందనం చేశారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ ఏకా మాట్లాడుతూ దేశంలో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వాలతోపాటు దాతలు, సంపన్నులు ముందుకు వచ్చి భాగస్వాములు కావాలన్నారు. స్వాతంత్ర్యం కోసం ఆనాడు ఉద్యమించిన ఉద్యమాలు, పోరాడినటువంటి నాయకులు, వారి త్యాగాలను గుర్తు చేసుకొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పొందుగల జయరాజు, బొనిగల రాజారావు, సుబ్బారావు, చిల్లర నాగరాజు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతులు పాడిపరిశ్రమ..వ్యవసాయం అభివృద్ధి చేసుకోవాలి

కొల్లిపర, అగష్టు 15 ప్రభాతవార్త: రైతులు పాడిపరిశ్రమ..వ్యవసాయం అభివృద్ధి చేసుకుంటే ఆర్థికంగా ఎదగవచ్చని సంఘం డెయిరీ మేనేజర్ దూళిపాళ్ళ రామకృష్ణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చివలూరు పాలకేంద్రంలో బోనస్ పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పాలకేంద్రం అధ్యక్షుడు నీలా మణిరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రామకృష్ణ మాట్లాడుతూ రైతులు ఆర్థికాభివృద్ధి కోసం డెయిరీ చైర్మన్ దూళిపాళ్ళ నరేంద్రకుమార్ తనవంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం 83 మంది రైతులకు 2 లక్షల 10 వేల రూపాయలను బోనస్‌గా పంపిణీ చేసారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకట్రావు, కార్యదర్శి బొమ్ము కోటిరెడ్డి, డెయిరీ అధికారులు, ఉప్పాల సందీఫ్‌కృష్ణ, అమ్మిశెట్టి హరికృష్ణ, గరికపాటి వెంకట్రావు, , పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పురపాలకసంఘం ఆధ్వర్యంలో ఉచితవైద్య శిబిరం:

తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట్ 15 (ప్రభాతవార్త): ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున, ప్రజల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా శుక్రవారం పురపాలక సంఘ ఆధ్వర్యంలో మహాత్మ పూలే కాలనీ నందు ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడింది. ఈ వైద్య శిబిరంలో ప్రజలకు రక్తపోటు, జలుబు, వైరల్ ఫీవర్ వంటి సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించబడినవి. రోగులకు అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేయబడ్డాయి. అలాగే, శుభ్రత, తాగునీటి వినియోగం, దోమల నివారణ వంటి రోగనిరోధక సూచనలు వైద్య బృందం వారు ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ఎం.లక్ష్మీ ్మపతిరావు, నందులపేట పిహెచ్సీ సిబ్బంది, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ యేసు బాబు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నతులుగా ఎదగాలి

పొన్నూరు, ఆగస్టు 15, ప్రభాతవార్త: విద్యార్థులు చక్కాగా విద్యనభ్యసించి ఉన్నతులుగా ఎదగాలని విశ్రాంత తెలుగు పండిట్ కాట్రగడ్డ శివకుమారి పిలుపునిచ్చారు. స్థానిక సాయినగర్‌లోని ఎన్ఎన్‌టి పబ్లిక్ స్కూల్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆమె మాట్లాడారు. చదువు ద్వారానే



అసమానతలు రూపుమాపవచ్చన్నారు. ప్రతి విద్యార్థి సరస్వతీదేవి అనుగ్రహాన్ని పొందాలన్నారు. విద్య ద్వారా సమాజంలో గౌరవం, ఐశ్వర్యం, గుర్తింపు లభిస్తుందన్నారు. ఎంతో మంది సామాన్యులు కూడా ఉన్నత విద్యాధికులుగా మారారంటే చదువు ద్వారానే అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ఉన్నత పదువులు అలంకరించిన వారందరూ సామాన్య, మధ్యతరగతికి చెందినవారే అయినప్పటికీ వారు విద్య ద్వారానే ఉన్నత పదవులు పొందారన్నారు. స్కూల్ డైరెక్టర్ కొలిపర్తి శివనాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పదోతరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన వెలిగందులు అనన్య, జ్యోతుల అక్షర, కెఎస్‌జిఎన్ సుబ్రహ్మణ్యంలకు శివకుమారి చేతుల మీదుగా నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ శివనాగేశ్వరరావు మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చే విధంగా విద్యార్థులు విద్యనభ్యసించి ప్రయోజకులు కావాలన్నారు. కృషి, పట్టుదల, చదవాలనే కసి ఉంటే విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యాలను చేరగలరన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులచే నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

## సంగం డెయిరీ నూతన ఉత్పత్తుల ఆవిష్కరణ

పొన్నూరు, ఆగస్టు 15, ప్రభాతవార్త: ఆరోగ్యకరమైన ఉత్పత్తులను అందించడంలో సంగం డెయిరీ మరో అడుగు ముందుకేసిందని సంగం డెయిరీ ఛైర్మన్, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. చేబ్రోలు మండలం, వడ్లమూడి సంగం డెయిరీలో శుక్రవారం నూతనంగా తయారు చేసిన పలు రకాల ఉత్పత్తులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ మాట్లాడుతూ వినియోగదారుల అభిరుచులకు తగ్గట్లుగా మైదా లేని బెల్లంతో తయారు చేసిన ఉత్పత్తులను



ఆవిష్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. జోవర్ కాజ్ కుకీస్, రాగి బాదం కుకీస్, షుగర్ ఫ్రీ రాగిలడ్డు, సున్నుండలను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆవిష్కరించడం జరిగిందన్నారు. జొన్నపిండి, జీడిపప్పు సమ్మేళనంతో జోవర్ కాజు కుకీస్, రాగి పిండి, బాదంపప్పుతో తయారు చేసిన రాగి బాదం కుకీస్, తక్కువ కేలరీలు కలిగిన మొక్కల నుండి పొందిన సహజ తీపి పదార్థాలు ఉపయోగించి, పంచదార లేకుండా రాగి లడ్డు, సును ్నండలను తయారు చేయడం జరిగిందన్నారు. వీటిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా నియంత్రివచ్చన్నారు. నూతన ఉత్పత్తుల ఆవిష్కరణలో పాలకవర్గ సభ్యులు, సీఈవో గోపాలకృష్ణన్, సీఎఫ్ఓ పెద్ది సాంబశివరావు, సీఓఓ పర్వతనేని అనిల్‌కుమార్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కుంకుమతో అమ్మవారికి అభిషేకం

పొన్నూరు, ఆగస్టు 15, ప్రభాతవార్త: పట్టణంలో కొలువై ఉన్న శ్రీ వాసవీ కాన్యకాపరమేశ్వరీ అమ్మవారికి శ్రావణ మాసం నాల్గవ శుక్రవారాన్ని పురస్కరించుకొని అమ్మవారికి విశేషార్చనలు నిర్వహించారు. మ్మవారిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపైకి వేంచేపు చేసి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం 150కిలోల కుంకుమతో కుంకుమార్చన అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి సంకల్పపూజ, తదితర పూజాధికార్యక్రమాలు నిర్వహించారు. లలితా సహస్రనామపారాయణ, సౌందర్యలహరి, శివానందలహరి పారాయణలను మహిళా భక్తులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. అమ్మవారికి నిర్వహించిన కుంకుమాభిషేకం భక్తులకు కనువిందు చేసింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు కారుమూరి ప్రకాష్ నేతృత్వంలో కోట రవి, కోట హేమసుందరగుప్తా, వక్కలగడ్డ మోహనరావు, కాంతారావు, రమేష్, ఆలపాటి నాగరాజు, అవ్వారు వెంకటేశ్వరరావు తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## ఉత్తమ సీనియర్ అసిస్టెంట్‌గా రామారావు

పొన్నూరు, ఆగస్టు 15, ప్రభాతవార్త: పొన్నూరు తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రామారావు ఉత్తమ అధికారిగా ప్రశంసాపత్రాన్ని పొందారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ అధికారులను గుర్తించి వారికి ప్రశంసా పత్రాలను ఇచ్చి ప్రోత్సహిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఉత్తమ సేవలందిస్తున్న రామారావుకు ఈసారి ఈ అవకాశం లభించింది. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రామారావును తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్, కార్యాలయ సూపరింటెండెంట్ ఆలేటి మాధవి, ఇతర సిబ్బంది అభినందించారు.



## హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

పొన్నూరు, ఆగస్టు 15, ప్రభాతవార్త: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. పట్టణంలో వివిధ వార్డుల్లో శుక్రవారం జరిగిన బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని చంద్రబాబునాయుడు ఎప్పుడూ అనుకోడన్నారు. అధికారంలోకి వచ్చేందుకు అలవికాని హామీలను ఇస్తాడని, అధికారంలోకి వచ్చాక వాటిని అటకమీదకు ఎక్కిస్తాడన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే ప్రశ్నించేవారిపై కేసులు నమోదు చేయించడం, పోలీసులతో బెదిరింపులకు పాల్పడడం వంటివి చేస్తుంటాడన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రైతులు పంటలను పూర్తిగా నష్టపోయారని, అయితే ఇంత వరకు నష్టపరిహారం లెక్కలను సేకరించలేదన్నారు. ఎంపిపి భవనం పద్మలీల, ఆకుల వెంకటేశ్వరరావు, అంబటి వెంకటేశ్వరరావు, అమిరినేని సాంబశివరావు, డేగల శ్రీరామమూర్తి, గేరా కుమారి, పీర్‌సాహెబ్, గేరా సంజీవ్, గోపిశెట్టి వాసు, మంద్రు అనిత, సుశోభిత పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


## సంగం డెయిరీలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

పొన్నూరు, ఆగస్టు 15, ప్రభాతవార్త: చేబ్రోలు మండలం, వడ్లమూడి సంగం డెయిరీలో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జాతీయ వందనం చేశారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ సంగం డెయిరీ అభివృద్ధిలో పాల ఉత్పత్తిదారులు, సంగం డెయిరీ పాలకవర్గ సభ్యులు, ఉద్యోగులు తమవంతు పాత్ర పోషించారన్నారు. ఎంపిడి గోపాలకృష్ణన్, సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.



## ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలవాలి

పొన్నూరు, ఆగస్టు 15, ప్రభాతవార్త: ప్రపంచంలో అగ్రస్థానంలో నిలవడం కోసం కాదు, ఇతరదేశాలకు ఆదర్శంగా నిలవడం కోసం అన్ని సూచనలు మనకు అనుకూలంగా ఉన్నాయని విజ్ఞాన్స్ వర్సిటీ వైస్ చాన్సలర్, కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ అన్నారు. చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో జరిగిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలనుద్దేశించి ఆయన మాట్లాడారు. భారత ఒక వెనుకబడిన దేశం నుంచి



అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా మారిందన్న గర్వం మనకుండాలన్నారు. స్వాతంత్ర్యం అంటే అన్ని ఆటంకాల నుండి విముక్తి, పేదరికం నుండి విముక్తి, కష్టాల నుండి విముక్తి, చివరికి ఆనందాన్ని అనుభవించే స్వేచ్ఛని తెలియజేశారు. నిజమైన స్వాతంత్ర్యం అంటే ప్రతి పౌరుడు స్వేచ్ఛను అనుభవించడమేనన్నారు. ప్రతి పౌరుడు సంతోషంగా జీవించినప్పుడే ఆ స్వేచ్ఛకు అర్థం ఉంటుందన్నారు. మహాత్మాగాంధీ అనుసరించిన అహింస అనే వ్యూహం వలనే మనకు స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. ఈ వ్యూహం భారత దేశానికి శాంతి ప్రియ దేశంగా మలచుకునే బలమైన పునాదిని ఇచ్చిందన్నారు. విజ్ఞాన్స్ రిజిస్ట్రార్ డాక్టర్ డి.విజయరాము మాట్లాడుతూ దేశం ఎంత ప్రగతి సాధించినా.....ఇంకా చేయాల్సింది, ప్రయాణించాల్సింది మిగిలే ఉంటుందన్నారు. వర్సిటీ అడ్వైజర్, మాజీ డీజీపి మాలకొండయ్య, ఫర్మాసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర పి.శ్రీనివాసబాబు, లారా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఫణీంద్రకుమార్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# భారత్, పాక్ మధ్య భీకర పోరు




## సెప్టెంబరు 14న హై ఓల్టేజ్ మ్యాచ్

## ఆసియా కప్‌లో ఆధిపత్యమెవరిదో?

**న్యూఢిల్లీ:** ఆసియా కప్ 2025కు ఇంకా ఒక నెల కన్నా తక్కువ సమయం మాత్రమే ఉంది. ఈ టోర్నమెంట్ సెప్టెంబర్ 9 నుంచి ప్రారంభమవుతుంది. నిరసనలు, బహిష్కరణ పిలుపులు, సరిహద్దులో కొనసాగుతున్న ఉద్రిక్తతల మధ్య, భారత్ వర్సెస్ పాకిస్తాన్ సెప్టెంబర్ 14న తమ మొదటి మ్యాచ్‌లో తలపడనున్నాయి. రెండు జట్లు సూపర్ 4కు చేరుకుంటే, ఆ మ్యాచ్ కూడా యుఎఇలోనే జరుగుతుంది. అక్కడి నుంచి ఫైనల్‌కు చేరుకుంటే, ఈ మైదానం మూడోసారి ఇరు జట్ల మధ్య జరిగే మూడో మ్యాచ్‌కు సాక్ష్యంగా నిలుస్తుంది. 8 జట్ల టోర్నమెంట్ విజేతను సెప్టెంబర్ 28న నిర్ణయిస్తారు. ఈ టోర్నమెంట్ యుఎఇలో టి20 ఫార్మాట్‌లో జరగనుంది. ప్రతి ఈవెంట్ లాగానే, భారత్ వర్సెస్ పాకిస్తాన్ ఇందులో కూడా ఒకే గ్రూప్ (ఎ)లో ఉన్నాయి. యుఎఇ లేదా ఒమన్ ఓటమిని చవిచూడకపోతే, ఇరు జట్లు సూపర్4 రౌండ్‌లో కూడా తలపడటం దాదాపు ఖాయం. రెండు జట్లు సూపర్4లో కూడా మొదటి, రెండవ స్థానంలో నిలిచినట్లయితే, ఫైనల్‌లో కూడా తలపడతారు. ఇక ప్రస్తుత ఫామ్‌ను పరిశీలిస్తే, గత ఏడాదిలో టి20 ప్రపంచ కప్‌ను గెలుచుకున్న టీం ఇండియా పైచేయి సాధించినట్లు కనిపిస్తోంది. బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ వంటి జట్లను ఓడించింది. మరోవైపు, పాకిస్తాన్ ప్రదర్శన ఒడిదుడుకులతో నిండి ఉంది. రెండు జట్ల మధ్య గ్రూప్ దశతో సహా అన్ని మ్యాచ్‌లు దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరుగుతాయి. ఇక్కడ పాకిస్తాన్ స్వల్ప పైచేయి సాధించింది. ఈ స్టేడియంలో భారత్, పాక్ మధ్య మొత్తం 3 టి20 మ్యాచ్‌లు జరిగాయి. వాటిలో పాక్ 2 గెలిచింది. భారత జట్టు ఒక మ్యాచ్ గెలిచింది. మూడు సంవత్సరాల క్రితం జరిగిన ఆసియా కప్‌లో, భారత్ వర్సెస్ పాకిస్తాన్ ఈ మైదానంలో రెండుసార్లు తలపడ్డాయి. ఒక్కొక్క మ్యాచ్ గెలిచాయి. పాక్ గెలిచిన ఒక అదనపు మ్యాచ్ 2021 టీ20 ప్రపంచ కప్‌లో ఇండియాను ఓడించింది. యాదృచ్ఛికంగా, ఆ ప్రపంచ కప్, ఆ తర్వాత ఆసియా కప్‌లో ఇండియా ఫైనల్‌కు చేరుకోలేకపోయింది. అయితే సూర్యకుమార్ నాయకత్వంలో, గౌతమ్ గంభీర్ శిక్షణలో ఉన్న భారత జట్టు బలాన్ని చూస్తే, పాత రికార్డు దానిపై ఎలాంటి ప్రభావం చూపదని అనిపిస్తుంది. ఈ జట్టు గత ఏడాదిలో విభిన్న సామర్థ్యాలు, విభిన్న పరిస్థితులలో ఉన్న జట్లను ఓడించింది. ఇటువంటి పరిస్థితిలో, మరోసారి భారత జట్టు టైటిల్ కోసం పోటీదారుగా ఉంటుంది.




## మహిళల 50 ఓవర్ల

# సిరీస్ భారత్‌దే

### ఆస్ట్రేలియాపై 2 వికెట్లు తేడాతో గెలుపు

**న్యూఢిల్లీ:** మహిళల 50 ఓవర్ల సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియాపై టీమిండియా విజయం సాధించింది. బ్రిస్బేన్‌లో శుక్రవారం ఆస్ట్రేలియాతో జరిగిన రెండో మ్యాచ్‌లో యాస్టికా భాటియా, రాధా యాదవ్, తనూజా కన్వర్ అర్ధ సెంచరీలు చేయడంతో రెండు వికెట్ల తేడాతో టీమిండియా కైవసం చేసుకుంది. మొదట బ్యాటింగ్ ఎంచుకున్న అలిస్సా హీలీ 87 బంతుల్లో 91 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 265/9 పరుగులు చేసింది. మిగిలిన బ్యాటింగ్ లైనప్ అత్యుత్తమ ప్రదర్శనలు ఇవ్వలేదు భారత్ తరఫున, ఆఫ్‌స్పిన్ బౌలింగ్ ఆల్ రౌండర్ మిన్ను మణి (3-46), పేసర్లు సైమా ఠాకూర్ (2-30) అత్యుత్తమ వికెట్లు పడగొట్టగా, రాధా, తనూజ, ప్రేమ రావత్, టిటాస్ సాధు తలా ఒక వికెట్ తీసుకున్నారు. ఇక 266 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో, యాస్టికా భాటియా 71 బంతుల్లో 66 పరుగులు చేసి నిలదొక్కుకుంది. ఇది ఈ సిరీస్‌లో ఆమె వరుసగా రెండో అర్ధ సెంచరీ. కానీ షఫాలీ వర్మ, తేజల్ హసబ్నిస్, రాఘవ్వీ బిస్ట్ 37 పరుగులు సాధించడంతో, ఇండియా 39వ ఓవర్‌లో 193/7కి పడిపోయింది. కెప్టెన్ రాధా 78 బంతుల్లో 60 పరుగులు చేసి ఔటవడంతో, భారత ఓటమి ఖాయమని చాలామంది భావించారు. కానీ తనుజ, ప్రేమ 8వ వికెట్‌కు 62 బంతుల్లో 68 పరుగుల అద్భుతమైన భాగస్వామ్యాన్ని పంచుకున్నారు. తనుజ 57 బంతుల్లో కీలకమైన 50 పరుగులు చేసి స్క్వేర్ షాట్‌లకు మద్దతును అందించగా, ప్రేమ 33 బంతుల్లో అజేయంగా 32 పరుగులు చేసి ఆటను మలుపు తిప్పింది. దీంతో ఒక బంతి మిగిలి ఉండగానే టీమిండియా 49.5 ఓవర్లలో 266/8తో గెలుపొందింది.

## ప్రపంచ క్రీడల్లో.. ఆనంద్‌కు

# తొలి రోలర్ పతకం




**న్యూఢిల్లీ:** ప్రపంచ క్రీడలు-2025లో భారత దేశపు మొట్ట మొదటి రోలర్ స్పోర్ట్స్ పతకాన్ని ఆనంద్‌కుమార్ వెల్‌కుమార్ గెలుచుకున్నాడు. శుక్రవారం చైనాలోని చెంగ్డులో జరిగిన ఇన్‌లైన్ స్పీడ్ స్కేటింగ్ ట్రాక్ ఈవెంట్‌లో కాంస్యం సాధించడం ద్వారా ఆనంద్ చరిత్ర సృష్టించాడు. దీంతో ప్రపంచ క్రీడల్లో భారతదేశం తొలిసారిగా రోలర్ స్కేటింగ్ పతకాన్ని గెలుచుకున్న రికార్డు నమోదు చేసింది. పురుషుల 1000 మీటర్ల స్ప్రింట్ ఈవెంట్‌లో ఆనంద్ 1:22.482 సెకన్లసమయంతో పతకాన్ని గెలుచుకున్నాడు. ఈ మెడల్‌తో భారతదేశం యొక్క పతకాల సంఖ్యను 3 పతకాలకు (1 రజతం, 2 కాంస్య) తీసుకువెళ్లాడు. ఒకే ఎడిషన్‌లో భారత్ సాధించిన అత్యధిక పతకాల సంఖ్య ఇది. ఆనంద్ 1:22.151 సెకన్ల సమయంతో ప్రాథమిక రౌండ్‌లో మూడవ స్థానంలో నిలిచి, తోటి భారత ఆటగాడు ఆర్యన్‌పాల్ సింగ్ ఘుమాన్‌తో కలిసి సెమీఫైనల్‌కు చేరాడు. ఆ తర్వాత అతను సెమీఫైనల్స్‌లో తన సమయాన్ని మెరుగుపరుచుకుని, మొదటి హీట్‌లో అద్భుతమైన 1:20.355 సెకన్లతో రెండవ స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించాడు. తదుపరి అదే హీట్‌లో 6వ స్థానంలో నిలిచిన ఆర్యన్‌పాల్ పోటీ నుండి నిష్క్రమించాడు. ఆనంద్‌కుమార్ చాలా వ్యూహాత్మకంగా ఫైనల్ రేసును చేరుకున్నాడు. అక్కడ అతను ఇద్దరు కొలంబియన్లు, ఒక స్పానిష్ స్కేటర్ తరువాత 4వ స్థానంలోనిలిచాడు. కానీ అదృష్టం అతనికిఅనుకూలంగాఉండటంతో, కొలంబియన్ స్కేటర్లలో ఒకరైన జువాన్ జాకోబో మాంటిల్లా పినిల్లా అనర్హుడిగా ప్రకటించబడ్డాడు. దీంతో ఆనంద్‌కుమార్ కాంస్య పతక విజేతగా ఎంపికయ్యాడు.

## పురుషుల హాకీ నేషనల్స్..

# చండీఘర్, ఉత్తరాఖండ్ విజయం

### హిమాచల్, కాశ్మీర్ డ్రా




**న్యూఢిల్లీ:** హాకీ ఇండియా జూనియర్ పురుషుల జాతీయ ఛాంపియన్‌షిప్‌లో డివిజన్ బి మ్యాచ్‌లలో చండీగఢ్, ఉత్తరాఖండ్‌లు విజయం సాధించగా, హిమాచల్, జమ్మూ కాశ్మీర్‌లు డ్రాతో సరిపెట్టుకున్నాయి. హిమాచల్, జమ్మూ కాశ్మీర్ మధ్య శుక్రవారం జరిగిన మ్యాచ్ 5-5తో డ్రాగా ముగియగా, ఇరు జట్లు ఒక పాయింట్‌ను పంచుకున్నాయి. కాశ్మీర్ తరపున కెప్టెన్ రాజ్‌వీర్ సింగ్ (1, 19, 34) స్కోరింగ్ ఫామ్‌లో ఉండి హ్యాట్రిక్ సాధించాడు. అతని జట్టులో రోహన్‌ప్రీత్ సింగ్ (51), గమన్‌ప్రీత్ సింగ్ (56)లు కూడా గోల్స్ చేశారు. హిమాచల్ తరపున గౌరవ్ కుమార్ (43, 53) రెండు గోల్స్ సాధించగా, అనుజ్ (15), ప్రన్షు చౌదరి (18), సుఖ్‌మన్‌ప్రీత్ సింగ్ (27) కూడా స్కోర్‌షీట్‌లో ఉన్నారు. రెండవ మ్యాచ్‌లో చండీగఢ్ పూల్ ఎ మ్యాచ్‌లో అరుణాచల్‌పై 4-3 తేడాతో స్వల్ప విజయం సాధించింది. విజేత జట్టుకు రిషవ్ (8), ముహమ్మద్ జాయిద్ (19), ఫతే సింగ్ (31), ప్రభ్జోత్ సింగ్ (33) గోల్స్ చేశారు. కెప్టెన్ అమర్‌జీత్ సింగ్ (17, 36, 53) హ్యాట్రిక్ గోల్స్ చేయడం ద్వారా అద్భుత నైపుణ్యాలను ప్రదర్శించాడు. అయితే, నాలుగు క్వార్టర్లలో అరుణాచల్ ఒక్క గోల్ కూడా చేయలేకపోయింది. ఈ రోజు జరిగిన చివరి మ్యాచ్‌లో ఉత్తరాఖండ్, అస్సాంపై 8-1 తేడాతో ఆధిపత్య విజయం సాధించింది. ఉత్తరాఖండ్ తరపున మహేంద్ర సింగ్ బిష్ట్ (33, 37), రోహిత్ ఐరీ (32, 45), సూరజ్ కుమార్ (55, 60), విశాల్ కుమార్ (2), నవీన్ ప్రసాద్ (14) గోల్స్ సాధించారు. అస్సాం తరపున రోహన్ ఎక్కా (29) ఏకైక గోల్ చేశాడు.




## స్టీపుల్‌చేజ్‌లో..స్వర్ణంతో

# మెరిసిన అంకిత

**న్యూఢిల్లీ:** డబ్ల్యూఎటిసి-సిల్వర్ లెవల్ మీట్, గ్రాండ్‌స్లామ్ జెరూసలేంలో ఒలింపియన్ అంకితా ధ్యాని 2000 మీటర్ల మహిళల స్టీపుల్‌చేజ్ జాతీయ రికార్డును బద్దలు కొట్టి బంగారు పతకాన్ని గెలుచుకుంది. శుక్రవారం జరిగిన ఈవెంట్‌లో అంకిత 6:13.92 సెకన్ల సమయంతో టైటిల్‌ను గెలుచుకుని, పరుల్ రికార్డును 0.46 సెకన్ల తేడాతో అధిగమించింది. దీంతో ఆమెను ఈ విభాగంలో ఆల్‌టైమ్ ఆసియా టాప్ లిస్ట్‌లో రెండవ స్థానానికి చేర్చింది. ఈసారి ఆమెను 2025లో టాప్ 10 అత్యుత్తమ ర్యాంకుకు తీసుకువెళుతుంది. ఈ విజయం మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌చేస్ ఈవెంట్‌లో రోడ్ టు టోక్యో రేసుకు భారీ ర్యాంకింగ్ పాయింట్లను పొందడంలో ఆమెకు సహాయపడుతుంది. దాదాపు 1,200 పాయింట్ల లాభంతో, అంకిత రోడ్ టు టోక్యో ర్యాంకింగ్స్‌లో 35వ స్థానానికి ఎగబాకుతుందని అంచనా. ఈ టోర్నమెంట్ ఈ నెలాఖరులో ముగియనుంది. కాగా అంకిత ఈ సంవత్సరం అసాధారణ ఫామ్‌లో ఉంది. ఈ సంవత్సరం తన 3000 మీటర్ల స్టీపుల్‌చేస్ వ్యక్తిగత ఉత్తమ ప్రదర్శన నుండి దాదాపు ఒక నిమిషం తక్కువ చేసి 2025 ప్రపంచ విశ్వవిద్యాలయ క్రీడలలో చారిత్రాత్మక రజత పతకాన్ని సాధించింది.

## అక్టోబరునాటికి ఇండో-యుఎస్

# వాణిజ్య ఒప్పందం

### 25న అమెరికా బృందం భారత్‌కు రాక: వాణిజ్య కార్యదర్శి సునీల్ బర్త్వల్



**న్యూఢిల్లీ,ఆగస్టు 15:** అమెరికాభారత్ వాణిజ్య ఒప్పందం చివరి దశకు వచ్చింది. ఇరు దేశాల మధ్య ఒప్పందం సెప్టెంబర్, అక్టోబర్ నాటికి పూర్తవుతుందని వాణిజ్య కార్యదర్శి సునీల్ బర్త్వల్ తెలిపారు. ఇందుకోసం అమెరికా ముమ్మరంగా చర్చలు చేస్తున్నట్లు చెప్పారు. తదుపరి చర్చల కోసం అమెరికా బృందం ఆగస్టు 25న భారత్‌కు వస్తుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఐదు సార్లు వాణిజ్య ఒప్పంద చర్చలు జరిగాయి. తాజాగా ఆరో విడత చర్చల కోసం ఆగస్టు చివరి వారంలో అమెరికా బృందం భారత్‌కు రానుంది. భారత్‌తో వాణిజ్య చర్చలపై అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెస్సెంట్ కీలక వ్యాఖ్యలు చేసిన తరుణంలో భారత్ ఈ మేరకు స్పందించింది. అంతకుముందు అమెరికాతో వాణిజ్య ఒప్పందంలో భారత్ కాస్త మొండిగా వ్యవహరిస్తోందని అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెస్సెంట్ వ్యాఖ్యానించారు. సుంకాలు విధించినప్పటికీ వాణిజ్య చర్చల విషయంలో భారత్ కాస్త కూడా వెనక్కి తగ్గడం లేదని అన్నారు. దీనివల్ల చర్చలు నెమ్మదిగా సాగుతున్నట్లు వెల్లడించారు. స్విట్జర్లాండ్, భారత్ సహా ఇంకా కొన్ని పెద్ద వాణిజ్య ఒప్పందాలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. అక్టోబర్ నాటికి సుంకాలకు సంబంధించిన చర్చలను ముగించే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఇందుకు అనుగుణంగా ట్రంప్ యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయొద్దని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించినా భారత్ పట్టించుకోలేదు. దీంతో భారత్‌పై 50శాతం సుంకాల భారాన్ని మోపారు. ముందుగా 25శాతం సుంకాలను విధించిన ఆయన, ఆ తర్వాత దానిని మరో 25 శాతం పెంచి 50 శాతానికిచేశారు. అయితే, ట్రంప్ టారిఫ్‌లకు భారత్ కూడా దీటుగా స్పందించింది. దేశంలోని రైతులు, పాలఉత్పత్తుల రంగం, మత్స్య కారుల ప్రయోజ నాలే తమకు ముఖ్యమని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. అవసరమైతే ఆ భారాన్ని తామే మోస్తామని భరోసా ఇచ్చారు. టారిఫ్‌ల నేపథ్యంలో ఇరుదేశాల మధ్య సంబంధాల్లో ఉద్రిక్తతలు కొనసాగు తున్నప్పటికీ భారత్‌తో పూర్తిస్థాయి చర్చల్లో పాల్గొంటామని అమెరికా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి టామీ పిగోట్ ఇప్పటికే స్పష్టం చేశారు. అమెరికా తాజాగా పెంచిన సుంకాలు అమల్లోకి రాకముందే ఆదేశంతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి భారత్ చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల కోసం ప్రధాని నరేంద్ర మోడీ త్వరలో అమెరికా పర్యటనకు వెళ్లనున్నట్లు అధికార వర్గాలు చెప్పాయి.




## జిఎస్టీలో ఇక రెండే శ్లాబులు!

### దీపావళినాటికి అమలుచేసే లక్ష్యం

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** నిత్యావసరాల ఉత్పత్తుల్లో కొనుగోలుచేసే వస్తువులపై జిఎస్టీ రేట్లు తగ్గిస్తామని ప్రధాని మోడీ ప్రకటించారు. దీపావళి నాటికి రేట్లు తగ్గించి పండగ ఆనందం రెట్టింపు చేస్తామన్నారు. ఆర్థిక మంత్రిత్వశాఖ కూడా జిఎస్టీపై కీలకప్రకటనచేసింది. జిఎస్టీలో ఇకపై రెండు శ్లాబులే ఉంటాయని కొన్ని ఉత్పత్తులకు మాత్రమే ప్రత్యేక రేట్లు వర్తిస్తాయని తెలిపింది. ప్రస్తుతం 5,12,18,28 శాతం శ్లాబులున్నాయి. గత ఎనిమిదేళ్లలో జిఎస్టీపరంగా తమ ప్రభుత్వం అనేకసంస్కరణలు తెచ్చిందని ప్రధానిమోడీ ఎర్రకోట బురుజుపైనుంచి ప్రసంగిస్తూ చెప్పారు. మలివిడత సంస్కరణలు తెస్తున్నామని సామాన్యులకు ఉపశమనం కలుగుతుందన్నారు. సూక్ష్మ, చిన్న, మద్యతరహా పరిశ్రమలకు కూడా మేలుజరుగుతుందన్నారు. నిత్యం వినియోగించే వస్తువులు ధరలు తగ్గడంవల్ల దేశ ఆర్థికవ్యవస్థ మరింతశక్తివంతం అవుతుందని ఆయన అన్నారు. కేంద్ర రాష్ట్రాలకు చెందిన మంత్రులతో కూడిన బృందాన్ని జిఎస్టీ కౌన్సిల్ ఏర్పాటు చేసింది. వీటిలో స్టాండర్డ్, మెరిట్ వంటి రెండురేట్లు మాత్రమే ఉంటాయని వివరించింది.

## 27.35 బిలియన్ డాలర్లకు

# పెరిగిన వాణిజ్యలోటు!

**వాణిజ్యం**




చజొ=కోశఖ్ఖ్మ్ము?(గమీ్స్నబ’**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** భారత్ ఎగుమతులు రెండునెలలుగా క్షీణత నమోదుచేసిన తర్వాత జులైలో మళ్లీ పుంజుకున్నాయి. 7.29శాతం వృద్ధితో 37.24 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. దిగుమతులు 8.6శాతంపెరిగి 64.59 బిలియన్ డాలర్లకు చేరాయి. ఫలితంగా వాణిజ్యలోటు 8 నెలల గరిష్టమైన 27.35 బిలియన్ డాలర్లుగా ఉంది. గత ఏడాది నవంబరులో 31.77 బిలియన్ డాలర్ల లోటు తర్వాత ఇదే అత్యధిక వాణిజ్యలోటు. ఏప్రిల్ జులై నెలలమధ్యలో ఎగుమతులు 149.2 బిలియన్ డాలర్లు ఉంటే దిగుమతులు 125.52 బిలియన్ డాలర్లకుపెరాగాయి. గత ఏడాదితోపోలిస్తే ఎగుమతులు 3.07శాతం, దిగుమతులు 5.36శాతం చొప్పున పెరిగాయి. వాణిజ్యలోటు 94.81 బిలియన్ డాలర్లుగా ఉంది. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు ఉన్నప్పటికీ భారత్ వస్తుసేవల ఎగుమతులు మెరుగైన వృద్ధిని సాధించాయని వాణిజ్యకార్యదర్శి సునీల్‌వర్త్వాల్ అన్నారు. ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ రత్నాభరణాలు, ఔషధ,రసాయనాల రంగాలు ఇందుకుదన్నుగా నిలిచాయి. అంతర్జాతీయ ఎగుమతుల వృద్ధికంటే మన ఎగుమతుల వృద్ధి అధికంగా ఉంది. జులైలో ఇంజినింగ్ 13.75శాతం వృద్ధితో 10.42 బిలియన్‌డాలర్లు ఎలక్ట్రానిక్స్ 34శాతం వృద్ధితో 3.76 బిలియన్ డాలర్లు, రత్నాభవరణాలు 29శాతంపెరిగి 2.4బిలియన్ డాలర్లు, ఔషధాలు 14శాతంపెరిగి 2.7 బిలియన్ డాలర్లు, రసాయనాలు 7.19శాతం పెరుగుదలతో 2.46 బిలియన్ డాలర్లు నమోదుచేసాయి. ఇక పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు 25శాతం తగ్గి 4.34 బిలియన్ డాలర్లకుచేరాయి. ముడిచమురు పసిడి దిగుమతులు వరుసగా 7.46శాతం, 13.83శాతం పెరిగి 15.57 బిలియన్ డాలర్లు, 3.93 బిలియన్‌డాలర్లుగా ఉన్నాయి. సేవలరంగంలో ఎగుమతులు జులైలో 30.60 బిలియన్ డాలర్లుకాగా ఈఏడాది గతనెలలో 31.03 బిలియన్ డాలర్లు అయ్యాయి. అలాగే సేవలరంగ దిగుమతులు కూడా 15.40 బిలియన్ డాలర్లవరకూ ఉన్నట్లు అంచనా. జులైలో అమెరికాకు 19.94శాతంపెరిగి 8.01 బిలియన్ డాలర్ల ఎగుమతులుజరిగితే దిగుమతులు 13.78శాతంపెరిగి 4.55 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. చైనాకు ఎగుమతులు 27.39శాతంపెరిగి 1.34బిలియన్ డాలర్లు, దిగుమతులు 19.97శాతం పెరిగి 5.75 బిలియన్‌డాలర్లుగా ఉన్నట్లు వాణిజ్య మంత్రిత్వశాఖ ప్రకటించింది.

# వారాంతంలో స్వల్పంగా తగ్గిన పసిడి!



**ముంబయి, ఆగస్టు 15:** వారాంతంలో పసిడిధరలు కొంతమేర తగ్గాయి. లక్ష రూపాయలు దాటిన బంగారం ధరలు మళ్లీ కిందకు దిగివస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాల ప్రభావం బులియన్‌పై స్పష్టంగా కనిపిస్తోంది. ఈ రోజు 100 గ్రాముల పసిడి ధర రూ.1100 తగ్గింది. ఇండియా అమెరికా దేశాల మధ్య జరుగుతున్న సుంకాల వార్ దెబ్బకి పసిడి ధరల్లో విపరీతమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఆగస్టు తొలి వారంలో 10 గ్రాముల ధర దాదాపు రూ. 7 వేలకు పైగానే పెరిగింది. వచ్చే పండుగ సీజన్ నేపథ్యంలో ధరలు ఇంకా తగ్గే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆగస్టు 15 శుక్రవారం బంగారం ధరలను పరిశీలిస్తే 24 క్యారట్ల గ్రాము బంగారం 11 రూపాయలు తగ్గింది. ప్రస్తుతం గ్రాము బంగారం ధర రూ.10,124 వద్ద ట్రేడ్ అవుతోంది. ఇక 22 క్యారట్ల గ్రాము బంగారం ధర 9,280 వద్ద ట్రేడ్ అవుతోంది. ఇక 18 క్యారట్ల గ్రాము బంగారం ధర రూ.7,593 వద్ద ట్రేడ్ అవుతోంది. 100 గ్రాముల 24 క్యారెట్ల బంగారం రూ.1100 తగ్గి రూ. 10,12,400 వద్ద ట్రేడ్ అవుతోంది. అలాగే 22 క్యారట్ల బంగారం ధర 100 గ్రాములు రూ.1000 తగ్గి రూ. 9,28,000 వద్ద ట్రేడ్ అవుతోంది. 18 క్యారట్ల బంగారం ధర రూ.800 తగ్గి 100 గ్రాములు రూ.7,59,300 వద్ద ట్రేడ్ అవుతోంది. హైదరాబాద్ నగరంలో నేడు బంగారం ధరలను చూసినట్లయితే 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,01,240 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.92,800 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.75,930 గా నమోదైంది. విజయవాడ విషయానికి వస్తే..10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,01,240 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.92,800 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.75,930 గా నమోదైంది. చెన్నైలో బంగారం ధరలను పరిశీలించినట్లయితే 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,01,240 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.92,800 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.76,700 గా నమోదైంది. ముంబైలో బంగారం ధరలను పరిశీలించినట్లయితే10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,01,240 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.92,800 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.75,930 గా నమోదైంది.

## ఎస్ అండ్ పి గ్లోబల్..

## భారత్ రేటింగ్ 'ట్రిపుల్ బి'



**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** భారత్ సార్వభౌమ క్రెడిట్‌రేటింగ్ ట్రిపుల్ బికి పెరిగింది. ఎస్ అండ్ పి గ్లోబల్‌రేటింగ్స్ 18 ఏళ్ల తర్వాత మన దేశ క్రెడిట్‌రేటింగ్ సవరించింది. బలమైన ఆర్థికవృద్ధి ఉందని, భవిష్యత్ అంచనాను స్థిరత్వంగా సవరించింది. ప్రపంచంలోని అత్యుత్తమ ఆర్థిక వ్యవస్థల్లో భారత్ కూడా ఒకటి అని వెల్లడించింది. ఐదారేళ్లనుంచి ప్రభుత్వ వ్యయాల్లో ఉన్నత ప్రమాణాలున్నాయని వెల్లడించింది. అమెరికా ట్యారిఫ్‌ల ప్రభావం భారత ఆర్థికవ్యవస్థపై అంతగా ప్రభావం చూపించవని కూడా స్పష్టంచేసింది. అమెరికాకు మన దేశ ఎగుమతులపై 50శాతంసుంకాలు విధించినా వృద్ధి మందగించబోదని వాణిజ్యంపై భారత్ తక్కువ ఆధారపడిందని, సుమారు 60శాతం ఆర్థికవృద్ధి దేశీయ వినియోగంనుంచే వస్తోందని వెల్లడించింది. రేటింగ్ సవరణపై ఆర్థిక మంత్రిత్వశాఖ సంతోషం వ్యక్తంచేసింది. ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో మన దేశ ఆర్థికవ్యవస్థ చురుగ్గా ముందుకుసాగుతోందని ఎస్అండ్‌పి తన సోషల్‌మీడియాలోపోస్టుచేసింది.

## భారీ రుణభారంలో అమెరికా!

### 37 లక్షలకోట్ల డాలర్లకు చేరిన రుణం

**న్యూయార్క్, ఆగస్టు 15:** ప్రపంచదేశాలపై సుంకాలు విధించి అమెరికా తన ఆర్థికలోటును తగ్గించుకోవాలని చూస్తున్నప్పటికీ రుణభారంలో అగ్రగామిగా నిలిచింది. మొత్తం రుణదాతలకు అమెరికా ఇప్పటివరకూ 37 లక్షలకోట్ల డాలర్లు చెల్లించాల్సి ఉంది. అమెరికా జిడిపిలో 122శాతానికి సమానం. మూడునెలలకు రుణభారం సుమారు లక్షలకోట్ల డాలర్లుపెరుగుతోంది. 2020 కొవిడ్‌సమయంలో అత్యధికంగా రుణాలు, జిడిపి నిష్పత్తిలో రుణాలు 133శాతానికి చేరింది. ప్రపంచంలోనే ఈనిష్పత్తి అధికంగా ఉన్న మొదటి పదిదేశాల్లో అమెరికా కూడాఉంది. అమెరికా ఆర్థికవ్యవస్థ పరిమాణం 30.3 లక్షలకోట్లు డాలర్లుకాగా ఆదేశ రుణభారం అంతకుమించి 37 లక్షలకోట్ల డాలర్లుగా ఉంది. పన్నువసూళ్ల కంటే వ్యయాలు అధికంగాచేస్తే లోటు వస్తుంది. ఈ లోటు భర్తీకి రుణాలపైనే ఆధారపడాలి. ప్రస్తుతం రుణపరిమితిని అమెరికా కాంగ్రెస్ నిర్దేశిస్తుంది. పరిమితి చేరుకున్న తర్వాత కాంగ్రెస్ పెంచకపోతే ప్రభుత్వ రుణాలు తీసుకోవడం సాధ్యంకాదు. 37 లక్షలకోట్ల డాలర్లలో 27 లక్షలకోట్లు డాలర్లు దేశీయంగా తీసుకున్నవే. మొత్తంరుణాల్లో అమెరికా ప్రైవేటు పెట్టుబడిదారులు 42శాతం వాటాగా ఉంటే ప్రభుత్వసంస్థలు ట్రస్టుల వాటా 20శాతంగాను ఫెడ్‌రజర్వువాటా 13శాతంగాను విదేశీ పెట్టుబడి దార్ల వాటా 25శాతంగా ఉంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14